జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

సంపుటి: 41 సంచిక: 6 విజయవాడ 20-7-2008 పేజీలు : 12 వెల: రు 5.00

లోపలి పేజీలలో.....

కామ్రేడ్ టి.ఎన్. చూపిన బాటలో పయనిద్దాం!



విప్లవోద్యమ నిర్మాణం, విప్లవకారుల ఐక్యత, విప్లవ పార్టీ ఏర్పాటుకోసం అహర్నిశలు కృషి చేసిన విప్లవకారుల ప్రియతమ నాయకుడు కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి 32వ వర్ధంతిని జరుపుకుంటున్నాం. ఆయన ఈనాడు మన మధ్యలేకపోయినప్పటికీ, 35 సంవత్సరాల ఆయన సాహసోపేత విప్లవ జీవితం, అకుంఠిత కార్యదీక్ష మన స్మృతి పథంలో నిరంతరం నిలిచి వుంటాయి. మన జీవితాలను విప్లవానికి అంకితం చేయటానికీ, నిరంతరం విప్లవ కార్యకలాపాల్లో పాల్గొనడానికీ స్ఫూర్తినందిస్తూ వుంటాయి.

కామ్రేడ్ నాగిరెడ్డి రాజీలేని పోరాట యోధుడు. విద్యార్థి దశ నుండి అంతిమశ్వాస విడిచే వరకూ పోరాటాలు సాగించాడు. ఎన్నో కష్టనష్టాల కోర్చి నిజమైన శ్రామికవర్గ విప్లవకారుడిగా జీవితాన్ని సాగించాడు. నేటి తరం విప్లవకారులు ఆ యోధుని జీవితం నుండి నేర్చుకోవలసిన గుణాలెన్నో వున్నాయి. పీడిత ప్రజలపై ఈ దోపిడీ వ్యవస్థ చేసిన ప్రతి దాడినీ ఆయన ఎదుర్కొన్నాడు. ప్రజల నిత్యజీవిత, సాంఘిక, ఆర్థిక, రాజకీయ సమస్యలపట్ల ఆయన స్పందన ఎంతో ఆవేశంతో, ఆగ్రహంతో నిండి వుండేది. అది బహిరంగ సభ కానివ్వండి; అసెంబ్లీ సమావేశం కానివ్వండి ఈ సమస్యలకు కారణమైన పాలకశక్తులపై అత్యంత కరకుగా విరుచుకుపడేవాడు. కొదమసింహం వలె సమస్య మధ్యకు దూకేవాడు. అవి-స్థానిక, రాష్ట్ర, జాతీయ-అంతర్జాతీయ-ఏ స్థాయి సమస్య అయినా ఆయన స్పందన ఒకటిగానే వుండేది. శ్రామికవర్గ పోరాటతత్వాన్ని, శ్రామికవర్గ అంతర్జాతీయతత్వాన్నీ పుణికిపుచ్చుకున్నందున పోరాట యోధుడిగా చివరి వరకూ నిలవగలిగాడు. ఒక్కమాటలో చెప్పాలంటే

ఆయన ప్రజల మనిషి.

కమ్యూనిస్టు ఉద్యమంలో తలెత్తిన రివిజనిస్టు, అతివాద-మితవాద అవకాశవాదులకు వ్యతిరేకంగా ఖచ్చితంగా, సూత్రబద్ధంగా నిలబడ్డాడు. ఈ పోరాటంలో ఎన్నో అపవాదులనూ, వ్యక్తిగత దూషణలనూ లక్ష్య లెక్కపెట్టకుండా తాను నమ్మిన సిద్ధాంత, రాజకీయ విధానాలను ఆచరణలో పెట్టాడు. వాటిని పరిరక్షించుకోవటంలో చివరికంటా నిలబడ్డాడు.

కమ్యూనిస్టు నిర్మాణ సూత్రాలపట్ల వినయం, క్రమశిక్షణ, త్యాగము, దీక్ష, బాధ్యత, ఓరిమి, కరకుదనము మేళవించిన విప్లవ నిర్మాణ దక్షత గల రథసారథి కా॥ టి.ఎన్. కమ్యూనిస్టు నిర్మాణ సూత్రాలపట్ల ఈ బాధ్యతాయుత ప్రవర్తనను ఆయన నుండి మనం నేర్చుకోవాలి.

ఆయన మనలను వీడిపోయిన ఈ మూడు దశాబ్దాల కాలంలో, దేశీయంగా, అంతర్జాతీయంగా వచ్చిన పరిణామాలు, కా॥ టి.ఎన్. నాయకుడిగా వుండి, రూపొందించిన కార్యక్రమం, పంథాలు సరైనవని రుజువు చేశాయి. ఆ కార్యక్రమం, పంథాలు అమలుపరచటంలో మన విప్లవ సంస్థ విలువైన అనుభవాలను గడించింది.

అమెరికా నాయకత్వాన సామ్రాజ్యవాదం ప్రపంచ ప్రజలపై దోపిడీ, అణచివేతలను తీవ్రం చేశాయి. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలతో మూడవ ప్రపంచ దేశాల సహజ, ఆర్థిక, శ్రమశక్తి వనరులను కొల్లగొడుతున్నది. చమురు వనరులపై ఆధిపత్యం కొరకు అమెరికా సామ్రాజ్యవాదం మధ్యప్రాచ్య దేశాలను యుద్ధజ్వాలల్లోకి నెట్టివేస్తున్నది. ఆఫ్ఘనిస్తాన్ ఇరాక్‌లపై దురాక్రమణతో రక్తదాహం తీరక ఇరాన్‌పై దురాక్రమణకు కాలు దువ్వుతున్నది. యుద్ధవ్యయాన్ని, సంక్షోభ భారాన్ని ప్రజలపై మోపేందుకు, చమురు, ఆహార ధాన్యాల ధరలను విపరీతంగా పెంచివేసింది. ప్రపంచ జనాభాలో మూడవ వంతును ఆకలి మంటలకు గురిచేస్తున్నది. ప్రపంచ ప్రజలందరి శత్రువుగా ముందుకు వచ్చింది.

గత మూడు దశాబ్దాలలో పాలకవర్గాలు భారత ప్రజలను మరింత పరాధీనతలోకి నెట్టివేసాయి. సామ్రాజ్యవాద ద్రవ్య సంస్థల కనుసన్నల్లో నడుస్తూ, పారిశ్రామిక రంగాన్ని బహుళజాతి సంస్థలపరం చేశాయి. లక్షలాది చిన్న పరిశ్రమలు మనుగడ సాగించలేక మూతపడిపోతుండగా, విదేశీగుత్త కంపెనీలు వేలకోట్ల రూపాయలు ప్రతి ఏడాది లాభాలుగా దోచుకుపోతున్నాయి. సంపదల తరలింపు వలసపాలన కాలం నాటిని మించిసాగుతున్నది. ఆర్థిక వృద్ధిరేటు రికార్డుస్థాయిలో వుందని చెప్పుకుంటూ శ్రమజీవులకు ఉపాధి అవకాశాలను కల్పించకపోగా, ఉన్నవారిని కూడా తొలగించి వేస్తున్నాయి. ఇంతేకాక సేవారంగాన్ని కూడా సామ్రాజ్యవాదులపరంచేసి వేశారు. బ్యాంకులు, ఇన్సూరెన్సు, పత్రికలు, టీ.వీ.లు, ఆస్పత్రులు, టెలిఫోన్లు, రవాణా సాధనాలు, ఉన్నతవిద్య, చివరికి చిల్లర దుకాణాలను కూడా సామ్రాజ్యవాదుల కబంధ హస్తాల్లోకి నెట్టివేశారు. అమెరికా సామ్రాజ్యవాదంతో సైనికంగా పీటముడి వేసుకుని హిందూ మహాసముద్రంలో అమెరికా సైన్యాలకు కాపలాకుక్కలుగా భారత నౌకా సైన్యాన్ని దిగజార్చారు. చివరకు అణుఒప్పందానికి సిద్ధమై భారతమాత గుండెలపై నిప్పుల కుంపటిని పెడుతున్నారు. కా॥ టి.ఎన్. చెప్పినట్లు సామ్రాజ్యవాదుల భోజనాల బల్ల వద్ద జారిపడే ఎంగిలి మెతుకుల కోసం వేచివుండే దళారీలుగా భారత బడా బూర్జువావర్గం వుంది.

గ్రామీణ ఆర్థికవ్యవస్థను తీవ్రసంక్షోభంలోకి నెట్టివేశారు. ప్రపంచబ్యాంకు, రాక్‌ఫెల్లర్, ఫోర్డు ఫౌండేషన్ తదితర సామ్రాజ్యవాద సంస్థల సలహాలూ, సహాయంతో అమలుజరిపిన పైరుపచ్చ విప్లవవ్యూహంతో సామ్రాజ్యవాద పెట్టుబడి వ్యవసాయరంగంలోకి చొరబడింది. ఆ రంగాన్ని పూర్తిగా కబళించి వేసేందుకు పై సంస్థలే సూచించిన రెండవ దశను రుద్దేందుకు పూనుకున్నారు. ఈ లక్ష్యం దిశగా గత రెండు దశాబ్దాల్లో అమలుజరిపిన విధానాలలో భాగంగానే ఎరువుల రేట్లు, కరెంటు ఛార్జీలు పెంచారు. విత్తన రంగాన్ని విదేశీ కంపెనీలపరం చేశారు. సాగునీటి సౌకర్యం కల్పించకుండా, నీటిని పొదుపుగా వాడే పద్ధతులంటూ నీటి ప్రైవేటీకరణను రుద్దారు. రైతాంగానికి ప్రభుత్వ మద్దతునంతా తగ్గించివేశారు. వ్యవసాయ మార్కెట్లను గుత్తవ్యాపారులపరం చేశారు. వీటి ఫలితంగానే రైతాంగం అప్పులపాలై, భూమిని కోల్పోయారు; ఆత్మహత్యలతో ప్రాణాలు కోల్పోయారు. ఇంతేకాక, సెజ్‌లు, కారిడార్‌ల పేరిట లక్షలాది ఎకరాలను రైతాంగం నుండి గుంజివేసుకుని, బడా బాబులకు కట్టబెడుతున్నారు. ఫలితంగా భూమిలలేని గ్రామీణ పేదల సంఖ్య పెరుగుతున్నది. ఉపాధి అవకాశాలు తరిగిపోవటంతో వ్యవసాయ కూలీల జీవనం దుర్భరమౌతున్నది. కౌలుదారులుగా వీరి స్థితి కడు దుర్భరమైంది. గ్రామీణాభివృద్ధి పేరిట ప్రభుత్వం తీసుకున్న ప్రతి చర్యా భూస్వామ్యవర్గాన్ని బలీయం చేశాయి. కా॥ టి.ఎన్. చెప్పినట్లుగానే గ్రామ సీమలలో వర్గ వ్యత్యాసాలు తీవ్రమై, "క్రింది" కులాలపై "అగ్రకుల భూస్వామ్య పెత్తందార్ల దౌర్జన్యాలు పెరిగిపోయి అశాంతిలో కుతకుతలాడుతున్నాయి.

భూస్వామ్య, సామ్రాజ్యవాద దోపిడీల ఫలితంగా భారత ప్రజాజీవనం నానాటికీ దుర్భరమౌతున్నది. తమ సమస్యల పరిష్కారానికి అనేక రూపాలలో ప్రజలు పోరాటాలు సాగిస్తున్నారు. ఈ పోరాటాలు తరచుగా దీర్ఘకాలంపాటు మిలిటెంటుగా సాగుతున్నాయి. దీనితో హడలెత్తిన పాలకవర్గాలు తాము ధరించిన ప్రజాస్వామిక ముసుగును (తరువాయి 2వ పేజీలో)

కార్మిక ఆందోళనలను యాజమాన్యాలు అణచివేసే ధోరణులను భారత కార్మికవర్గం ప్రతిఘటించాలి!

సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలను భక్తిశ్రద్ధలతో దేశంలో అమలుజరుపుతున్న పాలకులు పెట్టుబడి యొక్క ప్రయోజనాలను కాపాడటంకోసం పడరానిపాట్లు పడుతూ మన దేశపు "ప్రజాస్వామ్య" వ్యవస్థ యొక్క మేడిపండు స్వరూపాన్ని వెల్లడిచేస్తూనే వున్నారు. 2005లో హీరోహొండా కంపెనీ తరఫున వకాలతు పుచ్చుకొన్న ప్రభుత్వమూ, పోలీసులు తమ సమస్యల పరిష్కారంకోసం న్యాయబద్ధంగా, శాంతియుతంగా ఆందోళన జరుపుతున్న హొండా కార్మికులపై పాశవికంగా లాఠీఛార్జీ జరిపి, తాము పెట్టుబడి యొక్క ప్రయోజనాలను కాపాడి పెట్టడంలో దేనికీ వెరువమని నిర్లజ్జగా ప్రకటించుకొన్నారు. దేశవ్యాపితంగా హొండా కంపెనీ తరఫున పోలీసులు కార్మికులపై జరిపిన దమనకాండకు నిరసన వెల్లువలా వెల్లడయినా నేటికీ పాలకులూ, పాలక ప్రభుత్వాలూ దేశంలోని కార్మిక చట్టాలను మరింతగా సరళతరంచేసి, కార్మిక వనరులను, పెట్టుబడిదారుల చెప్పుచేతల్లో వుంచటానికే కట్టుబడి వున్నామని పదే పదే ప్రకటిస్తున్నారు. ప్రధాన మంత్రి మొదలు, రాష్ట్ర పాలకుల వరకూ అందరూ-వారు ఏ రాజకీయ పార్టీ వారైనప్పటికీ పారిశ్రామిక వర్గాల ప్రయోజనాలను పెంపొందింపచేయటానికే సంసిద్ధంగా వున్నామని చాటుకొంటున్నారు.

పారిశ్రామిక పెట్టుబడిదారీవర్గం యొక్క ప్రయోజనాలను పరిరక్షించే సదుద్దేశంతోనే పశ్చిమబెంగాల్‌లోని 'వామపక్ష' ప్రభుత్వ అధినేతలయిన సి.పి.ఎం. పాలకులు నందిగ్రాంలో మారణహోమం సృష్టించారు. ప్రపంచవ్యాపితంగా యిందుకు వ్యతిరేకంగా నిరసనలు వెలువడ్డా, తాము చేసిన చర్య సరైనదేనని, తమ పారిశ్రామిక విధానాల అమలుకోసం మరే అంశాన్నీ పరిగణనలోనికి తీసుకోమని నిర్లజ్జగా ప్రకటిస్తూ, పారిశ్రామిక అభివృద్ధి పేరిట పెట్టుబడిదారీవర్గ ప్రయోజనాలకు ప్రాధాన్యతను యిచ్చి వాటి పరిరక్షణకు-మారణహోమాలు జరిపైనా పూనుకొన్నారు.

పాలకులు అనుసరించి అమలుజరిపే ఈ విధానాల వలన పారిశ్రామిక యాజమాన్యాలు మరింతగా బరితెగించి, నేరుగా తామే కార్మికుల ఆందోళనలను మారణహోమం సాగించటం ద్వారా అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్న ధోరణులు బలపడుతున్నట్లు యిటీవలి రెండు సంఘటనలు తేటతెల్లం చేస్తున్నాయి.

70వ దశకపు చివరి భాగంలో, మన రాష్ట్రంలోని, చీరాల దగ్గర గల జాండ్రపేటలోగల కేపాల్ ఆయిల్ కంపెనీకి చెందిన మేనేజింగ్ డైరెక్టర్ అయిన ఒక మాజీ సైన్యాధికారి, తమ కోర్కెల సాధనకోసం ఫ్యాక్టరీ గేటుకు ఎదురుగా వేసుకొన్న ఒక గుడారంలో నిరాహారదీక్ష సలుపుతున్న యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులపై తుపాకీ కాల్పులు జరిపి 'పెల్లెట్లు' (చిరుతూటాలు)తో వారిని గాయపరిచిన వైనాన్ని చూశాం. అతడు మాజీ సైనికాధికారి కాబట్టి ఆ రకంగా జులుంచేసి వుంటాడని భావించాం. అయినా అతడి దుర్మార్గపు చర్యను కార్మికవర్గం నాడు తెగనాడటం జరిగింది. ఆ దుర్మార్గానికి వ్యతిరేకంగా నాడు రాష్ట్రమంతటా నిరసన వ్యక్తమయింది.

కానీ నేడు పారిశ్రామిక యాజమాన్యాలకు సంబంధించిన అధికారులేకాక, వారి వద్ద పనిచేసే భద్రతా సిబ్బందే (సెక్యూరిటీ స్టాఫ్), నేరుగా ఆందోళనలను జరుపుతున్న కార్మికులపై తుపాకులు పేల్చటం, కార్మికులను ఆ కాల్పుల్లో చంపటం, తీవ్రంగా గాయపరచటం ద్వారా కార్మికులను అదుపులో పెట్టేందుకు, యాజమాన్యాల ప్రోత్సాహంతో ముందుకు దూకుతున్న ఒక దుర్మార్గపు పరిస్థితిని మనం చూస్తున్నాం. బానిసలను, బానిస యజమానుల సూపర్‌వైజర్లు అదుపుచేసిన పద్ధతుల్లో నేడు యాజమాన్యాలు నియమించుకొన్న భద్రతా సిబ్బంది తుపాకులతో అదుపు చేస్తున్న ధోరణులను చూస్తున్నాం.

హిమాచల్‌ప్రదేశ్‌లలోని షోగి పారిశ్రామికవాడలో సూపర్ మాక్సు కంపెనీకి చెందిన ఫ్యాక్టరీ వుంది. ఈ సంవత్సరపు (2008) జనవరి 1వ తేదీ నుండి పారిశ్రామిక కార్మికుల వేతనాలను నిర్ణయించుతూ రాష్ట్ర ప్రభుత్వం ఒక నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఆ నోటిఫికేషన్‌కు అనుగుణంగా తమకు వేతనాలు పెంచాలని సూపర్ మాక్స్ కంపెనీ కార్మికులు ఆందోళన నిర్వహిస్తున్నారు. సంఘటితమై సమస్యల పరిష్కారంకోసం ఆందోళనా మార్గాన్ని ఎంచుకొన్న కార్మికుల ఐక్యతను భగ్నం చేయటంకోసం, భయపెట్టి లొంగదీసుకోవటంకోసం యాజమాన్యం పరిశ్రమలోని 9 మంది కార్మిక నాయకులను సస్పెండు చేసింది. అయినా బెదరక కార్మికులు శాంతియుతంగా తమ ఆందోళనను కొనసాగిస్తున్నారు. శాంతియుతంగా ఆందోళన జరుపుతున్న ఆ కార్మికులపై కంపెనీ భద్రతా సిబ్బంది కాల్పులు జరిపారు (జూన్ ఆఖరి వారంలో). ఆ కాల్పుల్లో ఒక కార్మికుడు మరణించాడు. మరో ఐదుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. అయినదానికీ, కానిదానికీ శాంతిభద్రతల పేరిట సాధారణ ప్రజలపైనా, కార్మికులపైనా విరుచుకపడే పోలీసులు యాజమాన్యపు ప్రేరణతో కార్మికులపై కాల్పులు జరిపి, ఒక కార్మికుడి మరణానికి కారకమయిన ఈ సంఘటనపట్ల ఉదాశీనతను ప్రదర్శించారు. ప్రభుత్వమూ ఈ విషయమై కలుగచేసుకుని కాల్పులకు పాల్పడిన భద్రతా సిబ్బందినీ, అందుకు ప్రోత్సహించిన సూపర్‌మాక్స్ యాజమాన్యాన్నీ వారిపై కేసులుపెట్టి శిక్షించటానికి పూనుకోలేదు. సాధారణ విషయాల్లో అతిగా స్పందించే, చిరునేరస్థుల ఉసురుతీయాలని ప్రచారం కావించే మీడియా కూడా, ఇంతటి ఘోర సంఘటనను అంతగా పట్టించుకోలేదు. ఈ ఘటనపై న్యాయ విచారణ జరిపించాలనీ, మరణించిన కార్మికుడి కుటుంబసభ్యులకు 10 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలనీ, గాయపడ్డ వారికి 5 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా యివ్వాలనీ, రాష్ట్రంలోని కార్మికుల సమస్యలపై చర్చించేందుకు తక్షణం ముఖ్యమంత్రి అఖిలపక్ష సమావేశం చేయాలని డిమాండు చేస్తున్న సి.పి.ఎం పార్టీ సహితం, ఈ ఘోరానికి వ్యతిరేకంగా దేశవ్యాపితంగా కార్మికవర్గాన్ని కదిలించటానికి, ఈ ధోరణికి వ్యతిరేకంగా ఒక ఉద్యమం (తరువాయి 2వ పేజీలో)

విప్లవం

- ఛాయరాజ్

నిత్య నూతనమైనది
సనాతనంగా పీడితులు ఉచ్ఛరిస్తున్నది
హంతకుల్ని భయకంపితుల్ని చేసేది
కార్మికులకు మహానందభరితమైన మాట
"విప్లవం"
పోరు పరిణామానికి చివరూ-పూతా విప్లవం
సుఖాన్ని నిర్వచించినా
ఆనందానికి అర్థం చెప్పినా
శాంతిని ఎంత చదివినా
పుట్టుకకు ముందుండేది విప్లవం
చావుకు తర్వాత వున్నదైనా "విప్లవం"
అన్నమాట.

ఆర్తనాదాలకు బహుముఖార్థం
ఉత్పత్తిశక్తుల దీర్ఘకాల వాంఛితం
పోరాటశక్తుల సమర కాంక్షలకర్థం
సత్యం "విప్లవం" సుందరం
భవిష్యత్తుందుకొనే ఒకే ఒక్క భేరీ విప్లవం.

బతకాలంటే జీవించడానికి చేసే యుద్ధం
చెమటను తుడుచుకొనే ధర్మం
సుఖాన్ని పంచుకొనే కర్తవ్యం
మృత్యువును మనచేతనుంచుకొని
అమృత తత్వాన్ని దేశానికందించగలిగే శక్తి
విప్లవం.

శత్రువు కోరినప్పుడల్లా
రక్తాన్ని రకరకాలుగా యిచ్చేయడం కాదు
దుర్మార్గుడు గెలిచినప్పుడల్లా
పంధాను పరిపరి విధాలుగా మార్చుకోవడం
కాదు
కత్తి అంచున నడుస్తూనే
శత్రువు జుత్తు పట్టుకోవడం విప్లవం
తీగపైన నడుస్తూనే
శత్రువు నాడి తెంపేయడం విప్లవం

ఇరుసూ వెన్నెముకా రెండూ వుండి
ఏరు పూయడం తెలవడం విప్లవం.
కందరాన్ని బిగించివున్న నాడీ తంత్రిని
మోగించడం విప్లవం.

ఆపదలోనున్న జనం ముందుకొచ్చి
అన్యాయమైపోతున్న సమాజం ముందుకొచ్చి
ఆందోళన పడుతున్న ఉద్యమం ముందుకొచ్చి
విప్లవమన్న పదాన్ని టి.ఎన్ ఉచ్ఛరించినప్పుడు
దేశంపైనున్న గగనం గగ్గరించింది.
శత్రువు నాతడు హెచ్చరించినప్పుడు
ఆకాశం క్రిందనున్న అవనీతలం దద్దరిల్లింది.

విప్లవంలో
కొండలున్నాయి నదులున్నాయి
సారవంతమైన భూములున్నాయి
అడవులున్నాయి సముద్రాలున్నాయి
సమస్త సంపదలున్నాయి-

మృగాలూ దేగల మీద
ఎక్కుపెట్టిన విల్లమ్ములున్నాయి-

భూస్వాములూ దళారీలు
పెట్టుబడిదారులూ సామ్రాజ్యవాదులపైన
గురిపెట్టి వున్న ఆయుధాలున్నాయి
ప్రతిఘటన వుంది సాయుధ పోరాటముంది-

విప్లవంలో
మేధావుల శ్రుతి వుంది
శ్రామికుల సంగీతముంది.
విషాదం మీద పోరాటానికి
ఆనందాన్ని పొందేందుకూ
సౌందర్యాన్ని మొలకెత్తించేందుకు
జీవిత మకరందంలో ముంచెత్తి వుంచిన
ఆయుధం "విప్లవం"

(టి.ఎన్.వర్ధంతి సందర్భంగా)

లారీల సమ్మెకు మద్దతుగా ధర్నా

మచిలీపట్నం, 3.7.08: ఏపిఎఫ్‌టియు, రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) సంయుక్త ఆధ్వర్యంలో డీజిల్ ఆయిల్ ధరలు తగ్గించాలని డిమాండు చేస్తూ దేశవ్యాపితంగా జరుగుతున్న లారీల సమ్మెకు మద్దతుగా సా॥ 5 గం.లకు మచిలీపట్నం కోనేరు సెంటర్‌లో ధర్నా జరిగింది. ధర్నాను ప్రారంభిస్తూ ఏపిఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి కా॥ యద్దనపూడి సోని మాట్లాడుతూ "ప్రభుత్వం అంతర్జాతీయంగా పెంచిన ధరలను సాకుగా తీసుకొని డీజిల్, పెట్రోల్ ధరలను పెంచింది. రాష్ట్ర ప్రభుత్వం డీజిల్‌పై 22.5 శాతం, పెట్రోలుపై 33 శాతం పన్నులు వసూలు విధించింది. అంతేకాక లారీలు వసూలు చేస్తున్న కిరాయిలో 12.5 సేవాపన్ను విధించింది. లోడ్ సుంకం లీటరు డీజిల్‌కు 2 రూ.లు. టోల్ గేటు పన్ను రూ.1.40 నుండి 2.40 పెంచారు. ఇంకా 3.40 రూ.లకు పెంచేందుకు చూస్తున్నారు. రవాణా రంగంపై పడుతున్న భారాలు రవాణా ఛార్జీలు పెరిగి అన్ని రకాల నిత్యావసర సరుకుల ధరలు మరింత పెరిగేందుకు దోహపడుతుందన్నారు. రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) జిల్లా నాయకులు కా॥ జె.జగన్ మాట్లాడుతూ "దేశంలో ఉన్న అపారమైన ఆయిల్, గ్యాస్ వనరులను ప్రభుత్వం వెలికితీసి ప్రజోపయోగంగా వినియోగించాల్సిన ప్రభుత్వం ఆయిల్, గ్యాస్ నిక్షేపాలను కెయిర్న్ (బ్రిటన్), మరుబెనీ (సింగపూర్) హాలీ బర్టన్ (అమెరికా) వంటి విదేశీ కంపెనీలతోపాటు రిలయన్సు, టాటా, జివికె గ్రూపు, జిఎంఆర్ వంటి స్వదేశీ బడా కంపెనీలకు ధారాదత్తంగా చేస్తున్నారు. ఆయిల్ అవసరాలకు విదేశాలపై ఆధారపడేలా చేస్తూ అధిక ధరల భారాలను ప్రజలపై చూపుతోంది" అన్నారు. మచిలీపట్నం ఆటోవర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శీరంశెట్టి లక్ష్మణరావు, గొలిపర్తి ఆదినారాయణ, రైతుకూలీ సంఘం జిల్లా నాయకులు తలశిల లీలామనోహర్, పామర్తి అంజమ్మ, స్త్రీ విముక్తి సంఘటన అనిశెట్టి నాగేశ్వరమ్మ, ఎన్‌వైఎస్ జిల్లా కార్యదర్శి ముచ్చు సుధాకర్, ఆయిల్ ధరలను పెంచటంలో ప్రభుత్వ దివాళాకోరు విధానాలను ఎండగట్టారు. లారీ యజమానుల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు చీమకుర్తి తాతయ్య, కొనకళ్ళ నాగలింగేశ్వరరావు, యూనియన్ నాయకులు దేవరప్రసాద్ తదితరులు పాల్గొని "ప్రభుత్వం తక్షణమే లారీ సమ్మెను విరమింపజేసేందుకు లారీ యజమానులు చేస్తున్న డీజిల్ ధరల తగ్గింపు, సేవాపన్ను, టోల్‌గేట్ పన్నులను రద్దు చేయాలని" డిమాండు చేసారు. రైతులు, పేదలు, ఆటో కార్మికులు, హమాలీ కార్మికులు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. సా॥ 5 గంటల నుండి 7 గంటలకు ధర్నా జరిగింది. ◈

కాప్రేక్ ... (1వ పేజీ తరువాయి)

తామే తొలగించుకుని పాశవిక నిర్బంధకాండతో విరుచుకుపడుతున్నాయి. రక్తపుటేరుల్లో ఉద్యమాలను ముంచివేస్తున్నాయి. ప్రజాస్వామిక హక్కులను కాలరాచి వేస్తున్నాయి. పోటా వంటి చట్టాలతో విచారణ లేకుండా జైళ్లలో కుక్కుతున్నారు. పోరాడి సాధించుకున్న సమ్మె తదితర కార్మిక హక్కులను తొలగించి కార్మికులను యాజమాన్యాల దయాదాక్షిణ్యాలకు వదిలివేస్తున్నాయి. చివరకు అంతులేకుండా పని గంటలను పెంచి వేయటానికి రంగాన్ని సిద్ధంచేస్తూ, నిరాకరిస్తే కాల్చి చంపుతామని హెచ్చరిస్తున్నాయి.

అదే సమయంలో ప్రజలు సంఘటితపడకుండా వారిని చీల్చివేస్తున్నాయి. నగ్నమైన ప్రత్యక్ష రూపాలతో సంఘ పరివార్, ముసుగు కప్పిన పరోక్ష రూపాలలో కాంగ్రెసు హిందూ మతోన్మాదాన్ని పెంచుతున్నాయి. మైనారిటీ మతస్తులపై ఊచకోత, తీవ్ర వివక్షతలు సాగిస్తున్నాయి. కులవైషమ్యాలనూ, దళిత కులాల మధ్య వైషమ్యాలనూ, ప్రాంతీయ విద్వేషాలనూ, రాష్ట్రాల మధ్య తగవులనూ రగిల్చి, ప్రజలను చీల్చివేస్తున్నారు.

ప్రజలు పోరాట మార్గాన్నెంచుకోకుండా, వారిని భ్రమలపాలుచేసి తమ ప్రభావంలో వుంచుకునేందుకు పాలకవర్గాలు ప్రజాకర్షక పథకాల జోరూ, పోటీలుపడి వాగ్దానాల హోరు పెంచివేస్తున్నారు. పాత పథకాలకే కొత్తపేర్లు తగిలించటం లేదా హిందీ పేర్లు, తెలుగుపేర్లు పెట్టి కొత్త పథకాలుగా చెలామణి చేస్తున్నారు. అంతే తప్ప ఈ పథకాలేవీ ప్రజల తక్షణ సమస్యలకు ఉపశమాన్ని కూడా యివ్వలేకపోతున్నాయి. 100 రోజుల ఉపాధి కల్పిస్తానన్న గ్రామీణ ఉపాధి పథకం సగటున గుర్తించిన పేదలలో 10 శాతానికి 10 రోజులు ఉపాధి కల్పించేసరికి మిన్ను విరిగి మీద పడ్డట్లయ్యింది. దీనినంతా కప్పిపుచ్చుకుంటూ, ఈ పథకం గొప్పగా అమలయిన ఫలితంగా రైతులకు కూలీలు దొరకనందువల్ల, తాత్కాలికంగా ఈ పథకాన్ని ఆపివేస్తున్నామంటూ ప్రకటించారు. రైతురుణాల మాఫీ పథకం పాండవులెందరంటే మంచం కోళ్లలా సామెతగా మారింది.

సామ్రాజ్యవాదానికి దాసోహం చేస్తూ, బడా బూర్జువా, భూస్వామ్యవర్గాలకు దోచిపెడుతూ ప్రజలను అణచివేస్తున్న పాలకులను ఎదిర్చి పోరాడటమే తప్ప మరో మార్గం లేదు. దేశం నుండి సామ్రాజ్యవాద దోపిడీని పారద్రోలటం కోసం సంఘటితంగా పోరాడాలి; భూస్వామ్య వ్యవస్థను రద్దుపరిచే వ్యవసాయ విప్లవాన్ని సాగించాలి. అప్పుడు మాత్రమే దోపిడీ, పీడనలు లేని నవ సమాజాన్ని నిర్మించుకోగలం. ప్రజలను చైతన్యవంతులను చేసి, పోరాటోన్ముఖులుగా చేయటమే విప్లవకారుల ముందున్న కర్తవ్యం. ఈ కర్తవ్య సాధనకు, మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానాన్ని మార్గదర్శక సిద్ధాంతంగా స్వీకరించి జనతా ప్రజాతంత్ర విప్లవానికి కట్టుబడిన ఐక్య విప్లవ పార్టీని నిర్మించాల్సి వుంది. ఈ కర్తవ్య నిర్వహణకు పునరంకితమవటమే కా॥ టి.ఎన్.కు మనమందించే విప్లవ నివాళి.

కా॥ టి.ఎన్.కు విప్లవ జోహార్లు!
అమరవీరుల ఆశయాలను సాధిద్దాం!
జనతా ప్రజాతంత్ర విప్లవం వర్ధిల్లాలి!
మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానం వర్ధిల్లాలి!

ఆంధ్ర రాష్ట్ర కమిటీ
సి.పి.ఐ (ఎం.ఎల్)

కార్మిక... (1వ పేజీ తరువాయి)

చేపట్టడానికీ ప్రయత్నం చేసిన దాఖలాలు కనబడటల్లేదు. బహుశా తాము బయటి నుండి మద్దతునిచ్చే యు.పి.ఎ. ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న కాంగ్రెసు పార్టీ హిమాచల్‌ప్రదేశ్‌లో ప్రభుత్వాధికారంలో వుండటమే యిందుకు కారణం కావొచ్చు. లేదా "అణుఒప్పందం"పై వారు ప్రస్తుతం 'పోరాటం' జరుపుతున్న ఈ తరుణంలో, ఈ కార్మికసమస్యకు అంతటి ప్రాధాన్యత లేదని వీరి కన్పించి వుండవచ్చు. కనీసం వారి పత్రికలలోనైనా యీ ఘటన వివరాలనూ, అందులో ప్రదర్శితమయిన కార్మిక వ్యతిరేక పాశవిక ధోరణులనూ వీరు ప్రచురించకపోవటం అన్నది యాదృచ్ఛికంగా జరిగిందని అనుకోలేకపోవాల్సి వస్తోంది.

ఈ దుర్మార్గపు ఘటన జరిగిన 15 రోజులు తిరక్కముందే గుజరాత్ రాష్ట్రంలో యిటువంటి ఘటనే జులై 6వ తేదీన జరిగింది. గుజరాత్ రాష్ట్రంలోని సౌరాష్ట్ర ప్రాంతంలోని భావనగర్‌లో వజ్రాలను ఎగుమతి చేసే పరిశ్రమలోని కార్మికులు, సూరత్‌లో పెంచిన మాదిరిగానే తమకు కూడా 20% వేతనాలను పెంచాలని డిమాండు చేస్తూ ఆందోళన చేపట్టారు. గుజరాత్ రాష్ట్రంలోని రాజ్‌కోట్, జునాగడ్, పాలంపూర్ తదితర ప్రాంతాల్లో కూడా ముడి వజ్రాలను శుభ్రపరిచి, కోతకోసి ఎగుమతి చేసే పరిశ్రమలు సాగుతున్నాయి. తమ వేతనాలు పెంచాలని కోరుతూ, వజ్రాల పాలిషింగ్ పరిశ్రమకు చెందిన 3000 మంది కార్మికులు ఆ రోజున నిరసన ప్రదర్శన జరుపుతున్నారు. ఈ కార్మికులపై ఒక డైమండ్ పాలిషింగ్ యూనిట్‌కు చెందిన ఒక సెక్యూరిటీ గార్డు కాల్పులు జరిపాడు. ఈ కాల్పుల్లో ఒక కార్మికుడు మరణించగా, 6గురు గాయపడ్డారు. గాయపడ్డవారిలో ఒక కార్మికుడి పరిస్థితి విషమించింది. ఆందోళన చేసే కార్మికులు కుంబుద్‌వాడీ ప్రాంతంలో కొన్ని కార్లను తగులబెట్టారు. రాళ్ళను విసిరారు. వీరిని అదుపు చేయటంకోసం సెక్యూరిటీ గార్డు 3 రౌండ్ల కాల్పులు జరిపాడు అంటూ పోలీసులు, కాల్పులు జరిపిన సెక్యూరిటీ గార్డు చర్యను సమర్థిస్తున్నారు. కాల్పుల అనంతరం పోలీసులు రంగప్రవేశంచేసి కార్మికులను చెదరగొట్టడం కోసం పాశవికంగా లాఠీఛార్జి జరిపారు. ఒక సెక్యూరిటీ గార్డు చట్టాన్ని తన చేతుల్లోకి తీసుకొని కార్మికులను కాల్చి చంపటం, గాయపర్చటం అన్నది ఘోరమైన విషయం. అయినా విచిత్రంగా ఈ ఘటనను మీడియా అంతగా పట్టించుకోలేదు. 'వామపక్ష' పత్రికలకు సహితం ఈ వార్తను ప్రచురించేందుకు ఖాళీ దొరకలేదు. పెట్టుబడిదారుల కనుసన్నలలో, వారిచేతనే నియంత్రించ బడుతున్న బూర్జువా మీడియా ఈ వార్తకు అంతటి ప్రాధాన్యతను యివ్వకపోవటం అర్థం చేసుకోవచ్చు. కానీ ప్రదర్శనాత్మక ఆందోళనలు ప్రదర్శనలూ నిర్వహించే 'వామపక్ష' పార్టీల వారికి ఈ కార్మికుల సమస్య పట్టకపోవటాన్ని మించిన దారుణం వుండదు.

ఈ రెండు ఘటనల స్వభావం ఒకటిగానే వుంది. సంఘటితమయి, తమ సమస్యల పరిష్కారంకోసం పోరాడే కార్మికులను, పెట్టుబడిదారీ పారిశ్రామిక యాజమాన్యాల దోపిడీని బహిర్గతపరిచి ప్రశ్నించే కార్మికులను, పారిశ్రామిక యాజమాన్యాలు నేరుగా తమ భద్రతా సిబ్బంది ద్వారానే బలవంతంగా కాల్పులు జరిపి అదుపు చేయటానికి సంసిద్ధపడుతున్నాయి. ఈ ధోరణిని వ్యతిరేకించి, శిక్షించాల్సిన ప్రభుత్వాలు నిష్క్రియతో ఈ ధోరణిని సమర్థించటానికి నిర్ణయించుకొన్నాయనీ అర్థమవుతోంది. కోకాకోలా, వాల్‌మార్ట్‌లాంటి బడా కార్పొరేషన్లు యిప్పటికే కార్మికుల సంఘటితత్వాన్ని విచ్ఛిన్నం చేయటానికి ఈ హంతక పద్ధతులను వివిధ దేశాల్లో అనుసరిస్తున్నాయి. ప్రపంచీకరణ విధానాలతో బాటు ఈ విధానాలు కూడా యిప్పుడు మన దేశంలోకి దిగుమతి అయ్యాయన్న విషయాన్ని ఈ ఘటనలు నిరూపిస్తున్నాయి.

భారత కార్మికవర్గం ఈ ఘటనలను యాదృచ్ఛిక ఘటనలుగా పరిగణించి, ఉదాసీనంగా వుండవీలులేదు. భారత కార్మికవర్గం యొక్క ఉనికికి పరిణమించిన మరొక అదనపు ముప్పును ఈ ఘటనలు హెచ్చరిస్తున్నాయి.

కార్మిక వివాదాల్లో పోలీసులజోక్యం రద్దు కావాలి! అన్న డిమాండుకోసం భారత కార్మికవర్గం పోరాడి యింకా ఆ డిమాండును సాధించుకోవాల్సే వుంది. యిప్పుడు ఆ డిమాండుకుతోడు కార్మిక వివాదాల్లో యాజమాన్యాల భద్రతా సిబ్బంది జోక్యం చేసుకోవటాన్ని అంగీకరించం! అంటూ భారత కార్మికవర్గం తన మరో డిమాండును ముందుకు తీసుకువచ్చి ఆ రెండు డిమాండ్లు ఆచరణలో అంగీకరింపబడి, అమలుజరుపటం కోసం దేశవ్యాపితంగా ఒక మహత్తర పోరాటాన్ని జరపాల్సిన జరూరు కర్తవ్యాన్ని గురించి నేడు ఈ రెండు ఘటనలూ భారత కార్మికవర్గానికి హెచ్చరిక చేస్తున్నాయి.

ఆర్థికవాద, సంస్కరణవాద నాయకత్వాల క్రింద మ్రగ్గిపోతున్న భారత కార్మికవర్గం తన ప్రయోజనాల పరిరక్షణకు తానే నడుం కట్టి, ఐక్యతతో, వర్గ రాజకీయాల దర్శకత్వంతో ముందుకు సాగాల్సిన తప్పనిసరి అవసరాన్ని ఈ ఘటనలు మరోసారి హెచ్చరిస్తున్నాయి.

కార్మికులపై భద్రతా గార్డులు కాల్పులు జరిపిన మారణ చర్యలను జనశక్తి తీవ్రంగా ఖండిస్తోంది!

పారిశ్రామిక యాజమాన్యాల పాశవిక దాడులకు బలయిన కార్మికుల కుటుంబాలకు జనశక్తి తన ప్రగాఢ సంతాపాన్ని ప్రకటిస్తోంది!.

తమ ప్రయోజనాలను పటిష్టంగా పరిరక్షించుకోవటంకోసం భారత కార్మికవర్గం సంఘటితపడి, వర్గ రాజకీయాల అవగాహన-ఆచరణలతో, దోపిడీవర్గాల నిర్మూలనా పోరాటానికి తక్షణం పూనుకోవాల్సిందిగా పిలుపునిస్తోంది. ◈

జనశక్తి
విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

సమరశీల భౌతికవాద ప్రాముఖ్యత

లెనిన్

(కమ్యూనిస్టులు భౌతికవాదాన్ని సమరశీలమైనదిగా మలిచేందుకు భౌతికవాదులతో సన్నిహిత సంబంధాలు కలిగి వుండాలనీ, ప్రకృతిశాస్త్ర రంగంలో నేడు సాధిస్తున్న అభివృద్ధిరీత్యా, శాస్త్రజ్ఞులు తాత్త్విక స్థాయికి తమకెదురౌతున్న సమస్యలను లేవనెత్తి ఆలోచించక తప్పదనీ, దానికి గతితార్కిక భౌతికవాద దృక్పథంతో వివరించే శాస్త్రజ్ఞులతో సన్నిహిత సంబంధాలను కలిగి వుండాలనీ బోధించే వ్యాసమిది. అప్పుడు మాత్రమే మార్క్సిజం పురోగమిస్తుందనీ, లేదా సర్వం మాకు తెలుసుననే, విప్లవం మేమే తీసుకువస్తామనే తప్పును కమ్యూనిస్టులు చేస్తారనీ, అధికారాన్ని గెలుచుకోవటమే కాదు, దానిని సరిగ్గా వినియోగించటాన్ని నేర్చుకోవాలని హెచ్చరించిన వ్యాసమిది.

– సంపాదకుడు)

'పాద్ జ్నామెనెమ్ మార్క్సిజ్మ' (మార్క్సిజం పతాక కింద') యొక్క సాధారణ ప్రయోజనాలను గురించి ఆ పత్రిక నం.1-2 సంచికలో కామ్రేడ్ ట్రాట్స్కీ యిప్పటికే అవసరమైనదంతా చెప్పినాడు, చాలా బాగా కూడా చెప్పినాడు. యీ సంచికలోని ఉపోద్ఘాతపు ప్రకటనలో దాని సంపాదకులు చెప్పిన పనియొక్క సారాన్నీ, కార్యక్రమాన్నీ మరింత గాఢంగా నిర్వచించే కొన్ని సమస్యలను నేను చర్చించదలచుకున్నాను.

యీ పత్రిక చుట్టూ చేరినవాళ్లందరూ కమ్యూనిస్టులు కారనీ, కానీ అందరూ స్థిరమైన భౌతికవాదులనీ యీ ప్రకటనలో వుంది. కమ్యూనిస్టుల, కమ్యూనిస్టేతరుల యీ పొత్తు చాలా అవసరమనీ, పత్రిక ప్రయోజనాలను సరిగా నిర్వచిస్తుందనీ నేను అనుకుంటున్నాను. కమ్యూనిస్టులు (సాధారణంగా ఒక మహావిప్లవ ప్రారంభాన్ని విజయవంతంగా సాధించిన విప్లవకారులు చేసినట్లే) చేసే అత్యంత ప్రమాదకరమైన, పెద్ద తప్పులలో ఒకటి యేమిటంటే, కేవలం విప్లవకారులు మాత్రమే విప్లవం చేయగలరనే భావం. తద్వ్యతిరేకంగా, విజయవంతంగా వుండాలంటే, గురుతరమైన విప్లవ కృషికంతటికీ అవసరమైనదేమిటంటే, విప్లవకారులు నిజంగా శక్తివంతమైన, పురోగామి అయిన వర్గం యొక్క అగ్రదళ పాత్రను మాత్రమే నిర్వహించగలరనే భావాన్ని అర్థం చేసుకోవడమూ, ఆచరణలోకి అనువదించడమూ. అగ్రగామిదళం అగ్రగామిదళంగా తన కర్తవ్యాన్ని యెప్పుడు నిర్వహించ గలదంటే, అది యెవరికి నాయకత్వం వహిస్తుందో ఆ ప్రజా బాహుళ్యం నుండి వేరుపడడాన్ని పరిహరించుకో గలిగి, మొత్తం ప్రజా బాహుళ్యాన్ని నిజంగా ముందుకు నడిపించగలిగినప్పుడు మాత్రమే. అత్యంత వైవిధ్యమైన కార్యకలాపాల రంగాలలో కమ్యూనిస్టేతరులతో పొత్తు లేకుండా, విజయవంతమైన కమ్యూనిస్టు నిర్మాణపు వూసే వుండజాలదు.

"మార్క్సిజం పతాక కింద" చేపట్టిన భౌతికవాదం, మార్క్సిజంల సమర్థనకు కూడా యిది వర్తిస్తుంది. సందర్భవశాత్తు, రష్యాలోని పురోగామి సామాజిక యోచనలోని ప్రధాన ధోరణులకు గట్టి భౌతికవాద సంప్రదాయం వుంది. జి.వి.ప్లెహానొవే కాక, చెర్నిషేవ్‌స్కీ పేరు చెప్పినా చాలు. ఫాషనబుల్ ప్రగతి వ్యతిరేక తాత్త్విక సిద్ధాంతాలను అన్వేషిస్తూ, యూరోపియన్ శాస్త్ర విజ్ఞానపు తాజా దశ అనబడేదాని తళుకులచేత సమ్మోహితులై, ఆ తళుకు చాటున బూర్జువా వర్గానికీ, బూర్జువా దురభిప్రాయాలకూ, బూర్జువా ప్రగతి వ్యతిరేకతకూ ఒక విధమైన దాస్యభావం వుండడాన్ని గమనించలేక ఆధునిక నరోద్నిక్కులు చెర్నిషేవ్‌స్కీ నుండి తిరోగమించినారు.

యేమైనా, రష్యాలో మనకు కమ్యూనిస్టేతర శిబిరానికి చెందిన భౌతికవాదులు యింకా వున్నారు– నిస్సందేహంగా యింకా చాలా కాలం వరకు వుంటారు; "విద్యాధిక సమాజం" అనబడేదాని తాత్త్విక ప్రగతి వ్యతిరేకతతోనూ, తాత్త్విక దురభిప్రాయాలతోనూ పోరాడే సంయుక్త కృషిలో స్థిరమైన, సమరశీలమైన భౌతికవాదపు అనుయాయులనందరినీ చేర్చుకోవడం మన కర్తవ్యం. ఆధునిక సమాజంలోని తత్త్వశాస్త్రపు ప్రొఫెసర్లు, మెజారిటీ సందర్భాలలో, క్రియలో, "పట్టభద్రులైన మతతత్త్వపు గులాములు" తప్ప మరేమీ కాదని డిట్జ్‌గెన్ సీనియర్ అన్నప్పుడు, బూర్జువా దేశాలలో వ్యాప్తిలో వుండి, వాటి శాస్త్రజ్ఞుల, పత్రికా రచయితల గౌరవాన్ని చూరగొనే తాత్త్విక ధోరణుల మీద మౌలికమైన మార్క్సిస్టు అభిప్రాయాన్ని సరిగా, సముచితంగా, స్పష్టంగా వ్యక్తం చేసినాడు.

మన రష్యన్ మేధావులకు, యితర దేశాలన్నిటిలోని తమ సోదరులకు లాగే, తాము పురోగాములమని అనుకోవడం చాలా యిష్టం; డిట్జ్‌గెన్ మాటలలో వ్యక్తం చేయబడిన అభిప్రాయపు స్థాయికి సమస్యను తీసుకుపోవడం వారికి చాలా అయిష్టం. యెందుకు అయిష్టమంటే, వారు సత్యాన్ని ముఖాముఖిగా యెదుర్కోలేరు. డిట్జ్‌గెన్ చేసిన కరకైన వర్ణన పరమ సత్యమని గుర్తించడానికి ఆధునిక విద్యావంతులు పాలక బూర్జువావర్గం మీద ప్రభుత్వపరంగానూ, ఆర్థికంగానూ, సాంఘికంగానూ, యితరత్రానూ ఆధారపడడం గురించి కాస్త ఆలోచిస్తే చాలు. ఒక వైపున బూర్జువావర్గపు వర్గ ప్రయోజనాలకూ, వర్గ స్థానానికీ, సకల మత రూపాలకూ అది యిచ్చే అండదండలకూ, మరొకవైపున ఫాషనబుల్ తాత్త్విక ధోరణులలోని భావజాలపు సారానికీ గల సంబంధం గురించి కాస్త తెలుసుకోడానికి యూరోపియన్ దేశాలలో అంత తరుచుగా ఉత్పన్నమయ్యే ఫాషనబుల్ తాత్త్విక ధోరణులలో–ఉదాహరణకు రేడియం ఆవిష్కరణతో సంబంధం గలవి మొదలుకొని, యిప్పుడు ఐన్‌స్టైన్ కొంగు పట్టుకోడానికి ప్రయత్నించేవాటిదాకా గల ధోరణులలో–అపారమైన మెజారిటీని జ్ఞాపకం చేసుకుంటే చాలు.

పైదాన్నిబట్టి అర్థమయ్యేదేమిటంటే–సమరశీల భౌతికవాద పత్రికగా వుండాలని బయలుదేరే పత్రిక ప్రాథమికంగా సమరశీల పత్రికగా వుండాలి. సకల ఆధునిక "పట్టభద్రులైన మతతత్త్వపు గులాముల"నూ, వాళ్లు అధికారిక శాస్త్ర విజ్ఞానపు ప్రతినిధులుగా వ్యవహరించినా సరే, "ప్రజాతంత్ర వామపక్ష, లేదా భావజాలరీత్యా సోషలిస్టు" పత్రికా రచయితలమని పేరు పెట్టుకున్న స్వతంత్రులుగా వ్యవహరించినా సరే, జంకు లేకుండా గుట్టు కడగడమూ, అభిశంసించడమూ అనే అర్థంలో సమరశీల పత్రికగా ఉండాలి.

రెండవది, అలాంటి పత్రిక సమరశీల నాస్తిక పత్రికగా వుండాలి. యీ పని చేయడానికి మనకు ప్రభుత్వ శాఖలు వున్నాయి. లేదా కనీసం ప్రభుత్వ సంస్థలు వున్నాయి. కానీ, పని మహా నిర్లిప్తంగా, చాలా అసంతృప్తికరంగా జరుగుతున్నది (సోవియట్ బ్యూరాక్రటిక్ పద్ధతులైనప్పటికీ) మనం నిజంగా రష్యన్ బ్యూరాక్రటిక్ పద్ధతుల సాధారణ పరిస్థితులలో సతమతమవుతున్నట్లు కనపడుతున్నది. కనుక, యీ ప్రభుత్వ సంస్థలకు తోడుగానూ, ఆ పనిని మెరుగు పరచేటందుకూ, ఆ పనిలోకి జీవాన్ని యెక్కించేటందుకూ, సమరశీల భౌతికవాదాన్ని ప్రచారం చేయడానికి బయలుదేరే పత్రిక విరామ మెరుగని నాస్తిక ప్రచారమూ, పోరాటమూ సాగించడం యెంతైనా అవసరం. యీ విషయం మీద అన్ని భాషల్లోనూ వున్న సాహిత్యాన్ని జాగ్రత్తగా గమనించాలి. యీ రంగంలో యే మాత్రమైనా విలువైన ప్రతిదాన్నీ అనువదించాలి, లేదా కనీసం సమీక్షించాలి.

ప్రజలలో సామూహిక పంపకం కొరకు పద్దెనిమిదవ శతాబ్ది చివరి భాగపు సమరశీల నాస్తిక సాహిత్యాన్ని అనువదించాలని ఎంగెల్సు చాలా కాలం నాడే సమకాలిక కార్మికవర్గ నాయకులకు సలహా యిచ్చినాడు. మనం యింత వరకు యీ పని చేయలేదు, సిగ్గుచేటుగా అని చెప్పాలి (విప్లవాత్మకయుగంలో, అధికారాన్ని యెలా సక్రమంగా ఉపయోగించడమో తెలుసుకోవడం కంటె అధికారాన్ని వశం చేసుకోవడం చాలా సులభం అనేదానికి గల అనేక నిదర్శనాలలో యిది ఒకటి.) మన నిర్లిప్తతా, నిష్క్రియాపరత్వమూ, అసమర్థతా ఒక్కోసారి రకరకాల "ఉదాత్త" కారణాలవల్ల క్షమించబడుతున్నాయి; యెలాంటివంటే, ఉదాహరణకు, పద్దెనిమిదవ శతాబ్దపు పాత నాస్తిక సాహిత్యం కాలం తీరినది, అశాస్త్రీయమైనది, అమాయకమైనది వగైరా. దుష్పాండిత్యానికి గానీ, మార్క్సిజంను సంపూర్ణంగా అపార్థం చేసుకోవడానికిగానీ ముసుగుగా ఉపయోగపడే యిలాంటి కుహనా శాస్త్రీయ కూటతర్కం కంటె అధ్వాన్నమైనది లేదు. పద్దెనిమిదవ శతాబ్దపు విప్లవకారుల నాస్తిక రచనలలో అశాస్త్రీయమైనదీ, అమాయకమైనదీ చాలా వున్నమాట నిజమే. కానీ, యీ రచనల ప్రచురణ కర్తలు వాటిని సంక్షిప్తపరచవచ్చు, చిన్న తాజా కలం యిచ్చి, పద్దెనిమిదవ శతాబ్ది అంతం నుండి మతాల శాస్త్రీయ విమర్శలో మానవజాతి సాధించిన పురోగతిని గుర్తుచేసి, యీ విషయం మీద గల తాజా రచనలను పేర్కొనవచ్చు; యిలాంటివి చేయకుండా యెవరూ అరికట్టరు సమస్త ఆధునిక సమాజంచేతా అంధకారంలోనూ, అజ్ఞానంలోనూ, మూఢవిశ్వాసాలలో యింకా బందించబడిన కోట్లాది ప్రజలు (ముఖ్యంగా రైతులూ, చేతిపనివాళ్లూ) శుద్ధ మార్క్సిస్టు విద్య అనే సరళ రేఖ మీదుగా యీ అంధకారం నుండి తమ్ముతాము విడిపించుకోగలరని అనుకోవడం యే మార్క్సిస్టైనా చేయగల అత్యంత పెద్ద, శోచనీయమైన పొరపాటు అవుతుంది. యీ జనాలకు అత్యంత వివిధమైన నాస్తికవాద ప్రచార సమాచారం సరఫరా చెయ్యాలి; అత్యంత వివిధమైన జీవిత రంగాలకు చెందిన వాస్తవాలు వీళ్లకు పరిచయం చెయ్యాలి; వాళ్లకు ఆసక్తి కలిగేటట్లుగా, వాళ్లను వాళ్ల మత జడత్వం నుండి మేల్కొలిపేటట్లుగా, అత్యంత వైవిధ్య కోణాల నుండి, అత్యంత వైవిధ్య పద్ధతుల ద్వారా వాళ్లను కదిలించేటట్లుగా, సాధ్యమైన ప్రతి మార్గంలోనూ వాళ్లను అందుకోవాలి వగైరా.

పాత పద్దెనిమిదవ శతాబ్దపు నాస్తికుల నిశితమైన, జీవసంపన్నమైన, ప్రజ్ఞాయుతమైన రచనలు ఆనాటి మతతత్వం మీద చమత్కారయుతంగా బాహాటంగా దాడిచేసినాయి; అతి తరుచుగా అవి మత జడత్వం నుండి ప్రజలను మేల్కొల్పడానికి మార్క్సిజం యొక్క చప్పిడి, నీరస దండాన్వయాలకంటే వేయి రెట్లు అనుకూలంగా వుంటాయి; నేర్పుగా యెన్నుకున్న వాస్తవాలు ఉపపత్తులు దాదాపు బొత్తిగా లేనట్టి యీ దండాన్వయాలు మన సారస్వతంలో ఆధిక్యం వహిస్తున్నాయి; యివి తరుచుగా (యీ వాస్తవాన్ని దాచిపెట్టడం నిరుపయోగం) మార్క్సిజాన్ని వికృత పరుస్తాయి. మనకు మార్క్సు, ఎంగెల్సుల ముఖ్య రచనలన్నిటికీ అనువాదాలున్నాయి. పాత నాస్తిక వాదమూ, పాత భౌతికవాదమూ మార్క్సు, ఎంగెల్సులు ప్రవేశపెట్టిన దిద్దుబాట్లను కలుపుకోకుండా అలాగే నిలిచిపోతాయని భయపడడానికి ఆధారాలు బొత్తిగా లేవు. అత్యంత ముఖ్యమైన విషయం– మన కమ్యూనిస్టులలో మార్క్సిస్టులని ఊహింపబడుతూ, వాస్తవానికి మార్క్సిజాన్ని వికలం చేసేవాళ్లు అత్యంత తరుచుగా ఉపేక్షించేది యిదే–యేమిటంటే, యింకా అవికసితులుగా వున్న జనాలలో మత సమస్యలపట్ల ధీసమన్వితమైన వైఖరినీ, మతాల మీద ధీసమన్వితమైన విమర్శనూ మేల్కొల్పడం యెలాగో తెలుసుకోవడం.

మరొకవైపున, మతం యొక్క ఆధునిక శాస్త్రీయ విమర్శకులను చూడండి. యీ విద్యాధిక బూర్జువా రచయితలు మత మూఢవిశ్వాసాల మీద తమ సొంత వాదనకు, తమను వెంటనే బూర్జువావర్గపు భావజాలాత్మక బానిసలుగానూ, "పట్టభద్రులైన మతత్వపు గులాములు"గానూ బట్టబయలుచేసే వాదాలను దాదాపు తప్పనిసరిగా "ముడివేస్తారు".

రెండు ఉదాహరణలు: 1918లో ఆర్.వై.విప్పెర్ 'క్రైస్తవ మత ఆవిర్భావం' ('ఫారొస్' పబ్లిషింగ్ హౌస్, మాస్కో) అనే చిన్న పుస్తకం ప్రచురించినాడు. ఆధునిక శాస్త్ర విజ్ఞానపు ప్రధాన ఫలితాలను గురించిన అతని వక్కాణింపులో రచయిత రాజకీయ సంస్థగా చర్చి యొక్క ఆయుధాలైన మూఢ విశ్వాసాలతోనూ, వంచనతోనూ పోరాడకపోవడమే కాక, యీ సమస్యలను దాటవేయడమేకాక, తాను ఉభయ "అతివాదాల"కూ– భావవాద, భౌతికవాద అతివాదాలకు–అతీతమని కేవల పరిహాసాస్పదంగా, అత్యంత ప్రగతి వ్యతిరేకంగా చెప్పుకుంటాడు. శ్రామిక ప్రజల నుండి పిండిన లాభాల నుండి కోటానుకోట్ల రూబుల్లను ప్రపంచమంతటా మతానికి అండదండలుగా ఖర్చుపెట్టే పాలక బూర్జువా వర్గానికి సాష్టాంగపడడమే యిది.

సుప్రసిద్ధ జర్మన్ శాస్త్రజ్ఞుడు ఆర్థర్ డ్రెవ్స్ తన 'యేసుక్రీస్తు పుక్కిటి పురాణం' అనే గ్రంథంలో మత మూఢవిశ్వాసాలనూ, మత నీతి కథలనూ పూర్వపక్షం చేస్తూ, యేసుక్రీస్తు యెప్పుడూ లేడని నిరూపిస్తూ, గ్రంథాంతంలో మతానికి అనుకూలంగా ప్రకటన చేస్తాడు– అది మెరుగు పెట్టబడినదీ, శుద్ధి చేయబడినదీ, మరింత నిగూఢమైనదీ, "దిన దినం పెరుగుతున్న ప్రకృతివాదపు వెల్లువకు" నిలదొక్కుకోగలిగినదీ అయిన మతం అయినప్పటికీ (నాలుగవ జర్మన్ కూర్పు, 1910, పుట.238). క్షీణించిన పాత మత మూఢవిశ్వాసాల స్థానంలో మరింత అసహ్యమైన, నీచమైన కొత్త మూఢవిశ్వాసాలను పెట్టడానికి నగ్న ఉద్దేశపూర్వకమైన ప్రగతి వ్యతిరేక దోపిడీదార్లకు బహిరంగంగా తోడ్పడుతున్నవాడు.

దీని అర్థం, డ్రెవ్స్‌ను అనువదించకూడదని కాదు. దీని అర్థం, కమ్యూనిస్టులూ, స్థిరమైన సకల భౌతికవాదులూ బూర్జువావర్గంలోని ప్రగతిశీల విభాగంతో కొంత వరకు పొత్తు చేసుకొని, ఆ విభాగం ప్రగతి వ్యతిరేకమైనప్పుడు దానిని జంకు లేకుండా గుట్టు కడగాలని. దీని అర్థం, బూర్జువావర్గం విప్లవకరంగా వున్న నాటి పద్దెనిమిదవ శతాబ్దపు బూర్జువావర్గ ప్రతినిధులతో పొత్తును తెంపి వేయటం మార్క్సిజానికీ, భౌతికవాదానికీ ద్రోహమనీ; యెందుకంటే, యేదో ఒక రూపంలో, యేదో ఒక మేరకు డ్రెవ్స్‌లతో "పొత్తు", ప్రాబల్యంలో వున్న మత సంబంధమైన జ్ఞానవ్యతిరేకులతో మన పోరాటానికి అత్యవసరం.

సమరశీల భౌతికవాద పత్రికగా వుండాలని బయలుదేరే 'పాద్ జ్నామెనెమ్ మార్క్సిజ్మ' తన స్థలంలో అధిక భాగాన్ని నాస్తికవాద ప్రచారానికీ, యీ విషయం మీద గల సారస్వత సమీక్షలకూ, యీ రంగంలో మన ప్రభుత్వ కృషిలోని అపారమైన లోపాలను సరిదిద్దడానికీ అర్పించాలి. ఆధునిక బూర్జువావర్గ ప్రయోజనాలు, వర్గ సంస్థలతో, మత సంస్థలతో మత ప్రచారానికి సంబంధించిన సంఘాలతో యెలా జోడింపబడి వుండేదీ చూపించే అనేక నిర్దిష్ట వాస్తవాలూ, పోలికలూ గల పుస్తకాలను వినియోగించుకోవడం మరీ ముఖ్యం.

మతానికీ, పెట్టుబడికీ మధ్య అధికారికమైన, రాజ్యపరమైన సంబంధం తక్కువ స్పష్టంగా వున్న అమెరికా సంయుక్త రాష్ట్రాలకు చెందిన సమాచారమంతా మహాముఖ్యమైనది. కానీ, మరొకవైపున, "ఆధునిక ప్రజాస్వామ్యం" అనబడేది బూర్జువావర్గానికి అనుకూలమైనదంతా అత్యంత ప్రగతి వ్యతిరేక భావాలనూ, మతాన్నీ, జ్ఞాన వ్యతిరేకతనూ, దోపిడీదార్ల సమర్థననూ, వగైరాలను బోధించడానికి స్వేచ్ఛ తప్ప మరేమీ కాదని మనకు అంతకంతకూ స్పష్టమౌతుంది.

సమరశీల భౌతికవాద పత్రికగా వుండాలని బయలుదేరే పత్రిక ఒక పాఠక లోకానికి నాస్తికవాద సారస్వతపు సమీక్షలు సమకూర్చి, ఫలానా రచనయే పాఠక బృందానికి, యే విషయంలో అనుకూలంగా వుండవచ్చునో చూపుతుందనీ, మన దేశంలో యే సారస్వతం ప్రచురితమైందీ (యోగ్యమైన అనువాదాలు మాత్రమే చెప్పాలి, మరి అవి అంత యెక్కువగా లేవు), యేవి యింకా ప్రచురితం కావలసి వున్నదీ పేర్కొంటుందనీ ఆశిస్తున్నాను.

కమ్యూనిస్టు పార్టీకి చెందని, స్థిరమైన భౌతికవాదులతో పొత్తుతోపాటుగా, సమరశీల భౌతికవాదుల కృషికి (అంతకంటె తక్కువ కాని, బహుశా అంతకంటె యెక్కువ), ప్రాముఖ్యం గల అంశమేమిటంటే, ఆధునిక ప్రకృతిశాస్త్ర ప్రతినిధులలో యెవరైతే భౌతికవాదంవైపు మొగ్గుతూ, "విద్యాధిక సమాజం" అనబడే దానిలో ఫాషనబుల్‌గా వున్న భావవాద, సందేహవాదాలలో కొట్టే తాత్త్విక షికార్లకు వ్యతిరేకంగా భౌతికవాదాన్ని సమర్థించడానికీ, ప్రచారం చేయడానికీ భయపడరో, వాళ్లతో పొత్తు.

'పాద్ జ్నామెనెమ్ మార్క్సిజ్మ' నం.1-2 సంచికలో ఐన్‌స్టైన్ సాపేక్ష సిద్ధాంతం మీద ఎ.తిమిర్యాజెవ్ రాసిన వ్యాసం ఆ పత్రిక యీ రెండవ పొత్తును కూడా సాధించడంలో విజయం పొందుతుందనే ఆశ కలిగిస్తున్నది. దానికి మరింత శ్రద్ధ అర్పించాలి. జ్ఞాపకం వుంచుకోవలసింది యేమిటంటే, సరిగ్గా ఆధునిక ప్రకృతిశాస్త్రంలో సంభవిస్తున్న తీవ్ర సంక్షోభం అతి తరచుగా ప్రగతి వ్యతిరేక తాత్త్విక సిద్ధాంతాలకూ, సిద్ధాంత శాఖలకూ, ధోరణులకూ, ధోరణి శాఖలకూ కారణమౌతుంది. కనుక, ప్రకృతిశాస్త్రంలో యిటీవలి విప్లవం లేవనెత్తిన సమస్యలను గమనిస్తే తప్ప, తాత్త్విక పత్రికలు సాగించే యీ కృషికి ప్రకృతి శాస్త్రజ్ఞుల తోడ్పాటు తీసుకుంటే తప్ప, సమరశీల భౌతికవాదం సమరశీలంగానూ వుండజాలదు. భౌతికవాదంగానూ వుండజాలదు. భౌతికవాద పునాదులమీద ఐన్‌స్టైన్ స్వయంగా దాడియేదీ చేయులేదని తిమిర్యాజెవ్ అంటున్నాడు; అలాంటి ఐన్‌స్టైన్ చెప్పిన సిద్ధాంతాన్ని సకల దేశాల బూర్జువా మేధావులలో అపార సంఖ్యాకులు యిప్పటికే సంగ్రహించుకున్నారని యీ పత్రిక మొదటి సంచికలో తిమిర్యాజెవ్ చెప్పవలసి వచ్చింది; యిది ఐన్‌స్టైన్‌కే కాదు, పంతొమ్మిదవ శతాబ్ది అంతం నుండి వున్న ప్రకృతిశాస్త్ర మహాసంస్కర్తలలో అధిఖ సంఖ్యాకులకు కాకపోతే అనేకులకు వర్తిస్తుందని గమనించాలి.

యీ ఘటనపట్ల మన వైఖరి రాజకీయ చైతన్య యుతమైనదిగా వుండాలంటే, దృఢమైన తాత్త్విక పునాది మీద నిలబడితే తప్ప యే ప్రకృతిశాస్త్రమూ, యే భౌతికవాదమూ బూర్జువా భావాల దాడికీ, బూర్జువా ప్రపంచ దృక్పథ పునస్థాపనకూ వ్యతిరేకంగా చేసే పోరాటంలో నిలబడలేదని గుర్తించాలి. ప్రకృతి శాస్త్రజ్ఞుడు యీ పోరాటంలో నిలబడాలంటే, యీ పోరాటాన్ని అంతిమ విజయందాకా సాగించాలంటే, అతను ఆధునిక

[illegible] ఉపకరణమై తీరాలి, అనగా [illegible] అయి తీరాలి. యీ లక్ష్యం సాధించడానికి 'పాద్ జ్నామెనెమ్ మార్క్సిజ్మ' రచయితలు హెగెలియన్ గతితర్కాన్ని భౌతికవాద దృక్పథం నుండి క్రమపద్ధతిగా అధ్యయనం చేయడానికి యేర్పాట్లు చేయాలి-అనగా, మార్క్సు తన "పెట్టుబడి"లోనూ, తన చారిత్రక, రాజకీయ రచనలలోనూ ఆచరణలో వర్తింపజేసిన గతితర్కాన్ని మార్క్సు దానిని యెంత విజయవంతంగా వర్తింపజేసినాడంటే, తూర్పున (జపాన్, భారతదేశం, చైనాలలో) నూతన వర్గాలు-అనగా, ప్రపంచ ప్రజానీకంలో అధిక భాగంగా వున్న కోటానుకోట్ల మానవులు, యెవరి చారిత్రక నిష్క్రియాపరత్వమూ, చారిత్రక జడత్వమూ యింతకు మునుపు అనేక పురోగామి యూరోపియన్ దేశాల నిలువనీటితనానికీ, క్షీణత్వానికీ కారణమైనాయెా ఆ మానవులు-సజీవత్వానికీ, పోరాటానికీ ప్రబుద్ధమౌతున్న ప్రతి రోజూ, నూతన ప్రజలూ, నూతన వర్గాలూ సజీవత్వానికి ప్రబుద్ధమౌతున్న ప్రతి రోజూ మార్క్సిజంకు ఒక కొత్త ధ్రువీకరణగా వుంటున్నది.

నిజమే, హెగెలియన్ గతితర్కపు యీ అధ్యయనమూ, యీ వ్యాఖ్యానమూ, యీ ప్రచారమూ మహాకష్టమైనవి. యీ దిశలో మొదటి ప్రయోగాలు నిస్సందేహంగా తప్పులతో కూడి వుంటాయి. కానీ, యెప్పుడూ యేదీ చేయనివాడే తప్పులు కూడా చేయడు. భౌతికవాదాత్మకంగా అవగాహన చేసుకోబడిన హెగెలియన్ గతితర్కాన్ని వర్తింపజేసే మార్క్సు పద్ధతిని మన ప్రాతిపదికగా తీసుకొని, మనం యీ గతితర్కాన్ని అన్ని పార్శ్వాల నుండీ విస్తరించడమూ, హెగెల్ ప్రధాన రచనల నుండి ఖండికలు పత్రికల్లో ముద్రించడమూ, వాటిని భౌతికవాదాత్మకంగా వ్యాఖ్యానించడమూ, మార్క్సు గతితర్కాన్ని వర్తింపజేసిన పద్ధతిలోని ఉదాహరణల సాయంతోనూ, యిటీవలి చరిత్ర, ముఖ్యంగా ఆధునిక సామ్రాజ్యవాద యుద్ధమూ, విప్లవమూ, అసాధారణమైనంత పుష్కలంగా సమకూర్చిన ఆర్థిక, రాజకీయ సంబంధాల రంగంలోని పరస్పరవాదప్ర ఉదాహరణల సాయంతోనూ వాటి మీద విమర్శించడమూ చేయగలం, చేసితీరాలి. నా అభిప్రాయంలో, 'పాద్ జ్నామెనెమ్ మార్క్సిజ్మ' సంపాదకులూ, రచయితలూ "హెగెలియన్ గతితర్కపు భౌతికవాద మిత్రుల సంఘం" -లాంటిదిగా వుండాలి. ప్రకృతిశాస్త్రంలోని విప్లవం లేవనెత్తుతున్నవీ, బూర్జువా ఫాషన్ యొక్క మేధావి అభిమానులు ప్రగతి వ్యతిరేకతలో "తొట్రుకొని పడే"టట్లు చేసేవీ అయిన తాత్విక సమస్యలకు ఆధునిక ప్రకృతి శాస్త్రజ్ఞులు (యెలా అన్వేషించవలసిందీ వాళ్లకు తెలిస్తే, వాళ్లకు తోడ్పడం మనం నేర్చుకుంటే) భౌతిక వాదాత్మకంగా వ్యాఖ్యానించబడిన హెగెలియన్ గతితర్కంలో జవాబుల పరంపరను కనుగొంటారు.

భౌతికవాదం అలాంటి కర్తవ్యాన్ని పెట్టుకొని, దానిని క్రమపద్ధతిగా నిర్వర్తిస్తే తప్ప, సమరశీల భౌతికవాదంగా వుండజాలదు. శ్చెద్రీన్ మాటల్లో చెప్పాలంటే, అది పోరాటం చేసేదిగా కాక, పోరాటానికి గురి అయ్యేదిగా వుంటుంది. యిది లేకుండా, ప్రముఖ ప్రకృతి శాస్త్రజ్ఞులు తమ తాత్విక నిర్ధారణలూ, సాధారణీకరణలూ చేయడంలో, మునుపటి లాగే, తరచుగా నిస్సహాయులుగా వుంటారు. యెందుకంటే, ప్రకృతిశాస్త్రం అన్ని రంగాలలోనూ యెంత వేగంగా పురోగమిస్తూ, యెంత ప్రగాఢ విప్లవాత్మకమైన ఉత్పతనానికి లోనౌతూ వుందంటే, అది తాత్విక నిర్ధారణలు చేయడాన్ని విసర్జించజాలదు.

ముగింపుగా, ఒక ఉదాహరణ యిస్తాను: దీనికి తత్వశాస్త్రంతో యేమీ సంబంధం లేదు, కానీ, యేమైనప్పటికీ, సామాజిక సమస్యలతో సంబంధం వుంది; సామాజిక సమస్యలకు 'పాద్ జ్నామెనెమ్ మార్క్సిజ్మ' కూడా శ్రద్ధను అర్పించగోరుతుంది.

ఆధునిక కుహనా శాస్త్ర విజ్ఞానం వాస్తవంగా అత్యంత మొరటు, అత్యంత హీనమైన ప్రగతి వ్యతిరేక అభిప్రాయాలకు వాహికగా పనిచేసే పద్ధతికి యిది ఉదాహరణ.

'రష్యన్ సాంకేతిక సంఘం' యొక్క పదకొండవ శాఖ ప్రచురించే 'ఎకనమిస్టు' 93 పత్రిక మొదటి సంచిక (1922) ప్రతి ఒకటి యిటీవల నాకు వచ్చింది. యీ పత్రికను నాకు పంపిన యువ కమ్యూనిస్టు (దీనిని చదవడానికి బహుశా అతనికి వ్యవధి లేకపోయింది) అనాలోచితంగా దీనితో గణనీయమైన అంగీకారాన్ని వ్యక్తం చేసినాడు. వాస్తవంలో యీ పత్రిక (యెంత వరకు ఉద్దేశపూర్వకంగానో నాకు తెలియదు) ఆధునిక ప్యూడలిస్టుల పత్రిక. శాస్త్ర విజ్ఞానం, ప్రజాస్వామ్యం వగైరాల ముసుగు వేసుకున్న ప్యూడలిస్టులేననుకోండి.

పి.ఎ.సొరోకిన్ అనే అతను యీ పత్రికలో 'యుద్ధ ప్రభావం' మీద విస్తృతమైన, "సామాజిక శాస్త్రం" పేర పరిశోధనను ప్రచురిస్తాడు. యీ విద్వత్ వ్యాసం నిండా యీ రచయిత యొక్క, విదేశాలలోని యితని అనేక ఉపాధ్యాయుల యొక్క, సహశాస్త్రజ్ఞుల యొక్క "సామాజిక శాస్త్ర" రచనలకు విద్వత్ ప్రస్తావనలు వున్నాయి. అతని విద్వత్తుకు ఒక ఉదాహరణ యిది.

83వ పుటలో యిలా వుంది:

"పెట్రోగ్రాడ్‌లోని ప్రతి 10,000 వివాహాలలోనూ యిప్పుడు 92.2 విడాకులు వున్నాయి- ఊహాతీతమైన సంఖ్య. భగ్నమైన ప్రతి 100 వివాహాలలోనూ 51.1 వివాహాలు యేడాది కంటె తక్కువ కాలం నిలిచినాయి, 11 శాతం నెలకంటె తక్కువ కాలం నిలిచినాయి, 22 శాతం రెండు నెలల కంటె తక్కువ నిలిచినాయి, 41 శాతం మూడు నుండి ఆరు నెలల కంటె తక్కువ కాలం నిలిచినాయి, 26 శాతం మాత్రమే ఆరు నెలలకు పైగా నిలిచినాయి. యీ అంకెలు యేమి తెలుపుతాయంటే, ఆధునిక చట్టబద్ధ వివాహం క్రియలో వివాహ బాహ్యమైన కామక్రీడను మరుగుపరిచే రూపం అని; 'దొంగ కూడు' కోరేవాళ్లు 'చట్టబద్ధమైన మార్గంలో తమ కోరికను తీర్చుకోడానికి వీలు కలిగించేది అని" ('ఎకనమిస్ట్' నం.1 పుట.83).

యీ పెద్దమనిషీ, యీ పత్రికను ప్రచురించి, యిలాంటి మాటలకు స్థలం యిచ్చే 'రష్యన్ సాంకేతిక సంఘమూ' నిస్సందేహంగా తాము ప్రజాస్వామ్య అనుయాయులమని అనుకుంటారు; వాళ్లు ప్యూడలిస్టులూ, ప్రగతి వ్యతిరేకులూ, "పట్టభద్రులైన మతతత్వపు గులాములూ" అనే వాస్తవం చెప్పితే అది తమను అవమానించడంగా వాళ్లు పరిగణిస్తారు.

అత్యంత ప్రజాస్వామికమైన బూర్జువా రిపబ్లిక్కులన్నిటిలోనూ కూడా ఆధునిక బూర్జువా ప్రజాస్వామ్యం యీ విషయంలో స్త్రీలపట్లా, 'అక్రమ' సంతానంపట్లా అసలైన ప్యూడల్ వైఖరిని ప్రదర్శిస్తుందని యీ విషయం మీద ఆసక్తి గల యెవరికైనా చూపించడానికి బూర్జువా దేశాలలో వివాహంమీదా, విడాకుల మీదా, అక్రమ సంతానం మీదా వున్న శాసనావళితోనూ, యీ రంగంలో వున్న వాస్తవ పరిస్థితులతోనూ అత్యంత స్వల్ప పరిచయం కూడా చాలు.

కానీ, మెన్షివిక్కులూ, సోషలిస్టు రివల్యూషనరీలూ, అరాచకవాదులలో కొంత భాగమూ, పశ్చిమ దేశాలలోని తదనురూపమైన సకల పార్టీలూ ప్రజాస్వామ్యం గురించీ, దానిని బోల్షెవిక్కులు భగ్నం చేయడం గురించీ కేకలు వేయకుండా యిది అరికట్టదు. కానీ, వాస్తవం యేమిటంటే, వివాహమూ, విడాకులూ, అక్రమ సంతానమూలాంటి సమస్యల విషయంలో బోల్షివిక్ విప్లవమొక్కటే మినహాయింపులు లేని ప్రజాతంత్ర విప్లవం. మరి యిది యే దేశంలోనైనా సగానికి మించిన ప్రజానీకపు ప్రయోజనాలకు సూటిగా సంబంధించిన సమస్య. బోల్షివిక్ విప్లవం కంటె ముందు అనేక బూర్జువా విప్లవాలు జరిగి, ప్రజాతంత్ర విప్లవాలమని చెప్పుకున్నప్పటికీ, యీ విషయంలో ప్రగతి వ్యతిరేకతతోనూ, ప్యూడలిజంతోనూ, పాలక, ఆస్తిపర వర్గాల మామూలు కపటంతోనూ స్థిర సంకల్పపు పోరాటం చేయడానికి బోల్షివిక్ విప్లవమే మొదటి విప్లవమూ, ఏకైక విప్లవమూ.

ప్రతి 10,000 వివాహాలకూ 92 విడాకులు సొరోకిన్‌కు ఊహాతీతమైన సంఖ్యగా కనపడితే, ఆ రచయిత అలాంటి మఠం ఉందని ఎవరూ నమ్మజాలనంతగా జీవితం నుండి సంపూర్ణంగా వేరు చేయబడిన సన్యాసుల మఠంలో జీవించినాడనీ, పెంచబడినాడనిగానీ లేదా అతను ప్రగతి వ్యతిరేకత యొక్క, బూర్జువా వర్గం యొక్క ప్రయోజనానికి అనుగుణంగా సత్యాన్ని వికృతపరుస్తున్నాడనిగానీ మాత్రమే యెవరైనా అనుకోగలరు. బూర్జువా దేశాలలోని సామాజిక పరిస్థితులతో కనీసపు పరిచయం వున్న యెవరికైనా తెలుస్తుంది, వాస్తవమైన విడాకుల నిజమైన సంఖ్య (మతమూ, చట్టమూ అనుమతించనివని చెప్పనక్కరలేదు) ప్రతిచోటా లెక్కకు మీరినంత యెక్కువగా వున్నాయని. యీ విషయంలో రష్యాకూ, యితర దేశాలకూ మధ్య గల ఒకే ఒక భేదం యేమిటంటే, మన చట్టాలు కపటాన్ని ఆమోదించవు. స్త్రీనీ, ఆమె సంతానాన్నీ నీచపరచడాన్ని ఆమోదించవు, కపట మంతటిమీదా, నీచపరచడమంతటి మీదా బహిరంగంగా, ప్రభుత్వం పేరు మీద క్రమపద్ధతిగా యుద్ధం ప్రకటిస్తాయి.

యీ ఆధునిక "విద్యాధిక" ప్యూడలిస్టుల మీద కూడా మార్క్సిస్టు పత్రిక యుద్ధం సాగించవలసి వుంటుంది. బహుశా, ప్రభుత్వ ధనం తీసుకుంటూ, మన యువజనులకు విద్యనేర్పడానికి మన ప్రభుత్వ ఉద్యోగాలలో వున్నవాళ్లు వాళ్లలో వున్నది కొద్దిమంది కాదు, యీ పదవికి వీళ్లు చిన్న పిల్లల విద్యాసంస్థల సూపరింటెండెంట్ల పదవికి పేరుకెక్కిన నీతిభ్రష్టులు యెంత యోగ్యులో అంతకంటె యోగ్యులు కాకపోయినప్పటికీ.

రష్యా కార్మికవర్గం అధికారం గెలుచుకోగలనని రుజువు చేసుకుంది; కానీ దాన్ని ఉపయోగించుకోవడం అది యింకా నేర్చుకోలేదు. లేకపోతే, అది యెప్పుడో అలాంటి ఉపాధ్యాయులనూ, విద్వత్ సంఘాల సభ్యులనూ బూర్జువా "ప్రజాస్వామ్యం" గల దేశాలకు సవినయంగా పంపించివేసి ఉండేది. అలాంటి ప్యూడలిస్టులకు అదే తగిన స్థలం.

కానీ, అది నేర్చుకుంటుంది, నేర్చుకోవాలనే సంకల్పం వుంటే.

మార్చి 12, 1922-'పాద్ జ్నామెనెమ్ మార్క్సిజ్మ' నం.3 మార్చి, 1922. ◈

ఆహార సంక్షోభం: ఆధిపత్యం కొరకు సామ్రాజ్యవాదుల సృష్టి

ప్రపంచంలో ఆహారధాన్యాల ధరలు ఇటీవల పెరగటానికి కారణం చైనా, భారత్‌లలోని మధ్యతరగతి వర్గాల ప్రజల ఆహారం వినియోగం పెరగటమేననీ బుష్ ప్రకటించాడు. ధరల పెరుగుదలకు అసలు కారణాలను కప్పిపుచ్చటంకోసం అమెరికా పాలకులు ఈ తప్పు ప్రచారానికి పూనుకున్నారు. దీనితో అమెరికనులే తిండిపోతులు, తిండి ఎక్కువై ఊబశరీరాలు అమెరికన్ల ఆరోగ్య సమస్యగా వుందంటూ భారత ప్రచార సాధనాలు సంచలన కధనాలు సాగించాయి తప్ప అసలు కారణాలను వెలికి తియ్యలేదు.

జూన్‌లో జరిగిన ప్రపంచ ఆరోగ్య సదస్సులో ఆహార వినియోగం పెరిగినందునే ధరలు పెరిగాయనీ, కొన్ని దేశాలలో కరువువల్ల దిగుబడి తగ్గి ధరలు పెరిగాయనీ, జీవ ఇంధనాల తయారీ వల్ల 3 శాతం మేరకు మాత్రమే ధరలు పెరిగాయనీ అమెరికా, యూరోపియన్ యూనియన్‌లు వాదించాయి. అసలు కారణాలు తెలిసి కూడా తప్పుడు సమాచారాన్నే ముందుకు తెచ్చాయి.

2002 నుండి 2008 వరకూ వున్న కాలంలో ఆహారధాన్యాల ధరల పెరుగుదలపై ప్రపంచబ్యాంకు ఒక అధ్యయనాన్ని చేయించి, నివేదికను 2008 ఏప్రిల్‌లో సిద్ధం చేసింది. బుష్ పాలనలో ముఖ్యపదవుల్లో వుండి ఇప్పుడు ప్రపంచబ్యాంకు అధ్యక్షుడిగా వున్న రాబర్టు జోల్లిక్ దీనిని విడుదల చేయకుండా ఆపివేశాడు. ఇప్పుడు సామ్రాజ్యవాద దేశాధినేతల జి-8 సమావేశానికి ముందు 'ది గార్డియన్' పత్రికలో ప్రచురింపచేశారు. ప్రపంచ దేశాలన్నీ పాల్గొన్న సదస్సుకు సామ్రాజ్యవాదుల అబద్ధాలు చర్చనీయాంశం! కాగా సామ్రాజ్యవాద అధినేతల సమావేశానికి వాస్తవ పరిస్థితి తెలిపే నివేదిక సమర్పణ! ఈ తేడా దేనికో అర్ధం చేసుకోవటం సులభమే.

ప్రపంచబ్యాంకు నివేదిక ఆహారధాన్యాల ధరలు 140 శాతం పెరిగాయనీ, అంటే వంద రూపాయలున్న ధర 240 రూపాయలు అయిందని పేర్కొంది. ఈ పెరుగుదలలో 75 శాతానికి అమెరికా, యూరపులలో జీవఇంధన తయారీ కారణమని పేర్కొంది. ఈ క్రమంలో కొన్ని దేశాలలో కరువు వచ్చిందనీ, అయితే ఆహార ధాన్యాలపై దాని ప్రభావం 3 శాతం మాత్రమేననీ పేర్కొంది. అంటే పెరిగిన 140లో కరువువల్ల పెరిగింది 4 మాత్రమేనన్నమాట. చమురు, ఎరువుల ధరల పెరుగుదలవల్ల 15 శాతం పెరిగాయనీ, అంటే పెరిగిన 140లో 21 మాత్రమే పెరిగిందని పేర్కొంది.

ఇంతేకాక అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఆదాయాల త్వరితవృద్ధి ఆహార ధాన్యాల వినియోగం పెరగటానికి దారితీయలేదనీ, ఇంతగా ధరలు పెరగటానికి అది పరిగణించదగిన కారణం కాదనీ పేర్కొంది. జీవ ఇంధనాల పెరుగుదల లేకపోతే, ఆహారధాన్యాల నిల్వలు ఇంతగా తరిగిపోయి, డిమాండు పెరిగి ధరలు పెరిగి వుండేవి కాదని ప్రపంచబ్యాంకు నివేదిక స్పష్టంగా పేర్కొంది.

జీవ ఇంధనాలు మూడు విధాలుగా ధరలను పెంచాయని నివేదిక చెప్పింది ఒకటి: ఆహారధాన్యాలను ఆహారంగా వాడకుండా జీవ ఇంధనాలుగా మార్చటానికి తరలించటంతో ధాన్యం నిల్వలు తగ్గాయి. అమెరికాలో మొక్కజొన్న పంటలో మూడవ వంతుకు పైగానే జీవఇంధన తయారీకి వాడుతున్నారు. యూరపులో వంట నూనెల్లో సగం బయోడీజిలుగా మారుస్తున్నారు. రెండు: జీవ ఇంధన పంటల సాగుకు కొంత భూమిని కేటాయించే విధంగా రైతులను ప్రోత్సహించటం. అతిపెద్ద ఆహార ధాన్య ఎగుమతిదారులైన అమెరికా, యూరోపియను యూనియన్లలో కోట్లాది ఎకరాల భూమిని జీవ ఇంధన పంటల సాగుకు తరలించారు. మూడు: ఈ కొరతనాధారం చేసుకుని గుత్త ద్రవ్యవ్యాపారులు ధాన్యాన్ని కొని భవిష్యవాణిజ్యానికి పూనుకోవటం. ప్రపంచ మార్కెట్టు లోని ఆహారధాన్యాల్లో 70 శాతం పైగా బ్యాంకుల స్పెక్యులేటివ్ పెట్టుబడి ఆధీనంలోనే వున్నాయి.

ఈ ధరల పెరుగుదల వల్ల ప్రపంచంలో మరో 10 కోట్ల మంది దారిద్ర్యరేఖ దిగువకు నెట్టివేయబడ్డారనీ, ఆకలి, అర్ధాకలి పాలన బడుతున్న జనసంఖ్య పెరగటమే కాకుండా, వారి ఆకలి తీరని పూటలు పెరుగుతున్నాయనీ, ఇదే హైతీ, ఈజిప్టు, బంగ్లాదేశ్ తదితర దేశాలలో అశాంతికీ, అల్లర్లకూ కారణమయిందని ఆ నివేదిక పేర్కొంది.

ఆహారధాన్యాల ధరల పెరుగుదలకు గల మూడు అంశాలనూ ప్రపంచబ్యాంకు నివేదిక సూటిగానే పేర్కొంది. అయితే ఆహారధరల పెరుగుదల వెనుకనున్న సామ్రాజ్యవాదుల దీర్ఘకాల వ్యూహం గురించి మాత్రం అది మౌనం వహించింది. వారి సేవకుడిగా దానికది సహజమే.

రైతులకు విపరీత స్థాయిలో సబ్సిడీలనివ్వటం ద్వారా జీవ ఇంధన పంటల సాగును ప్రోత్సహించి, ప్రస్తుత ఆహార సంక్షోభానికి కారణమైన సామ్రాజ్యవాద దేశాధినేతలే దానికి పరిష్కార మార్గమనేదాన్ని కూడా సూచిస్తున్నారు. రోములో జరిగిన ప్రపంచ ఆహార సదస్సులో ఆహార సంక్షోభ పరిష్కారానికి జన్యుమార్పిడి విత్తనాలే పరిష్కారంగా ఆమోదించమని వత్తిడి చేసింది. ఆ తర్వాత కూడా మూడవ ప్రపంచ దేశాలపై వత్తిడి తెస్తున్నది. "కనుక మేము బయో టెక్నాలజీతోసహా పరిశోధనాత్మక వృక్ష, జంతు సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని బలంగా సూచిస్తున్నాము... అధిక దిగుబడులనూ, అధిక పోషక విలువలనూ, చీడపీడలకు అధిక ప్రతిఘటననూ, పర్యావరణ మార్పుకు తట్టుకోగలశక్తినీ యివ్వగల పంటల అభివృద్ధిని బయో టెక్నాలజీ వేగవంతం చేస్తుందని అభివృద్ధి చెందుతున్న దేశాలు గుర్తించాలి" అంటూ అమెరికా మంత్రి జాన్ నెగ్రోపాంటీ జన్యుమార్పిడి పంటల ప్రవేశానికి ద్వారాలు తెరవమని బడుగు దేశాధినేతలను కోరాడు.

జన్యుమార్పిడి జీవజాల వినియోగాన్ని నైతిక కారణాల రీత్యా రోమను కాథలిక్ చర్చి, దాని అధినేత పోపు వ్యతిరేకిస్తూ వస్తున్నారు. రోము సదస్సు సందర్భంగా పోపు బెనడిక్ట్‌చే జన్యుమార్పిడి జీవజాల వినియోగానికి ఆమోదిస్తూ ప్రకటన వెలువడుతుందని అమెరికా వర్గాలు ప్రచారం చేశాయి. వాటికన్ ప్రతినిధులు వాటిని ఖండించలేదు. ఏమైందో తెలియదు గానీ పోప్ బెనడిక్ట్ అలాంటి ప్రకటన చెయ్యలేదు. ఫిలిప్పైన్సు, లాటిన్ అమెరికాలోని కొన్ని దేశాల్లో జన్యుమార్పిడి విత్తనాల వినియోగానికి పాలకులు సిద్ధపడినా, పోపు అంగీకారం లేనందున ప్రజలు ఉత్సాహం చూపటంలేదు.

ఆహార సంక్షోభాన్ని తానే సృష్టించి, దానికి పరిష్కారం తానే సూచించి దానినే అమలు జరిపించడానికి సామ్రాజ్యవాదులు పూనుకున్నారు. తన గుత్తపెట్టుబడిదారీ వర్గపు ఆధిపత్యంలోకి ప్రపంచ వ్యవసాయాన్ని తీసుకురావటం. తద్వారా ఆహారంపైనా, ప్రపంచంపైనా ఆధిపత్యం పొందటం సామ్రాజ్యవాదుల అసలు లక్ష్యం.

సస్యవిప్లవ వ్యూహంతో సామ్రాజ్యవాదుల పరిశ్రమల ఉత్పత్తులైన ఎరువులు, పురుగుమందులపై వ్యవసాయరంగం ఆధారపడే స్థితి కల్పించారు. సస్యవిప్లవ రెండవ దశగా పేర్కొంటున్న జన్యుమార్పిడి జీవజాల వినియోగాన్ని పెంచటం ద్వారా వ్యవసాయరంగం పూర్తిగా కొద్ది బహుళజాతి కంపెనీల కబంధ హస్తాల్లో యిరుక్కుపోతుంది. మోన్‌శాంటో, సిన్‌జెంటా, డుపాంట్, డౌ, బాయర్, బిఏఎస్ఎఫ్‌వంటి కొద్ది కంపెనీలే రసాయన-విత్తన- జన్యుమార్పిడి గుత్త కంపెనీలుగా వున్నాయి. గత 30 ఏళ్ల అనుభవం తెలుపుతున్నదేమంటే ఈ సాంకేతిక పరిజ్ఞానంతో దిగుబడులు పెరుగుతాయి. కానీ పండించిన రైతూ, వినియోగదారూ కూడా తీవ్ర దోపిడీకి గురౌతారు. అదే సమయంలో వ్యవసాయరంగ ఉత్పత్తులు ప్రధానంగా ఆహారం, బట్టలు అందుబాటులో లేకుండా పోయే జనసంఖ్య పెరుగుతుంది. అందువల్లనే ఆహారధాన్యాల ఉత్పత్తి పెరిగినా ఆహారంలేక చనిపోయే పిల్లల సంఖ్య భీతి కొలిపే స్థాయిలో పెరుగుతున్నది. వాస్తవానికిది మార్క్సు చెప్పిన అధికోత్పత్తిలో సంక్షోభమే. దానికి కారణం పెట్టుబడిదారీ వ్యవస్థలో నానాటికీ తీవ్రమయ్యే వర్గ వ్యత్యాసాలే. దీనికి పరిష్కారం మార్క్సు చెప్పినట్లుగా వర్గ యుద్ధమే. శ్రామికవర్గ విప్లవమే. ◈

అమెరికా అధ్యక్ష పదవికి ఒబామా, మెక్ కిన్నేల పోటీ
ఆఫ్రో-అమెరికన్ల స్వేచ్ఛకు పంథా ఏది?

అమెరికా సంయుక్త రాష్ట్రాల కార్మిక విప్లవకర సంస్థ విడుదల చేసిన రే ఓ లైట్ న్యూస్ లెటర్‌లో అమెరికా అధ్యక్ష ఎన్నికలపై వ్రాసిన వ్యాసాన్ని అనువదించి యిస్తున్నాము.

- సంపాదకుడు

2008లో జరిగే అమెరికా అధ్యక్ష పదవికి ఎన్నికల్లో యిద్దరు గౌరవనీయ నల్లజాతి అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. ఇద్దరూ డెమొక్రాటిక్ పార్టీ తరఫున పార్లమెంటు సభ్యులుగా పనిచేశారు. బారక్ ఒబామా ఇల్లినాయిస్ రాష్ట్ర అసెంబ్లీ సభ్యునిగానూ, ఒకసారి పార్లమెంటు సభ్యునిగానూ వున్నారు. సింధియా మెక్ కిన్నే జార్జియా రాష్ట్రం నుండి ఆరుసార్లు పార్లమెంటు సభ్యురాలిగా పనిచేశారు. యుద్ధ నేరస్థ బుష్ మురా (రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి జాన్ మెక్ కేయిన్) కన్నా "ప్రగతిశీల" రాజకీయాలకు మారవలసిన అవసర ముందని ఇరువురూ ప్రకటించారు. ఇరాక్ నుండి సైన్యాలను వెనక్కు తీసుకురావాలనీ, పేదల, కార్మికుల జీవన పరిస్థితులను మెరుగుపర్చాల్సి వుందనీ ఇరువురూ చెప్పారు.

2008 నవంబరులో జరిగే ఎన్నికల్లో డెమోక్రాటిక్, రిపబ్లికన్ పార్టీలకు చెందిన అభ్యర్థులకే గెలుపు అవకాశాలెక్కువ వుంటాయి గనుక డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థి ఒబామాకు ఓటు వెయ్యటమే మెరుగైన ఎంపికవుతుందని వాస్తవికంగా ఆలోచించే ఆఫ్రో-అమెరికన్ వోటరు నిర్ణయించుకోవచ్చు. కానీ పరిస్థితిని లోతుగా పరిశీలించిన తర్వాత అనేక జాతులతో కూడిన అమెరికా కార్మిక వర్గపు, పీడిత ప్రజల ప్రయోజనాలు ఒబామాకు మద్దతివ్వటం ద్వారా నెరవేరవనీ, మెక్ కిన్నే, ప్రజాధికార కూటమికి మద్దతివ్వటం ద్వారా నెరవేరవచ్చుననీ మేము భావిస్తున్నాము. ఎందుకనీ?

కారణం:1 యుద్ధం-శాంతి-సామ్రాజ్యం

2000లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో, డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థి అల్‌గొరే "రక్షణ బడ్జెట్టును మరో 5 వేల కోట్ల డాలర్లు పెంచుతాన"ని వాగ్దానం చేశాడు "సైనిక బలాన్ని వినియోగించడానికి భయపడేది లేద"ని అన్నాడు. కాగా అప్పటి రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి జార్జి బుష్ బాల్కన్ దేశాలలో శాంతి పరిరక్షణ కార్యక్రమాలను విమర్శించి "వినయపూరిత విదేశాంగ విధానాన్ని" చేపడతానని వాగ్దానం చేశాడు. 2001 సెప్టెంబరు 11 ఘటనలో రెండు పార్టీలు తమ వైఖరిని మార్చుకున్నాయి. అల్‌గోరేతోపాటు ఉపాధ్యక్ష పదవికి పోటీ చేసిన జోలీబర్‌మాన్ వీటిని వివరాలతో తెలిపాడు (వాల్ స్ట్రీట్ జర్నల్, 21.5.2008). ఇవి గమనించిన తర్వాత ఈ రెండు పార్టీలలో ఎవరికి ఓటు వేసినా ఆఫ్రో-అమెరికన్ ప్రజలకూ, ప్రపంచ కార్మికవర్గానికీ ఒరిగేదేమీలేకపోగా, కోల్పోవటమే జరుగుతుంది.

2004 ఎన్నికల్లో డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థి కోటీశ్వరుడు జాన్ కెర్రీ. గర్విష్టి, బుద్ధిహీనుడైన జార్జి బుష్ కంటే మెరుగ్గా అమెరికా సామ్రాజ్యాన్ని కాపాడతానన్న వాగ్దానంతో కెర్రీ ప్రచారం చేసాడు. 2008లో డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థి ఒబామా ఇదే వాదన చేస్తున్నాడు. విదేశాంగ విధానంపై ఒబామా సలహాదారులందరూ యుద్ధోన్మాదులే. వారు: కార్టరు పాలన కాలంతో జాతీయ రక్షణ సలహాదారు బ్రెజిన్‌స్కీ; క్లింటన్ పాలనలో హైతీ దురాక్రమణను నిర్వహించిన ఉన్నత గూఢచారి ఆంథోనిలేక్; ఇజ్రాయిలు-పాలస్తీనా సంబంధాలపై క్లింటన్‌కు, బుష్‌కు సలహాదారు డెన్నిస్ రాస్; నేడు ప్రపంచంలోని అనేక దేశాల సైన్యాలు వాడుకుంటున్న, విప్లవ తిరుగుబాట్లను అణచే విధానాలపై జనరల్ పెట్రియాస్ పుస్తకానికి ముందుమాట రాసిన రక్షణాధికారి సారా సివెల్.

ఇరాక్ నుండి సైన్యాలను ఉపసంహరించాలన్న హిల్లరీ క్లింటన్‌లాగే ఒబామా వైఖరి వెనుకవున్న వాస్తవమేమిటంటే ఆ సైన్యాలను ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్‌లకు తరలించి, ఇరాన్, సిరియాలపై దురాక్రమణకు అనుకూల స్థానంలో వుంచటం. బుష్‌తో మిలాఖత్ అయ్యి 2006 ఎన్నికల నుండీ ఇరాక్‌లో సైనిక దళాల పెంపునూ, రక్షణ బడ్జెట్టు పెంపునూ సమర్థించిన డెమోక్రాటిక్ పార్టీ వైఖరి కొనసాగింపే ఇది.

2008 మే 16న ఐక్యరాజ్య సమితిలో మెక్ కిన్నే ఉపన్యాసం దీనికి భిన్నంగా వుంది. "తన ఓట్లతో యుద్ధానికి మద్దతునిచ్చి యుద్ధనేరాలలోనూ, చిత్రహింసలలోనూ, మానవాళి శాంతికి వ్యతిరేకంగా నేరాలలోనూ భాగస్వామైన డెమొక్రాటిక్ పార్టీ నాయకత్వంతో నా పుట్టిన రోజునాడు తెగతెంపులు చేసుకున్నా"ననీ చెప్పింది. డెమోక్రాటిక్ పార్టీకి చెందిన పార్లమెంటు సభ్యురాలై వుండి కూడా, సింధియా మెక్‌కిన్నే ఒంటరిగానే నిలిచి ఇరాక్‌పై బుష్ సాగిస్తున్న యుద్ధానికి బడా కంపెనీల లాభాలే చోదకశక్తులని ఎండగట్టింది. బుష్, బిన్‌లాడెన్‌ల ఇరువురి కుటుంబాల పెట్టుబడులున్న కార్లైల్ కంపెనీ వీటిలో ఒకటి. భీతి గొలిపే యుద్ధోన్మాద ప్రచారాన్ని ఆమె ఎదుర్కొంది. అమెరికా దేశభక్త చట్టాన్నీ, దానిననుసరించి వచ్చిన పోలీసు చట్టాలనూ రద్దు చేయాలని డిమాండు చేసింది. జార్జి బుష్, డిక్ ఛినీ, కండొలెస్సా రైస్‌లను అభిశంసించే తీర్మానాలను ఆమె ప్రతిపాదించింది. ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్, మధ్యప్రాచ్యం నుండి అమెరికా సైన్యాలను ఉపసంహరించాలనీ, యూరపు, ఆసియా, ఆఫ్రికాలలో వున్న అమెరికా సైన్యాలను స్వదేశానికి వెనక్కు రప్పించాలని ఆమె డిమాండు చేసింది.

మధ్యప్రాచ్యంపై అమెరికా యుద్ధమూ, దురాక్రమణలను అంతం చేసేందుకు గంభీర ప్రజాపోరాట నిర్మాణానికి తాను కట్టుబడి వున్నానని ఐ.ఎల్.డబ్ల్యు.యు. (రేవు కార్మికుల మిలిటెంటు యూనియన్)కు వ్రాసిన లేఖలో ఆమె తెలిపింది. "ఉత్పత్తి కేంద్రాల వద్దనే యుద్ధమూ, దురాక్రమణల వ్యతిరేక దినంగా మేడేను జరపాలన్న మీ తీర్మానానికి ఎలాంటి మినహాయింపులూ లేకుండా, బహిరంగంగా 2008 అధ్యక్ష ఎన్నికల్లోని ఒక అభ్యర్థి సగర్వంగా మద్దతునిస్తున్నదని మీ యూనియన్ సభ్యులకు తెలుపండి. నేనూ, ప్రజలకే అధికార ఉద్యమమూ పశ్చిమ తీరమంతటా మీ పక్షానే నిలుస్తాము; యుద్ధాన్ని ప్రతిఘటించాలని కార్మికవర్గం ఎక్కడ, ఎప్పుడు పిలుపు నిచ్చినా వారిని వెన్నంటే వుంటాము మీతో కలిసి వీధి పోరాటాలలోకి వస్తాము" అని ఆమె ఆ లేఖలో తెలిపింది. ఆమె ఆ మాటను నిలబెట్టుకున్నారు.

ఈ వివరణ రీత్యా, ఆఫ్రో-అమెరికన్ పౌరుడెవ్వరైనా; ఆఫ్రో-అమెరికన్‌ల, కార్మికుల, పేదల బిడ్డలను ఫిరంగుల్లో మందుగుండగా అమెరికా సామ్రాజ్యవాదం వాడటాన్ని నిరసించే వారెవరైనా, ఇరాక్‌పై అమెరికా సైనిక దురాక్రమణ అంతం కావాలని కోరుకునే వారెవరైనా, అధ్యక్ష అభ్యర్థిగా మెక్ కిన్నేకు మద్దతునివ్వాలి.

కారణం:2 శ్వేతవర్ణ ఆధిపత్యం-ఆఫ్రో-అమెరికన్ల స్వయం నిర్ణయహక్కు.

శ్వేత వర్ణాల ఆధిపత్య అమెరికా 220 ఏళ్ల చరిత్రలో, ఒక నల్లజాతి పౌరుడు అధ్యక్షుడిగా ఎన్నిక కావటానికి అతి సమీపంగా వచ్చిన అభ్యర్థిగా ఒబామా పోటీకి చారిత్రక ప్రాధాన్యత వుందని అందరూ అంగీకరిస్తారు. ఆఫ్రో-అమెరికన్ జనాభా ఎక్కువగా వున్న దక్షిణ కారోలినాలో ఒబామా మొదటి విజయాన్ని పొందాడు. దక్షిణ కారోలినాలో డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థి ఎంపిక ఎన్నికల్లో ఓట్లు వేసిన వారిలో సగం మంది ఆఫ్రో-అమెరికన్లు కావటం ఒక రికార్డు. ఆఫ్రో-అమెరికన్ ఓటర్లలో 80 శాతం ఒబామాకు మద్దతిచ్చారు. ఈ నల్లజాతి మద్దతు వల్లనే ఒబామాకు 55 శాతం, హిల్లరీకి 25 శాతం, మరో అభ్యర్థి ఎడ్వర్డుకు 15 శాతం ఓట్లు వచ్చాయి. అయినప్పటికీ, దక్షిణ కారొలినాలోని ఆఫ్రో, అమెరికన్ల కష్టాలను గూర్చి ఒబామా పట్టించుకోలేదు.

దక్షిణ కారొలినాలో విజయం పొందిన ఆనందంతో, ఒబామా, అతని ప్రచారకులూ "జాతి పెద్ద విషయం కాదు" అని పదే పదే అన్నారు. నిజానికి జాతి అన్నదే అక్కడ ప్రధాన విషయం. తమ కష్టాలను తీర్చగలడన్న ఆశతోనే దక్షిణ కారొలినాలోని ఆఫ్రో-అమెరికన్లు పెద్దఎత్తున అతనికి రాజకీయ మద్దతునిచ్చారు. విజయానికి నల్లజాతి ప్రజలకు ధన్యవాదాలు చెప్పి, వారి ప్రయోజనాలకు ప్రతినిధిగా అంకితమౌతాననే బదులుగా, తనకు విజయాన్నందించిన ప్రజల నుండే ఒబామా దూరంగా జరిగాడు.

ఆనాటి నుండీ నల్లజాతి ఓట్లను సమీకరించుకుంటూ నల్లజాతి ఐక్యత అవసరాన్ని తీవ్రంగా తిరస్కరించటమన్న వ్యూహాన్ని ఒబామా ప్రచారం స్వీకరించింది. దీనికి సూచన మత బోధకుడు రెవరెండ్ జెరేమియా రైట్. డెమోక్రాటిక్ పార్టీ మహిళా అభ్యర్థి హిల్లరీ క్లింటన్ అభ్యర్థిత్వంపై ఒబామా కొంత పైచేయి సాధించేవరకు ప్రచార సాధనాలు ఒబామాకు మద్దతునిచ్చారు. గుత్తపెట్టుబడి ఆధీనంలోని పత్రికలు ఒక నల్లజాతి అభ్యర్థికి మద్దతునివ్వటం అసాధారణం.

దేశంలోని నల్లజాతి మతబోధకుల్లో రెవరెండ్ రైట్ ముఖ్యుడు. ఆయన యూనిటీ చర్చి ఆఫ్ క్రైస్ట్‌కు ప్రజల్లో మంచి పునాది వుంది. రెవరెండ్ రైట్ నల్లజాతి విముక్తి మతతత్వాన్ని బోధిస్తున్నాడు. అమెరికా సామ్రాజ్యవాదాన్ని గురించీ, పాలస్తీనా, దక్షిణాఫ్రికాలోని అజానియాలోని పీడిత ప్రజలపై అది సాగిస్తున్న యుద్ధాన్ని గురించీ, ఆఫ్రో-అమెరికన్ ప్రజల అణచివేత గురించీ ఆయన సత్యాలనే చెబుతున్నాడు. రెవరెండ్ రైట్‌పై గుత్త పెట్టుబడి చేసిన దాడి నల్లజాతి చర్చిపైనే దాడి అనీ, ఆఫ్రో-అమెరికన్ సమాజపు అత్యంత ముఖ్యమైన ఆత్మరక్షణా వ్యవస్థ నల్లజాతి చర్చి అనీ ఆయన సరిగ్గానే చెబుతున్నాడు.

అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగానూ, నల్లజాతి ప్రజలకు మద్దతుగానూ వున్న రెవరెండ్ రైట్ రాజకీయ వైఖరిని ప్రసార సాధనాల వత్తిడితో ఒబామా ఖండించాడు. తన పెళ్లి జరిపిన, తన యిద్దరు కూతుళ్లకూ బాప్టిజం నెరపిన, తన రాజకీయ జీవితానికి ఊపునిచ్చిన రెవరెండ్ రైట్‌తో స్నేహసంబంధాలను తెంచివేసుకున్నాడు. దీనిపై ముమియా అబూ జమాల్ (జైలులో వున్న ఆఫ్రో-అమెరికన్ల నాయకుడు) ఇలా అన్నాడు: "యూరపు వాసి అయిన ఆఫ్రికన్‌కు కొడుకైన ఒబామా నల్లజాతి విముక్తి పిలుపునిస్తాడని ఆశించలేము ఎందుకంటే నల్లజాతి ప్రజల నాయకుడు కావాలని అతను కోరుకోవటం లేదు. ప్రపంచ తెల్లజాతికి నాయకుడవ్వాలని కోరుకుంటున్నాడు". నల్లజాతి వారైన కొలిన్ పావెల్, కండొలెజ్సా రైస్‌లు శ్వేతవర్ణ ఆధిపత్య క్రూర బుష్ పాలనలో ఉన్నత స్థానాలకు ఎదిగినందున ఆఫ్రో-అమెరికా ప్రజలకు ఒరిగిందేమీ లేనట్లుగానే, ఒబామా అధ్యక్షుడయినా ఒరిగేది లేదు.

ఆఫ్రో-అమెరికన్ ప్రజల ముందు గంభీరమైన సమస్య వుంది. ఒక వైపున అమెరికాకు మొట్టమొదటి నల్లజాతి అధ్యక్షుడిని ఎన్నుకోగల అవకాశం. ఈ అవకాశాన్ని వినియోగించుకోవటమంటే, ఒబామా రాజకీయాలను ఆమోదించటమే అవి: 1 అమెరికా సామ్రాజ్యవాదం చేతులలో ప్రత్యేకమైన అణచివేతకు ఆఫ్రో-అమెరికన్లు గురికావటం లేదు. 2. బానిసత్వం, కౌలుదారీ పద్ధతి, గుదిబంద, చట్ట వివక్ష, నేరస్థ జాతిగా ముద్ర, పెరుగుతున్న విద్వేషం, ప్రభుత్వం, పోలీసులు, స్థానిక నాయకులు మోసంతో భూములు లాగివేసుకోవటం-మొదలైనవన్నీ గతించిపోయిన విషయాలు. అమెరికా సమాజం, సంస్కృతి, విద్య, నీతి నియమాలపై వాటి ప్రభావం లేదు. 3. అమెరికాలో జాతి అన్నది పరిగణనలోలేని అంశం. జాతి వివక్షలేని సమాజం, ప్రపంచంలోకి మనం అడుగుపెట్టాం. ఈ వాదన ప్రకారం ఆఫ్రో, అమెరికన్ ప్రజల ఐక్యతకోసం కృషి చేయరాదు; పోరాడరాదు; ఎందుకంటే అలా చేయటమంటే "వేర్పాటుతత్వ" రాజకీయాలను ఆచరించటమే. దీనికి ప్రతిగా, అమెరికా సామ్రాజ్యవాదపు పతాకం క్రింద ఆఫ్రో, అమెరికన్లతోసహా ధనికులు, పేదలతో అమెరికా జనాభా అంతటి "జాతీయ ఐక్యత"ను ఒబామా ప్రవచిస్తున్నాడు. అధికారం వున్న, అధికారంలేని రెండు అసమాన బృందాల సమైక్యత అధికారంలో వున్న వారికి పైచేయినివ్వటానికి మాత్రమే సేవ చేస్తుందని నల్లజాతి నాయకుడు మాల్కం ఎక్స్ అన్నారు.

ఒబామా చెప్పిందే కరెక్టయితే, నల్ల అభ్యర్థిగా అతనికి ప్రాధాన్యతేమీ లేదు. మహిళా అభ్యర్థి కన్నా అతని గొప్పతనమేమీ లేదు. అయితే సత్యమేమంటే అమెరికా సామ్రాజ్యవాదంవల్ల ఆఫ్రో-అమెరికన్లు ఈనాటికీ అణచివేతకు గురౌతున్నారు. సరిగ్గా ఈ వాస్తవం వల్లనే ఆఫ్రో-అమెరికన్లు ఒబామా "నల్లజాతి అభ్యర్థిత్వానికి" మద్దతునిచ్చారు.

అమెరికా ఉత్తర ప్రాంతంలో మైనారిటీగా వున్న ఆఫ్రో-అమెరికన్ల హక్కులకూ, దక్షిణ ప్రాంతంలో వున్న ఆఫ్రో-అమెరికన్ల స్వేచ్ఛకూ వున్న అవసరాన్ని న్యూయార్కు నగరంలో సేన్ బెల్‌ను హత్య చేసిన హంతక పోలీసులను నిర్దోషులుగా విడుదల చేసిన కోర్టు తీర్పు తెలియజేస్తున్నది. కత్రినా తుఫాను బాధితులైన ఆఫ్రో-అమెరికన్లు తిరిగి తమ నివాసాలకు చేరుకోకుండా తరిమివేస్తున్న రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల విధానాలు, నల్లజాతి ప్రజలపై సాగుతున్న అనేకానేక వివక్షతలు-ఇవన్నీ నల్లజాతి రాజకీయ ఐక్యత పెరగవలసిన అవసరాన్ని తెలుపుతున్నాయి.

బారక్ ఒబామా ఈ రాజకీయ ఐక్యతకు వ్యతిరేకంగా వున్నాడు. సందర్భవశాత్తూ, ఆఫ్రో-అమెరికన్‌లకు మరో అవకాశం ఉంది. అధ్యక్ష పదవికి సింధియా మెక్ కిన్నేను బలపరచటం ఆఫ్రో, అమెరికన్ ప్రజలెదుర్కొంటున్న అన్ని సమస్యల్లోనూ ఆమె ప్రజలపక్షానే నిలుస్తున్నది. ఆమె అభ్యర్థిత్వాన్ని బలపరిచినందువల్ల ఆఫ్రో-అమెరికను, ఇతర పీడిత ప్రజలందరినీ సమీకరించగల అవకాశాలు మెరుగుపడి అమెరికా సామ్రాజ్యవాద వ్యతిరేకశక్తులన్నింటినీ ఐక్యపరచగలం. వారి ఐక్యతను పటిష్టపరచగలం. అంతిమంగా వర్ణవివక్షలేని సమాజంవైపుగా పురోగమించగలం. సింధియా మెక్ కిన్నే అధ్యక్ష అభ్యర్థిత్వాన్ని సమర్థించండి!

- జూన్, 2008

ప్రభుత్వ సామాజిక, ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా
పెరూ దేశంలోని రైతుసంఘాలు జరిపిన జాతీయ సమ్మె

పెరూ ప్రభుత్వం అటవీ భూములను, ఇతర జాతీయ వనరులను ప్రైవేటు కంపెనీలకు, వ్యక్తులకు ధారాదత్తం చేయటానికి వీలుగా, ఆ హక్కును సంక్రమింపచేసుకోవటానికి చేసిన చట్టాన్ని వ్యతిరేకిస్తూ పెరూ దేశంలోని రైతుసంఘాలు 2 రోజులపాటు జాతీయ సమ్మెను జరిపాయి.

జులై7, 8 తేదీలలో జరిగిన ఈ దేశవ్యాపిత సమ్మెకు 3 రైతు సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ పిలుపుకు రైతుసంఘాలు వూహించినదానికంటే బ్రహ్మాండమయిన స్థాయిలో స్పందన లభించింది. జాతీయ రైతుల సమాఖ్య, పెరూ రైతుల సమాఖ్యలు ఈ రెండు రోజుల జాతీయ సమ్మెలో పాల్గొన్నాయి.

కేవలం దేశ వనరుల, అటవీ భూముల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మాత్రమే కాక, తమ దేశ భూభాగం నుండి అమెరికా సేనలను ఖాళీ చేయించాలని కూడా డిమాండుచేస్తూ రైతుసంఘాలు సమ్మెను జరిపాయి.

లోరెటో అటవీ రక్షణ ప్రాంతాలు, సెల్వసెంట్రల్, అయాక్యుబో సెంట్రల్, ఆండియన్ అమెజోనియన్ ప్రాంతాలలో ఈ సమ్మె జరిగింది.

ఈ సమ్మె స్ఫూర్తితో 3వ రోజున ప్రభుత్వ ఆర్థిక, సామాజిక విధానాలను నిరసిస్తూ దేశవ్యాపితంగా సార్వత్రిక సమ్మె జరిగింది. వివిధ రాజకీయ పార్టీలూ, సామాజిక సంస్థలతో ఏర్పడిన ఫ్రంట్ ఈ నిరసన ప్రదర్శనను, దీనితోపాటు పెరూ రాజధాని లిమా నగరంలో భారీఎత్తున ప్రదర్శనలను నిర్వహించింది.

సమ్మెను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం భారీగా పోలీసు, సాయుధ దళాలను మోహరించింది. సమ్మెపట్ల తీవ్ర వ్యతిరేకత వుందనీ, సమ్మెలో ఎవరూ పాల్గొనరనీ ప్రభుత్వం మీడియాలో విస్తృతంగా ప్రచారం కావించింది.

అయినా వీటిని లక్ష్యపెట్టకుండా ప్రజలు ఈ సార్వత్రిక సమ్మెలో పాల్గొన్నారు. రాజధాని లిమా నగరంలో, ప్లాజాడి మాయో మీదుగా వివిధ ప్రాంతాల నుండి 25 ప్రదర్శనలు సాగాయి. రాజధానీ నగరం అంతా ప్రదర్శనలతోనూ, ప్రదర్శకుల నినాదాలతోనూ హోరెత్తి పోయింది.

జాతీయ కార్మికుల ఫెడరేషన్ పిలుపు మేరకు ఈ ప్రదర్శనలలో కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

దేశీయ వనరుల పరిరక్షణ ధ్యేయంతోనూ, సామ్రాజ్యవాద (అమెరికన్) వ్యతిరేక డిమాండ్లతోనూ పెరూ రైతులు జరిపిన ఈ దేశవ్యాపిత సమ్మె, యిదే విధంగా జాతీయ వనరులను ప్రైవేటీకరించే, అమెరికన్ సామ్రాజ్యవాదానికి మోకరిల్లే ప్రభుత్వాలూ పాలనా వ్యవస్థలు గల దేశాలలోని రైతాంగానికి, కార్మికులకు, ప్రజానీకానికి స్ఫూర్తిదాయకంగా వుంటుందన్నది నిస్సందేహం. ◈

సామాజిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న డెట్రాయిట్ నగర ప్రజలు

ప్రపంచ కార్ల ఉత్పత్తికి రాజధానిగా విలసిల్లిన అమెరికా దేశంలోని మిచిగాన్ రాష్ట్రంలోని డెట్రాయిట్ నగరంలోని ప్రజలు ప్రస్తుతం సామాజిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నారు

ఈ నగర జనాభాలో ప్రధాన భాగం ఆటో ఉత్పత్తి రంగంలో పనిచేసే నిపుణులైన పారిశ్రామిక కార్మికులు. డెట్రాయిట్ ప్రపంచ ప్రసిద్ధ ఆటో కంపెనీలు జనరల్ మోటార్సు, ఫోర్డు కంపెనీలకు జన్మస్థానం. ఈ నగరంలోని ఆటో ఉత్పత్తి కంపెనీలలో పనిచేసే కార్మికులు, రెండవ ప్రపంచ యుద్ధానంతర కాలంలో పలు వీరోచితమైన సమ్మెలు, పోరాటాలు జరిపి తమ వేతనాలలో గణనీయమైన పెంపుదలను, గణనీయమైన అనేక యితర సౌకర్యాలను సంపాదించుకొని, అమెరికన్ పారిశ్రామిక కార్మికులకు హక్కుల సాధనలో ఒక ఆదర్శవంతమైన శ్రేణి కార్మికులుగా ముందు నిలబడ్డవారు. జనరల్ మోటార్సు, ఫోర్డు, క్రిజ్లర్ కంపెనీ యాజమాన్యాలతో భీకరంగా పోరాడి యునైటెడ్ వర్కర్స్ యూనియన్ నాయకత్వాన పలు సౌకర్యాలను సాధించి, అమెరికాలోని పారిశ్రామిక కార్మికులకు ఒక పోరాట ధోరణికి మార్గదర్శకులుగా ఈ డెట్రాయిట్ నగర ఉత్పత్తి కార్మికులున్నారు.

అయితే చరిత్ర క్రమంలో, పెట్టుబడిదారీ విధానం పైచేయి సాధించి, ప్రపంచీకరణ విధానాల పేరిట పుంజుకొన్న నయా ఉదారవాద దోపిడీ పెట్టుబడిదారీ విధానాలు ఈ డెట్రాయిడ్ కార్మికులను తీవ్రమైన ఆర్థిక, సామాజిక సంక్షోభంలోకి నెట్టివేశాయి ఒకనాడు వీరోచిత పోరాటాలు సలిపిన డెట్రాయిట్ కార్మికులకు నాయకత్వం వహించిన యునైటెడ్ ఆటో వర్కర్స్ యూనియన్ నాయకత్వాన్ని ఆటో కంపెనీల యజమానులైన పారిశ్రామిక పెట్టుబడిదారీ విధానం మచ్చిక చేసుకొని, తనకు ఊడిగం చేసేటట్లు, పెట్టుబడిదారీ వర్గ ప్రయోజనాలకు యూనియన్ నాయకత్వం సహకరించేటట్లు మలచుకొంది కేవలం ఆర్థికవాద విధానాలపైనే ఆధారపడిన, వర్గ రాజకీయాలను కార్మిక సంఘ నిర్వహణకు ప్రాతిపదికగా చేసుకొనని యూనియన్ నాయకత్వం అనివార్యంగానే, కార్మికుల ప్రయోజనాలను యాజమాన్యాల ప్రయోజనాలకు లొంగబెట్టింది. పలితంగా ఈ ఆటోరంగంలోని ప్రధాన కంపెనీలు, వీటికి విడి సామాగ్రిని ఉత్పత్తి చేసిపెట్టే అనుబంధ కంపెనీలూ తమ సూపర్ లాభాల ఆర్జనకోసం, ఆ భారాన్నంతా ఆటో ఉత్పత్తి కార్మికులపైకి నెట్టాయి. పర్యవసానంగా డెట్రాయిట్ నగరంలో, పరిసరాల్లో, శివార్లలో 1,50,000 మంది ఉత్పత్తిరంగ కార్మికులు ఉద్యోగాల నుండి తొలగింపబడ్డారు. ఇటీవల ముగిసిన అమెరికన్ ఏక్సిల్ కంపెనీ సమ్మెతో కార్మికుల వేతనాలు గంటకు 28 డాలర్ల నుండి గంటకు 10 డాలర్లకు తగ్గించబడింది. ఇది అధికారిక దారిద్ర్యస్థాయి కన్నా తక్కువ వేతనంగా వుంది. అంతేకాక ఈ కార్మికులు గతంలో సాధించుకొన్న గ్రాట్యూటీ సదుపాయంలో కోతపెట్టబడింది. ఆరోగ్యబీమా-ఆరోగ్య సంరక్షణ పథకాలు కుదించబడటమో, రద్దుచేయటమో జరిగింది.

ఈ కారణాలరీత్యా, డెట్రాయిట్ నగరంలోని ప్రజానీకం దౌర్భాగ్యస్థితిలోకి నెట్టబడ్డారు. ఉద్యోగాలు కోల్పోయిన, కుటుంబ ఆర్థికస్థితులు దిగజారి పోయిన డెట్రాయిట్ ప్రజలు క్రమంగా ఆ పట్టణాన్ని వదిలిపెట్టి జీవనోపాధిని వెతుక్కుంటూ యితర ప్రాంతాలకు తరలిపోవటం జరిగింది. ఒకప్పుడు (సుభిక్షంగా వున్న రోజుల్లో) ఈ పట్టణంలోని జనాభా 20 లక్షల మంది కాగా, ప్రస్తుతం యిక్కడి జనాభా 9 లక్షలకు తరిగిపోయారు. ఏటా వేల మంది యిక్కడి నుండి తరలిపోతున్నారు. అమెరికా దేశపు జనాభా లెక్కల బ్యూరో వారి గణాంకాల ప్రకారం డెట్రాయిట్‌లో దరిద్రుల శాతం 31.4 శాతంగా వుంది. కార్ల ఉత్పత్తి కంపెనీలు ఈ పట్టణంలోని జనాభా యొక్క శ్రమను అధికాధికంగా దోపిడీచేసి, సూపర్ లాభాలను ఆర్జించుకొని, వారిని నిరుపేదలుగా కుదించివేయటం జరిగింది. ఈ రకంగా ఒకనాడు ఉన్నత జీవన ప్రమాణాలతో జీవించిన డెట్రాయిట్ ప్రజానీకం ఈనాడు దారిద్ర్యరేఖ దిగువకు నెట్టబడ్డారు.

ఈ పరిస్థితుల వలన ఈ నగరంలోని ప్రజానీకంలో అధిక శాతం మంది తమ యిండ్లపై తెచ్చుకున్న అప్పుల వాయిదాలు కట్టలేక యిండ్లను వదులుకోవాల్సిన పరిస్థితికి నెట్టబడ్డారు. తనఖాలో వున్న తమ యిండ్లను విడిపించుకోలేని వారి సంఖ్య డెట్రాయిట్ నగర జనాభాలో 5%కు చేరింది. అమెరికాలో దేశంలో అటువంటి వారి శాతం 1 మాత్రమే కాగా డెట్రాయిట్ నగరంలో వారి సంఖ్య 5 రెట్లకు పెరగటాన్నిబట్టి అక్కడి సంక్షోభాన్ని అంచనా వేసుకోవచ్చును.

మార్కెట్ నక్కమీద తాటిపండు పడ్డట్లు, యిక్కడి ప్రజల దుస్థితిని అనూహ్యస్థాయికి పెరిగిన ఆహారపు ధరలు, గ్యాసోలిన్ (ఇంధనం) ధరలు మరింతగా పెంచివేశాయి. ప్రజలు తమకు కడుపునింపే తిండిని కొనుక్కోవాలా? లేక ఉద్యోగాన్ని చేయటం ద్వారా పనిని కొనసాగించేందుకోసం గ్యాసోలిన్ (స్వంతకార్లకు ఇంధనం) కొనుక్కోవాలా? అన్నది తేల్చుకోవాల్సిన బలవంతపు స్థితికి నెట్టబడ్డారు తిండి కావాలంటే, స్వంత కారుకు గ్యాసోలిన్ లేక పనికి వెళ్ళటం కుదరక పనిని పోగొట్టుకోవాల్సి వుంటుంది. పని నిల్పుకోవటం కోసం గ్యాసోలిన్ కొనుక్కొంటే కడుపుకు తిండి వుండదు. ఇదీ వీరు నెట్టబడిన దుస్థితి.

ప్రభుత్వ బ్యూరో ఆఫ్ లేబర్ వారి గణాంకాల ప్రకారం రొట్టె ఖరీదు 16.3% పెరిగింది. కోడిగుడ్ల ధర 34.8% పెరిగింది. పాల ధర 23.1% పెరిగింది. పిండి (రొట్టెలు తదితర ఆహార పదార్థాలు తయారు చేసుకొనే గోధుమ పిండి) ధర 37% పెరిగింది.

ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం యిచ్చే ఆహారపు స్టాంపులు (రేషన్ కూపన్లలాంటివి-వీటి వలన తక్కువ ధరలకు రేషన్ షాపుల్లో ఆహారపదార్థాలు అమ్మబడతాయి) కోసం జనం ఎగబడుతున్నారు. మిచిగాన్ రాష్ట్రపు మానవ సేవల శాఖ రికార్డు ప్రకారం, ఆ రాష్ట్రంలోని 5,90,600 మంది కుటుంబాలకు చెందిన 12 లక్షల 60 వేల మంది వయోజనులూ, పిల్లలూ ప్రభుత్వం జారీ చేసిన ఆహారపు స్టాంపులను వినియోగించుకొంటున్నారు. వీరిలో 30% మంది అంటే 4 లక్షల 21 వేల మంది డెట్రాయిట్ నగరానికి చెందినవారే. "ఫ్రీ ప్రెస్" పత్రిక ప్రకారం 2003 నుండి యిప్పటి వరకూ ఆహార స్టాంపుల వినియోగం దాదాపు 53% మేరకు మిచిగాన్ రాష్ట్రంలో పెరిగింది. ప్రతి 8 మంది బాలల్లోనూ ఒకరు ఈ స్టాంపులు పొందేందుకు అర్హులుగా వున్నారు

పేద ప్రజలు ఆహారంకోసం ధార్మిక సంస్థలూ, ధర్మ సత్రాల వద్దకు వెళ్ళటం అన్నది గణనీయంగా పెరిగింది. గ్లీనర్స్ ఫుడ్ బ్యాంక్ అనబడే దాతృత్వ సంస్థ డెట్రాయిట్ నగరంలోని సాల్వేషన్ ఆర్మీ, కాపొచిన్ సూప్‌కిచెన్‌లాంటి 420 భాగస్వామ్య దాతృత్వ సంస్థల ద్వారా పంపిణీ చేస్తుంది గత ఒక్క సంవత్సరంలోనే ఈ సంస్థ 25 మిలియన్ల పౌండ్ల విలువైన ఆహారాన్ని పంచిపెట్టింది 40 టన్నుల ఆహారం పంచి పెట్టినా, యింకా అవసరాలకు చాలటంలేదని, గతంలో మాదిరిగా కాక యిప్పుడు తమకు విరాళాలిచ్చే వ్యక్తులు, కార్పొరేట్ విరాళాలూ గణనీయంగా తగ్గిపోతున్నాయనీ ఆ సంస్థ అధిపతి వెల్సు తెలియచేస్తున్నాడు

వైద్య ఖర్చులు, రవాణా ఖర్చులు, యితర అవసరాల ఖర్చులూ అనూహ్యంగా పెరిగిపోవటంతో పేదలుగా వున్న పని చేసే కార్మికులూ, కుటుంబ ఖర్చులు సరిపెట్టుకో సాధ్యంకాని సీనియర్ కార్మికులూ ఆహారపు అవసరాలు తీర్చుకోలేక, ఖర్చులు భరించలేక తమ సంస్థల వద్దకు వస్తున్నారని ఆయన తెలియచేస్తున్నారు. గతంలో ఐతే ఉద్యోగం కోల్పోయిన కార్మికుని కుటుంబంవారు తమ వద్దకు మొదటి రెండు, మూడు నెలల కాలంలో తిండికోసం వచ్చేవారని, తర్వాత వేరే పని చూసుకొని పోయేవారని, యిప్పుడు 3 నెలలు గడిచినా తమ వద్దనే తిండికోసం ఉండిపోతున్నారని ఆయన వెల్లడిస్తున్నాడు.

మిచిగాన్‌లోని హ్యూమన్ సర్వీసెస్ లీగ్‌కు చెందిన కిడ్స్ కౌంట్ ప్రోగ్రాంకు చెందిన డైరెక్టరు ప్రకారం 2005లో డెట్రాయిట్‌నగరంలోని 45% మంది పిల్లలు ప్రభుత్వం యొక్క ఆహార మద్దతు పథకంపై ఆధారపడి వుండేవారనీ, అది 2006 కల్లా 54%గా పెరిగిందనీ 2008 వచ్చేనాటికి వారి సంఖ్య 72% మేరకు పెరిగిందనీ తెలియచేస్తున్నారు.

డెట్రాయిట్‌లోని కాపుచిన్ సూప్‌కిచెన్ (ఉచిత గంజి కేంద్రం) నిర్వాహకులైన బ్రదర్ జెర్రీస్మిత్ ప్రతీ నెలా తిండిని సంపాదించుకోలేని, అమర్చుకోలేని కార్మికులు తమ కేథలిక్ ధర్మ సంస్థలకు ఉచిత ఆహారంకోసం వస్తున్నారనీ, వీరిలో పలువురు ప్రభుత్వ ఆహార స్టాంపులను, ప్రభుత్వ సహాయాన్నీ పొందుతున్న వారేననీ, అయినా వీరికి సరిపడే తిండి దొరకక తమ వద్దకు వస్తున్నారనీ, అటువంటి వీరికి నెలకు ఒకసారి మాత్రం మేము ఆహారం యిస్తున్నామనీ తెల్పుతున్నారు. అంతేకాక ఉచిత దుస్తుల పంపిణీకోసం అనేక మంది తమను ఆశ్రయిస్తున్నారనీ, గతంలో తమ గోడౌన్ల నిండా తీసుకొనే వారు లేక దుస్తులు గుట్టలుపడి మూల్గుతూ వుండేవని, యిప్పుడు గోడౌన్లు ఖాళీ అయ్యాయనీ, గతంలో మాదిరి దాతలు తమకు బట్టలు డొనేట్ చేయటం లేదనీ, వారు కూడా గతంలోకన్నా ఎక్కువ కాలంపాటు తమ దుస్తులను వాడుకొంటున్నారనీ, అందువలన దుస్తుల సరఫరా తగ్గిపోయిందనీ తెలియచేస్తున్నారు.

పెరిగిన ఈ పేదరికం వల్ల డెట్రాయిట్ నగరంలో పిల్లలకు చదువు చెప్పించటం కూడా తగ్గిపోయింది. అనేక స్కూళ్ళు మూతబడ్డాయి. టీచర్లకు పనిభారం పెంచి, తక్కువ జీతంతో, తగు పరికరాలు, ఏర్పాట్లూ లేకుండా మిగిలిన స్కూళ్ళు నిర్వహింపబడుతున్నాయి. ఇటీవల విద్యాశాఖ వేసిన అంచనాల ప్రకారం, డెట్రాయిట్‌లో గల పబ్లిక్ హైస్కూళ్ళలోకి చేరే విద్యార్థుల సంఖ్య 75% మేరకు పడిపోయింది. "డెట్రాయిట్ ఫ్రీ ప్రెస్" పత్రిక తన జూన్ 1వ తేదీ సంచికలో ఈ సంక్షోభాన్ని గురించి వ్యాఖ్యానిస్తూ దీని "విద్యా మారణ హోమంగా" అభివర్ణించింది.

ప్రభుత్వం యిచ్చే ఆహార స్టాంపులకు ఆహారాన్ని యివ్వటానికి డెట్రాయిట్ నగరంలోని పెట్రోలు బంకుల్లో గల షాపులు, బ్రాందీ షాపులవారు, రోడ్డు ప్రక్కన పెట్టే చిన్న చిన్న షాపులవారు మాత్రమే ముందుకొస్తున్నారు. వీరు చౌకబారు ప్యాక్ చేసిన, నాణ్యతలేని ఆహారాన్ని ఆ స్టాంపులకు యిస్తున్నారు. అందువలన పేద ప్రజలు రక్తపుపోటు, గుండె జబ్బులు, చక్కెర వ్యాధిలాంటి జబ్బులవాత పడుతున్నారు.

దుర్భర దారిద్ర్య పలితంగా డెట్రాయిట్‌లోని పేద ప్రజలు మాదకద్రవ్యాలకు అలవాటుపడటంవంటి దుర్వ్యసనాలకు గురయి చెరసాలల పాలవుతున్నారు

సిటీజన్స్ రిసెర్చి కౌన్సిల్ ఆఫ్ మిచిగాన్ అనే సంస్థ జూన్ 11న విడుదల చేసిన ఒక రిపోర్టు ప్రకారం, మిచిగాన్ రాష్ట్రపు జైళ్ళలో 50 వేల మంది ఖైదీలున్నారు జైళ్ళ నిర్వహణకోసం మిచిగాన్ రాష్ట్ర బడ్జెట్టు మొత్తంలో 5వ వంతు ఖర్చుపెట్టబడుతోంది రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల్లో 3వ వంతు మంది జైలు సిబ్బందే

ఒక గ్యాలన్ గ్యాసోలిన్ ధర హఠాత్తుగా 3.65 డాలర్ల నుండి కొద్ది వారాల్లోనే 6 డాలర్లకు పెరిగిపోయింది యింకా పెరుగుతోంది అందువలన గ్యాసోలిన్ కొనుక్కోలేక ఉద్యోగస్తులందరూ ప్రజారవాణా వ్యవస్థను ఆశ్రయిస్తున్నారు. డెట్రాయిట్ నగరంలోని స్మార్ట్ బస్సు రవాణా సంస్థకు రోజూ 44,000 మంది ప్యాసింజర్లు పెరిగారు. డెట్రాయిట్ ట్రాన్స్‌పోర్టేషన్ శాఖ సర్వీసులకు రోజుకు 10,000 మంది ప్యాసింజర్లు పెరిగారు.

గతంలో ఒక పథకం ప్రకారం జనరల్ మోటార్ కంపెనీ ప్రభుత్వం యొక్క ప్రజా రవాణా వ్యవస్థను అభివృద్ధి పరచకుండా నిరోధించింది. అంతేకాక ప్రజా రైలు వ్యవస్థను మూయింపచేసింది. తద్వారా తాను ఉత్పత్తిచేసే కార్లను కార్మికులు కొనుక్కోవాల్సిన తప్పనిసరి పరిస్థితులను కల్పించింది.

1949లో జనరల్ మోటార్సు, ఫైర్ స్టోన్ టైర్, కాలిఫోర్నియాకు చెందిన స్టాండర్డు ఆయిల్ కంపెనీలు ఎలక్ట్రిక్ రైళ్ళ మార్గాలలో గ్యాసోలిన్, డీసెల్‌తో నడుపబడే బస్సులను పెట్టించేందుకు, ఆ రకంగా ప్రజలను తమ కార్లు కొనుగోలు చేయటం కోసం బలవంతమైన పరిస్థితులు సృష్టించేందుకూ కుట్రలు పన్నుతున్నాయని ఒక ఫెడరల్ న్యాయస్థానం వ్యాఖ్యానించింది. నేటికీ ఆ కంపెనీలు అనుసరించిన ఆ విధానం అమలుజరపటం వల్లనే, నేడు ప్రజావసరాల మేరకు డెట్రాయిట్‌లో ప్రజా రవాణా వ్యవస్థను అందుబాటులోకి తేవటం సాధ్యం కావటల్లేదు.

ఈ రకంగా డెట్రాయిట్‌లోని కార్మిక ప్రజానీకం ఆర్థిక, సామాజిక సంక్షోభపు కోరల్లో చిక్కుకొని అలమటిస్తున్నారు. తమను బలవంతంగా యిటువంటి దుస్థితికి నెట్టిన అమెరికన్ పెట్టుబడిదారీ వ్యవస్థను రద్దు చేయకుండా, తమను, తమతోపాటు గల యితర మధ్యతరగతి ప్రజానీకాన్ని రక్షించుకోవటం సాధ్యంకాదన్న వాస్తవాన్ని డెట్రాయిట్ కార్మికవర్గం అర్థం చేసుకొని గ్రహించగల్గాలి. వర్గ పోరాట ప్రాతిపదికపై తమను ఏలుతున్న దోపిడీ పెట్టుబడిదారీ వ్యవస్థను ధ్వంసం చేయటాన్ని తమ కర్తవ్యంగా ఎంచుకొని, ఆ కర్తవ్య నిర్వహణకు పూనుకోవాలి. అలా జరగనంతకాలం అమెరికన్ కార్మికులూ, ప్రజలూ దోపిడీ పెట్టుబడిదారీ వ్యవస్థ సృష్టించిన ఈ సంక్షోభాల విషవలయంలో కొట్టుమిట్టాడుతూనే వుంటారు. ◈

పురుగుమందుల విషప్రభావానికి గురై దీర్ఘకాలిక వ్యాధుల వాతబడుతున్న వ్యవసాయ కూలీలు

మొదటి హరితవిప్లవం అనబడే దాని పుణ్యమా అని, దేశంలోని రైతాంగాన్ని రసాయనిక ఎరువులు వాడటం అన్న విషచక్రానికి గురిచేశారు పాలకులు. ఈ రసాయినిక ఎరువులతోబాటే, విషపూరితమయిన పురుగుల మందుల వాడకం అన్నది కూడా విపరీతంగా పెంచబడింది. నాటి 'మొదటి హరితవిప్లవం' నేటి 'ప్రపంచీకరణలు' సామ్రాజ్యవాద బడా విదేశీ కంపెనీలు-ప్రత్యేకించి అమెరికన్ కంపెనీలు- తమ రసాయినిక ఎరువుల ఉత్పత్తులనూ, పురుగుమందులనూ అమ్ముకొని సూపర్ లాభాలను గడించుకోవటానికి గ్యారంటీ కల్పించబడింది. పోతే దేశంలోని రైతాంగం గిట్టుబాటు ధరలు లభించక, వ్యవసాయకూలీలు దీర్ఘకాలిక వ్యాధుల వాతబడి మట్టిగొట్టుకుపోవటమన్నది నిబద్ధం చేయబడింది.

తమిళనాడు రాష్ట్రంలోని, తిరునల్వేలి జిల్లాలోని శంకరన్ కోయిల్ అనే చిన్నటౌన్‌లో నివసిస్తున్న అనేక మంది వ్యవసాయ కూలీలు కేన్సర్, కంతులు, జన్యు పరమైన వ్యాధులు, దృష్టిలోప వ్యాధులూ, నపుంసకత్వం లాంటి నయంకాని మహమ్మారి రోగాలతో బాధపడుతున్నారు. 20-30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన యువకులైన ఈ వ్యవసాయకూలీలు బలహీనంగానూ, అరవయ్యేళ్ల వయస్సుకు చేరుకొన్న వృద్ధులుగానూ కనబడుతున్నారు.

శంకరన్ కోయిల్ పట్టణంలోని పి.ఎం.టి. కాలేజికి చెందిన రీసెర్చి విద్యార్థి తదితరులు ప్రొఫెసర్ ఎ.జె.ఎ.రంజిత్‌సింగ్ బయోటెక్నాలజిస్టు ఆధ్వర్యాన 'రైతాంగంపై పురుగుల మందుల ప్రభావం' అన్న అంశంపై పరిశోధనలను జరిపారు.

ఈ పరిశోధనా క్రమంలో దీర్ఘకాలిక మహమ్మారి రోగాల పాలబడుతున్న ఈ వ్యవసాయ కార్మికులను వీరు పరీక్షించారు. 2-4 -డి, ఫా స్ఫమిదాన్, సెలిన్, కార్బామిల్‌లాంటి విషపూరిత ఆర్గనోఫాస్పేటు పురుగు మందుల వల్లనే ఈ వ్యవసాయ కూలీలందరూ యిటువంటి మొండిజబ్బుల బారినపడుతున్నారని నిర్ధయించారు. కేవలం ఈ వ్యవసాయ కూలీలు మాత్రమేకాక, ఈ పురుగుమందుల విష ప్రభావ ఫలితంగా వచ్చిన దీర్ఘకాలిక వ్యాధులు, తరువాత తరాల వారికి (వీరి బిడ్డలకు, మనుమలకు) సంక్రమిస్తాయని శాస్త్రజ్ఞులు తెలుపుతున్నారు.

వ్యవసాయకూలీలు అవిద్యావంతులైన కారణంగా, పురుగుమందులు స్ప్రే చేసే సందర్భంగా వీరు చేతికి గ్లౌజులు ధరించరనీ, కళ్ళకు కళ్ళజోళ్లు ధరించరనీ, వీరికి పురుగుమందుల విష ప్రభావ ప్రమాదం గురించి తెలియదనీ, అందువలన రోజుకు 100 ట్యాంకుల విషపూరిత పురుగుమందును పొలాల్లో స్ప్రేచేసే ఈ వ్యవసాయ కార్మికులు ఈ ఆర్గనో ఫాస్పేటు పురుగు మందుల విష ప్రభావానికి గురవుతున్నారనీ, వీరి రక్తకణాల డి.ఎన్.ఎ. నిర్మాణంలోకి ఈ పురుగుమందుల విషంచేరి ఆ కణాలను విధ్వంసం చేస్తోందనీ, అందువల్లనే వీరందరూ ఈ విషప్రభావానికి గురై జబ్బుల పాలవుతున్నారని పరిశోధన జరిపిన శాస్త్రవేత్తలు తెలియచేస్తున్నారు.

ఈ రకంగా వ్యవసాయకూలీలు పురుగుమందుల విషప్రభావ ఫలితంగా జబ్బులవాతపడటమన్నది కేవలం తమిళనాడులోని ఒక టౌనుకు సంబంధించిన సమస్య మాత్రమే కాదు. దేశమంతటా, అన్ని ప్రాంతాల్లోనూ పురుగుమందును స్ప్రే చేసే పనిలో నియమింపబడుతున్న వ్యవసాయ కార్మికులందరూ యిదే దుర్గతికి గురిచేయబడుతున్నారు.

'సస్యరక్షణ' నినాదంతో తమ పురుగుల మందుల అమ్మకాలను ముమ్మరంచేసి, సూపర్ లాభాలను దండుకొంటున్న విదేశీ-స్వదేశీ బడా కార్పొరేట్ పురుగుమందుల కంపెనీలు స్లోపాయిజనింగ్ ద్వారా వ్యవసాయ కూలీల భక్షణకు పూనుకొన్నాయన్నదే నేటి సామాజిక వాస్తవంగా మన ముందుంది.

ఈ వ్యవసాయకూలీల సంక్షేమాన్ని ప్రభుత్వాలు పట్టించుకోకపోవటంతో వీరి స్థితి "ఎవరికి పుట్టిన బిడ్డరా! వెక్కి వెక్కి ఏడుస్తోంది!" అన్న చందంగా వుంది.

వ్యవసాయకూలీలే సంఘటితపడి, తమ సంక్షేమం, తమ ఆరోగ్య సంరక్షణకు తామే పూనుకోకతప్పని అవసరాన్ని నేటి ఈ పరిస్థితులు కల్పిస్తున్నాయి. ◈

ఉపాధి హామీ పథకం—కూలీలకు మొక్కుబడిగానే ఒక అంకెల గారడీ పథకం

కాంగ్రెసు పార్టీ నాయకత్వాన దేశ పరిపాలనను సాగిస్తున్న యుపిఎ ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని గ్రామీణ పేదలనుద్ధరించటంకోసం తాను చేపట్టి అమలుజరుపుతున్న ఒక మహత్తర పథకంగా ఘనంగా ప్రచారం సాగించుకొంటోంది. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శిగా యిటీవలి కాలంలో ఎంచుకోబడిన యువ నాయకుడు రాహుల్‌గాంధీ ఈ పథకంపట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు ప్రచారం కావించుకొంటూ, తన ప్రమేయం వల్ల ఈ పథకం దేశంలోని అన్ని జిల్లాలోనూ ఏప్రిల్ 1, 2008 నుండి అమలుజరుపబడుతున్నట్లు ప్రత్యేకంగా ప్రచారం కావించుకొంటున్న వైనాన్ని మనం చూస్తున్నాం. యు.పి.ఎ. ప్రభుత్వానికి బయట నుండి మద్దతునిస్తున్న 'వామపక్ష' పార్టీలు సహితం ఈ పథకం తమ వల్లనే చేపట్టబడటం జరిగిందని ప్రచారం కావించు కొంటున్నాయి. ఈ పథకాన్ని ఆదర్శవంతంగా అమలు జరుపుతున్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పాలకులు అభివర్ణిస్తున్నారు. కాంగ్రెసు పార్టీ ప్రతిష్టాకరమైన పథకంగా ప్రచారం కావించుకొంటున్న ఈ ఉపాధి హామీ పథకం 3వ దశలో భాగంగా ఏప్రిల్ 1, 2008 నుండి ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా, విశాఖపట్నం, పశ్చిమగోదావరి జిల్లాల్లో అమలుజరుపబడుతోంది. ఈ పథకం కృష్ణాజిల్లాలోని చందర్లపాడు, నందిగామ మండలాల్లో అమలయిన తీరుతెన్నులను రైతుకూలీ సంఘం (ఆం.ప్ర), కృష్ణాజిల్లా కార్యకర్తలు పరిశీలించటం జరిగింది. వారు పరిశీలనలో గమనించిన వివిధ అంశాలను యిక్కడ పొందుపరచటం జరిగింది. ఈ వివరాల ఆధారంతో జాతీయ గ్రామీణ ఉపాధి పథకం యొక్క వాస్తవ స్వరూప, స్వభావాలను అర్థం చేసుకోవటానికి వీలవుతుంది. - సంపాదకుడు.

నందిగామ, చందర్లపాడు ప్రాంతంలో 60% భూముల్లో రైతులు యితర పంటలు గిట్టుబాటు కాకపోవటంతో సుబాబుల్‌ను సాగు చేస్తున్నారు. ఫలితంగా ఆ మేరకు గ్రామాలలో వ్యవసాయ కూలీలకు పనులు దొరకటల్లేదు. అందువలన వారు తమకు గ్యారంటీ పనికోసమని దూర ప్రాంతాలకు వలస పోతున్నారు.

పనులు లేనందువలన గ్రామీణ పేదలు వలసకులకు పోవాల్సిన దుస్థితిని అరికట్టేందుకోసం ఉద్దేశింపబడిందని చెప్పబడే ఉపాధి హామీ పథకం వీరిని ఆదుకోవటంలో కనీసంగా కూడా సఫలంకాలేదనీ, అది కేవలం ప్రచారంగానే మిగిలిపోయిందనీ, ఈ మండలాల్లో ఈ పథకం అమలు జరుపబడిన తీరు ద్వారా వెల్లడవుతోంది.

ఈ పథకం ద్వారా రోజుకు 100/- రు. వేతనం కల్పింపబడుతుందని చేయబడుతున్న ప్రభుత్వ ప్రచారాన్ని నమ్మి చాలా మంది గ్రామంలోనే ఉండి పని చేసుకోవచ్చు కదా అని ఆశ పడ్డారు.

నందిగామ మండలంలోని 24 గ్రామ పంచయితీల లోనూ, మొత్తం 9 వేల 411 కుటుంబాల వారికి ఈ పథకం యొక్క జాబ్‌కార్డులు జారీచేయటం జరిగింది. ఇచ్చిన జాబ్ కార్డులన్నింటా కలిపి 20,528 మంది వయోజనులైన కూలీలు తమకు పని చూపెట్టమని నమోదు చేసుకోవటం జరిగింది.

ఈ పథకం క్రింద ఈ మండలం మొత్తం మీద (అన్ని గ్రామాలలో) 114 పనులను శాంక్షను చేయటం జరిగింది. ఈ పనుల విలువను 77 లక్షల 45 వేల 716 రూపాయలుగా అంచనావేసి ఆ మేరకు శాంక్షను యివ్వటం కూడా జరిగింది.

అదే విధంగా చందర్లపాడు మండలంలో గల 18 గ్రామ పంచాయితీల్లోనూ, 10 వేల 385 జాబ్‌కార్డులు జారీ చేయటం జరిగింది. జారీ చేయబడ్డ ఈ కార్డులన్నింటా కలిపి 22 వేల 806 మంది వయోజనులు తమకు పని చూపాల్సిందిగా నమోదు చేసుకొన్నారు.

ఈ పథకం క్రింద ఈ మండలం మొత్తం మీద 198 పనులను శాంక్షను చేయటం జరిగింది. ఈ పనుల విలువ మొత్తంగా ఒక కోటి, 32 లక్షల, 126 వేల రూపాయలుగా నిర్ణయించటం జరిగింది.

ఈ పథకం ప్రకారం శాంక్షను చేయబడిన పనుల్లో కొన్ని నందిగామ మండలంలో ఏప్రిల్ 1, 2008 నుండి 27.06.2008 వరకూ చేపట్టబడగా, చందర్లపాడు మండలంలో ఏప్రిల్ 1, 2008 నుండి 7.7.2008 వరకూ చేపట్టబడ్డాయి. అంటే యించుమించుగా ఈ రెండు మండలాల్లోనూ 3 నెలలపాటు (ఏప్రిల్, మే, జూన్) జాతీయ గ్రామీణ ఉపాధి పథకం పనులు చేపట్టబడ్డాయి.

ఈ ప్రకారం చూస్తే, ఒక సంవత్సర కాలం మొత్తంలో పనికోసం నమోదు చేసుకొన్న ప్రతి వ్యక్తికీ 100 రోజుల పని కల్పించబడాలి కనుక, జరిగిన 3 నెలల కాలంలోనూ సగటున 33 రోజుల పని కల్పించబడాల్సి ఉంది. అదే విధంగా ప్రతీ వ్యక్తికీ రోజుకు 80/- రూపాయల చొప్పున కనీస వేతనంగా 33 రోజులకూ కలిసి 2640/- రూపాయలు వేతనంగా ముట్టాలి.

నందిగామ మండలంలోని 20,528 మందికీ 33 రోజులకుగాను 5 కోట్ల 41 లక్షల 93 వేల, 920 రూపాయలు ముట్టచెప్పబడాలి. అదే విధంగా చందర్లపాడు మండలంలోని 22,806 మందికీ కలిపి మొత్తంగా 6 కోట్ల 2 లక్షల 7 వేల 840 రూపాయలు వేతనంగా ముట్టచెప్పబడాలి.

అయితే ఆచరణలో వాస్తవాలను పరిశీలిస్తే ఈ పథకం యొక్క డొల్లతనం బయటపడుతుంది. ఈ పథకం యొక్క విశిష్టతను గురించి పాలకులు చేసే ప్రచారం ఎంత బూటకమయినదో అర్ధమవుతుంది.

ప్రభుత్వం ఈ మండలాల్లో ఈ పథకపు అమలును ప్రారంభించే నాటికే యిక్కడి గ్రామాల్లోని ప్రజలు మిర్చికోత పనులు, ఇటుక రాయి తయారీ పనులు, పట్టణాల్లో తాపీ పనులకోసం యితర ప్రాంతాలకు వలసలకు వెళ్ళారు. అయినా తమ గ్రామాల్లోనే పని చేసుకోవచ్చుననే ఆశతో, పనిని కల్పించమని తమను తాము నమోదు చేయించుకొని జాబ్ కార్డులను పొందటం జరిగింది.

పనికోరిన వారిలో కనీసం 15 శాతం మందికైనా లభించని ఉపాధి:

నందిగామ మండలంలో 9,411 మంది కుటుంబాలు పనికోసం నమోదు చేసుకొని, జాబ్‌కార్డులు పొందగా వీరిలో కేవలం 1025 కుటుంబాల వారికే పనిని కల్పించటం జరిగింది. అంటే 11% లోపు కుటుంబాల వారికే పని కల్పింపబడింది. మొత్తం 20,528 మందికి పని కల్పించబడాల్సి వుండగా కేవలం 2,566 మందికే పని కల్పించబడింది. పోనీ వీరికైనా పూర్తిగా 33 రోజులు (3 నెలలుకుగాను) పని దొరికిందా? అంటే అదీ లేదు. కేవలం సగటున ఒక్కో కుటుంబానికి (కనీసం ముగ్గురు సభ్యులైనా వుంటారు) 5.91 రోజులు అంటే మనిషికి రెండు రోజుల లోపే పని కల్పింపబడింది.

ఇదే విధంగా చందర్లపాడు మండలంలో 10,385 కుటుంబాలకు చెందిన 22,806 మంది పని కల్పించాలని కోరగా, వీరిలో కేవలం 1851 కుటుంబాల వారికి మొత్తం 4,735 మందికి మాత్రమే పని కల్పింపబడింది. వీరికి లభించాల్సిన 33 రోజుల పనికిగాను కేవలం సగటున కుటుంబానికి 9 రోజులు పని మాత్రమే అంటే ఒక్కొక్కరికి 3 రోజులు మాత్రమే పని లభించింది.

ప్రకటించిన కనీస వేతనం కూడా ముట్టచెప్పని పథకం:

నందిగామ మండలంలో అమలుజరపబడిన ఈ పథకం క్రింద పని చేసిన ఒక్కో కూలికి రోజుకు సగటున 76.98 రూపాయలు కూలీ ముట్టినట్లుగా, ఆ పథకాన్ని అమలుజరుపటానికి నియమించబడ్డ అదనపు ప్రోగ్రాం అధికారి తయారు చేసిన లెఖ్ఖలు తెలియచేస్తున్నాయి. చందర్లపాడు మండలంలో అయితే ఒక్కో కూలికి రోజుకు సగటున 72.14 రూపాయలు మాత్రమే కూలిగా ముట్టినట్లు అధికారిక లెఖ్ఖలు తెలియచేస్తున్నాయి. ఈ రకంగా ప్రభుత్వం ప్రకటించిన మేరకైనా పనిచేసిన కూలీలకు రోజుకు 80/- రూపాయల కనీస వేతనం లభించలేదు.

ఈ పథకాన్ని ప్రారంభిస్తూ, ప్రజాప్రతినిధులు అనేక గ్రామాల్లో 'రోజకు 4-5 గంటలు పనిచేస్తే చాలు ఆడా, మగా తేడా లేకుండా అందరికీ రోజుకు 100/- రూపాయల వేతనం యిస్తారు, ఈ సదవకాశాన్ని వినియోగించుకోండి' అంటూ ఎంతో అట్టహాసంగా చెప్పారు. వీరి మాటలను నమ్మిన ముప్పాళ్ళ గ్రామంలో అప్పటి వరకూ మిర్చి పంట కోతకు వెళ్తున్న 200 మంది కూలీలు ఎక్కువ కూలి వస్తుందన్న ఆశతో మిర్చికోత పనులు మాని 2 రోజులపాటు ఉపాధి హామీ పనులకు వెళ్ళారు. 3వ రోజున కూలియిమ్మని అడిగితే వారు చేసిన పనులను కొలత కొలిచి కూలీ యిస్తామని చెప్పి మట్టి పనిచేసిన వారికి రోజుకు 40/- రూపాయలను మించిన కూలి రాదని అధికారులు లెక్కలు తేల్చారు. అదే విధంగా రోడ్డుప్రక్కనున్న కంప చెట్లు నరికినందుకు మీటరుకు 1.50 రూ. చొప్పున కూలీ లెఖ్ఖలు గట్టారు. దీనితో ఆగ్రహం చెందిన శ్రామికులు 300 మందికిపైగా రోడ్డుపై బైరాయించి ఆందోళన జరిపారు. అయినా అధికారులు తాము ముందుగా నిర్ణయించిన ప్రకారమే కూలి చెల్లించటం జరుగుతుంది అని తేల్చి చెప్పటంతో, యిక ఆ పనులకు ఎ వరూ వెళ్ళక అక్కడితో ఆపివేయబడ్డాయి.

పొక్కునూరు గ్రామంలో చేసిన పనులకుగాను కూలీలకు వేతనాలు చెల్లింపబడలేదు. నిధులు విడుదల కాలేదు అని కారణంతో వారికి చేసిన పనికి కూలీని చెల్లించటం జరగలేదు. దీనితో కూలీలు ఆగ్రహిస్తే, అసలు పనులనే రద్దుచేయటం జరిగింది. దాంతో ఆ గ్రామంలోని కూలీలు, పనులు వెతుక్కుంటూ వలసలకు పోయారు.

మరోవైపు పనులకు శాంక్షను వున్నా, యీ పథకం క్రింద నందిగామ మండలంలోని అనసాగరం, హనుమంతుపాలెం సత్యవరం, చెరవుకొమ్మపాలెం, కొత్తబెల్లం గ్రామాలలో పనులనే చేపట్టలేదు. అదే విధంగా చందర్లపాడు మండలంలో గుడిమెట్ల, పోవూరు, ఈటూరు, చందర్లపాడు గ్రామాల్లో పనులను చేబట్టలేదు. చందర్లపాడు మండలం మొత్తంగా 194 పనులు శాంక్షను అయితే, వాటిలో కేవలం 48 పనులనే చేపట్టడం జరిగింది.

వేతనాల చెల్లింపుల్లో మోసం:

గ్రామాల్లో 1 చదరపు గజం మట్టి పనికి 50/- రూపాయలు కూలి యిస్తారు. కానీ ఈ పథకపు గైడ్‌లైన్స్‌లో నిర్దిష్టమయిన కొలతలు లేకపోయినా, 7 మీటర్ల పొడవు, 1 మీటరు వెడల్పు, 1/2 మీటరు లోతు కొలతలో అంటే 3 1/2 క్యూబిక్ మీటర్ల మట్టి పని కొలతలుగా నిర్ణయించి పని చేయించుకొంటున్నారు. ఈ కొలతల ప్రకారం కూలీలకు కూలి గిట్టదు. చేసిన పనికి కొలతలు వెంటనేకాక, రెండు, మూడు రోజుల తర్వాత తీసుకొని, తమ యిష్టారాజ్యంగా అధికారులు నమోదు చేస్తున్నారు.

ఇక వేతనాల చెల్లింపు కోసమని కూలీలు ఒక్కొక్కరి చేతా 50/- రూపాయలు వెచ్చింపచేసి పోస్టాఫీసుల్లో పాస్ బుక్కులు తీయించినా, వేతనాన్ని పోస్టాఫీసు ద్వారా కాక "వెలుగు" గ్రూపు లీడర్ల ద్వారా చెల్లింపులు చేయిస్తున్నారు. పొక్కునూరు గ్రామంలో ఒక్కొక్క కూలీకి రోజుకు 82/- రూపాయలు కూలి చెల్లించినట్లు ఎక్విటెన్సు ఫారాల మీద వేలిముద్రలు వేయించుకొని వారికి 75/- రూపాయలనే చేతిలో పెడ్తున్నారు. జూన్ నెలలోని 2వ వారంలో కూలీలకు చెల్లించాల్సిన దినసరి కూలిని 69/- రూపాయలుగానే లెఖ్ఖగట్టారు. కూలీలు ఆందోళన జరిపితే మరో 12/6 రూపాయలు పెంచి కలిపి యిస్తామని చెప్పినా, నిధులు లేవనే సాకుతో ఆ మొత్తాన్ని కూలీలకు చెల్లించలేదు.

పొక్కునూరు గ్రామంలోనే పనిచేయకపోయినా ఎక్కువమంది పని చేసినట్లు ఎక్విటెన్సు రిజిస్టర్లలో నమోదుచేసి, ఆ మేరకు వారికి కూలీ చెల్లించినట్లు చూపించి ఆ మొత్తాలను అధికారులూ, పెత్తందార్లు కలిసి స్వాహా చేస్తున్నారు. ఒక గ్రామంలో 35 మంది మాత్రమే పనిచేయగా 40 మంది పనిచేసినట్లు చూపించి (5గురు అగ్రకులాల మహిళలపేర్లు రిజిస్టరులోరాసి) 5 గురి కూలిని 3 రోజులకు స్వాహా చేసిన ఉదంతం బయట పడింది.

ఈ రకంగా ఈ పథకం అమలు వలన అవసరమున్నా గ్రామీణ పేదలందరికీ పనులు కల్పింప బడలేదు. పని యిచ్చిన వారికి కూడా గ్యారంటీ యిచ్చిన రోజుల మేరకు పని చెల్లింపబడలేదు. వాగ్దానం చేసిన కనీస వేతనం కూడా చెల్లింపబడలేదు. ఫలితంగా ఈ గ్రామీణ పేదలు పనులు వెతుక్కుంటూ యితర ప్రాంతాలకు వలసలకు పోక తప్పలేదు. కాకపోతే ఈ పథకం పేరిట నిధులు కైంకర్యం చేయటానికి స్థానిక పెత్తందార్లకూ-అధికారులకూ అవకాశం చిక్కింది.

పథకపు నిర్వహణా ఖర్చుల క్రిందా, పనిముట్లు తదితర అవసరాల క్రిందా, నిపుణులైన కూలీలకు చెల్లించిన వేతనాల క్రిందా భారీ మొత్తాలను గ్రామ పెత్తందార్లు -అధికారులు స్వాహా చేయటానికి అవకాశం కుదిరింది.

చందర్లపాడు మండలంలో 2, 3 నెలల కాలంగానూ చేపట్టిన పనులకు మొత్తంగా గ్రామీణ కూలీలకు వేతనంగా 12 లక్షల 31 వేల 420 రూపాయలు చెల్లిస్తే, నిర్వహణా ఖర్చులూ, పనిముట్లు తదితరమైన వాటికీ, నిపుణులైన కార్మికులకూ కలిపి ఒక లక్షా, 87 వేల, 211 రూపాయలను వెచ్చించినట్లు రికార్డులు తెలియచేస్తున్నాయి. అదే నందిగామ మండలంలో అయితే గ్రామీణ కూలీలకు 4 లక్షల 66 వేల 630 రూపాయలు కూలీగా చెల్లిస్తే, యితర ఖర్చులు 2 లక్షల 13 వేల, 410 రూపాయలు ఖర్చుపెట్టినట్లు రికార్డులు తెలియచేస్తున్నాయి. అంటే నందిగామ మండలంలో కూలీలకు చెల్లించిన కూలి (17,070 రోజుల కూలి) మొత్తంలో, సగం మొత్తం ఈ నిర్వహణా ఖర్చులకు వెచ్చించటం జరిగిందన్నమాట. ఈ రకంగా నిర్వహణా ఖర్చులు పేరిట, గ్రామీణ పేదలకు కూలీగా చెల్లించాల్సిన మొత్తాల నుండి నిధులు కాజేయబడుతున్నాయి.

ఈ పథకం అమలుతీరు యింత ఘోరంగా వున్నా, ఈ పథకం అమలుకు అవినీతి చోదకశక్తిగా వుందన్న విషయం పదే పదే వెల్లడి అవుతున్నా, దేశంలోని కొందరు మేధావులు, సామాజిక కార్యకర్తలూ అసలు ఏమీ లేకుండా వున్నదానికన్నా, ఏదో ఒక రూపంలో యీ పథకం గ్రామీణ పేదలకు ఆసరాగా వుంది కదా! ఆ మేరకు అది మేలైన విషయమే కదా! అంటూ వాదిస్తున్నారు. దోపిడీ రాజకీయ, ఆర్థిక, సామాజిక వ్యవస్థ పరిధిలోనే గ్రామీణ పేదల సమస్యకు పరిష్కారం వెదికే వారికి యిది మంచి పథకంగా గోచరించటం అన్నది స్వాభావికమైన విషయమే.

పోనీ ఆ మేరకే ఆలోటుపాట్లతోనే ఈ పథకాన్ని యిప్పుడు మన రాష్ట్రంలో అమలుజరుపుతున్నారా? అంటే అదీ లేదు. "వ్యవసాయ పనుల కాలం యిది. ఈ పథకం .పనుల వలన కూలీలందరూ వ్యవసాయ పనులకు వెళ్ళటం మానేస్తున్నారు. అందువలన రైతులు యిబ్బంది పడుతున్నారు. అందువలన రైతుల అభ్యర్ధన మేరకు ఈ పథకం అమలును ఆపివేయాల్సిందిగా" ముఖ్యమంత్రి ఆజ్ఞను జారీ చేసిన ఫలితంగా ఈ పథకం అమలు ఆపబడింది. ఆ రకంగా రైతుల మేలు కోసం ఈ పథకం అమలును ఆపినట్టు ప్రచారం కావింప బడుతోంది.

కానీ వాస్తవమేమిటంటే ఈ పథకానికి కేంద్రం యిచ్చిన నిధులలో 500 కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం, యితర పథకాలైన ఇందిరమ్మ యిళ్ళు లాంటి పథకాలకు మరలించి వాడుకొంది. అలా ఈ పథకపు నిధులను యితర పథకాలకు మరల్చటాన్ని తప్పుపట్టిన కేంద్ర ప్రభుత్వం, తిరిగి ఆ నిధులను విడుదల చేయబోనని తేల్చి చెప్పింది. ఇక ఈ పథకపు నిధులను యితర పథకాలకు మరల్చను అని రాష్ట్ర ప్రభుత్వం రాత పూర్వకంగా సంజాయిషీని, హామీని యిచ్చినా కేంద్ర ప్రభుత్వం నిధుల విడుదలకు అంగీకరించలేదు. ఈ విషయాన్ని కప్పిపెట్టి రాష్ట్ర పాలకులు తాము రైతుల నుద్ధరించటంకోసం ఈ పథకపు అమలును ఆపినట్లు ఘనంగా ప్రకటిస్తూ, రైతాంగాన్ని మభ్యపెట్టడానికి పూనుకొన్నారు.

"వ్యవసాయం బాగుండాలి. ఈ అడ్డాల సుబాబుల్ ఆపేసి ఆహార పంటలు సాగుచేయాలి. నీళ్ళు యివ్వాలి. రేట్లు అనుకూలంగా వుంటే రైతు బాగుంటాడు- కూలోళ్ళం ఎక్కడికీ పోకుండా మా మా గ్రామాల్లోనే పని చేసుకొంటాం" అంటూ ఈ ప్రాంతపు గ్రామీణ పేద వ్యవసాయకూలీలు తమ ఆకాంక్షలను వ్యక్తం చేస్తున్నారు. వీరి ఆకాంక్షలు నెరవేర్చటం ద్వారానే తప్ప యిటువంటి పథకాల ద్వారా గ్రామీణ పేదల పేదరికాన్ని నిర్మూలించటం అన్నది అసాధ్యం అన్నదే చేదు నిజంగా వుంది. ◈

జనశక్తి నిధిని సేకరించండి !
చందాల సంఖ్యను పెంచండి !!

జనశక్తి పక్ష పత్రికగా రెగ్యులర్‌గా వెలువడుతూన్న విషయం పాఠకులకు తెలుసు. నిర్వహణలో ఆర్థిక భారం పెరుగుతూ వుంది. గత దశాబ్ద కాలంగా దీని కోసం అప్పులుచేసి నిర్వహించుకొంటూవస్తున్నాం. దీని దృష్ట్యా పత్రిక ఆర్థిక దుస్థితి నుండి బయటపడాలంటే పాఠకుల, రాజకీయ కార్యకర్తల, ప్రజల సహకారం తప్పనిసరి.

రాజకీయ కార్యకర్తలు ప్రజలనుండి, పాఠకులనుండి, అభ్యుదయ, ప్రజాస్వామ్య దేశభక్తియుత శక్తులను విరాళాలు అభ్యర్థించి సేకరించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం. ఇదే సమయంలో పత్రిక చందాలను విరివిగా చేర్పించవలసిందిగా కోరుతున్నాం.

అభివందనములతో

జనశక్తి నిర్వాహకులు

తీరప్రాంత ప్రజల జీవితాలను ఛిద్రంగావించే కోస్టల్ కారిడార్ నిర్మాణాన్ని ఆపివేయాలి!

నిర్బంధ భూసేకరణను ప్రతిఘటించండి!

ప్రజలారా!

కోస్టల్ కారిడార్ జి.వో.నెం.34 విడుదలతో రాష్ట్రంలోని తీరం వెంబడి 9 జిల్లాలు, శ్రీకాకుళంనుండి నెల్లూరు వరకు కోస్తా కారిడార్‌ను దశల వారీగా ఏర్పాటుకు లక్షలాది ఎకరాల భూసేకరణకు రాష్ట్రప్రభుత్వం రంగం సిద్ధంచేసింది. తీర ప్రాంతంలో రైతులకు సెంటు, కుంట భూములే జీవనాధారం. దీనితో దిక్కుతోచని రైతులు తీవ్రమనోవేదనతో తమ బ్రతుకులు ఏమౌతాయోనని ఆందోళన చెందుతున్నారు.

ఆ భూములతో ప్రభుత్వ సహకారంలేకున్నా, సిరులు కురిపించక పోయినా, పూలు, కూరగాయల సాగుతో తిండి గడవడం అంతంత మాత్రంగానే వున్నది. యిలాంటి బడుగువర్గాల జీవనాధారమైన వారి భూములను లాగివేసుకొని వారి జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తున్నారు. మరొకవైపున అత్యధిక గ్రామాలలో మత్స్యకారులు నివాసాలను, సాంప్రదాయవృత్తిని కోల్పోయి నిరాశ్రయులవుతారు. ఈ సెజ్‌లలో సామ్రాజ్యవాద దేశాలలో నిషేధింపబడి నటువంటి విషపుమందులు, పెట్రో రసాయన పరిశ్రమలను తెచ్చి తీరాన్ని డంపింగ్ యార్డుగా మార్చి కాలుష్యాన్ని వెదజల్లుతారు. దీంతో మత్స్యసంపదకు అపార నష్టం వస్తుంది. త్రాగు, సాగునీటిని పరిశ్రమలకు మరల్చి, నిత్యం పంటలు పండే పంట భూములను నాశనంచేసి, ఆహారధాన్యాల కోసం ఎదురుచూసే పరిస్థితికి నెడతారు. వ్యవసాయ కూలీల, రైతుల, మత్స్యకారుల జీవనాధారాన్ని నాశనం చేసి వారిని బహుళజాతి సంస్థలకు పరాధీనులుగా మార్చే జి.వో.నెం.34ను రద్దుచేయాలి.

నిజాంపట్నం నుండి చీరాల ఓడరేవువరకు పారిశ్రామిక కారిడార్ (వాన్‌పిక్) ఎవరికోసం?

నిజాంపట్నం, ఓడరేవుల వద్ద రెండు రేవుల నిర్మాణం చేసి, దానిద్వారా ఎగుమతి-దిగుమతులు చేసేందుకు మౌలిక వసతులు కల్పించి పరిశ్రమలు స్థాపించేందుకు ఒక ప్రణాళికను సిద్ధం చేశారు. దీనినే ఓడరేవు నిజాంపట్నం పోర్టు ఇండస్ట్రియల్ కారిడార్ అని (వాన్‌పిక్) పిలుస్తున్నారు. 16,800 కోట్ల రూపాయల వ్యయంతో రేవు నిర్మాణం, సముద్ర తీరం వెంట 26 కి.మీ పొడవునా పరిశ్రమలకొరకు మౌలిక వసతుల నిర్మాణం చేస్తారు. మోటుపల్లి వద్ద నౌకా నిర్మాణ యూనిట్ కాంట్రాక్టును మాట్రిక్స్ కంపెనీకిచ్చారు. ప్రజల వ్యతిరేకతతో గతంలో ఆపివేసిన షిప్‌బ్రేకింగ్ యూనిట్‌ను కూడా ప్రారంభిస్తారని తెలుస్తున్నది. ఈ ప్రాజెక్టును నిర్మించేందుకు రస్‌అల్‌ఖైమా ఇన్‌వెస్ట్‌మెంట్ అథారిటీ అనే అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన కంపెనీతో రాష్ట్రప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. హైద్రాబాదుకు చెందిన రియల్ ఎస్టేట్ కంపెనీ మాట్రిక్స్ ఎన్‌పోర్టు ప్రైవేట్‌లిమిటెడ్, రస్‌అల్‌ఖైమాలు సమాన వాటా దారులుగా ఈ ప్రాజెక్టును ఆరేళ్లలో నిర్మిస్తారు. దీనినే దేశంలో మొట్టమొదటి రేవు ఆధారిత పారిశ్రామిక కారిడారని చెప్పుకుంటున్నారు. దీని అర్థం రేవునుండి ముడి సరుకులు దిగుమతి చేసుకుని, ఉత్పత్తిచేసి, తిరిగి రేవుద్వారా ఎగుమతి చేస్తారు. వేలకోట్ల రూపాయల పెట్టుబడి పెట్టే ప్రైవేటు కంపెనీలు తమ లాభాలను గ్యారంటీ చేసుకోనిదే నిర్మాణానికి పూనుకోవు. రేవుకట్టారు కాబట్టి పరిశ్రమలు పెట్టరు. పరిశ్రమలు పెట్టుకొంటామంటే, వారికోసం రేవు కడతారు. గ్యాసు ఆధారిత 2100 మెగావాట్ల విద్యుదుత్పత్తి కర్మాగారం పెడతామనీ, పెట్రో రసాయన పరిశ్రమలు పెడతామనీ అంటున్నారు తప్ప నిర్దిష్ట ప్రతిపాదనలేవీ చెప్పటం లేదు. కొత్తపట్నం మండలం బీరంగుంట వద్ద విమానాశ్రయం, టౌన్‌షిప్ నిర్మిస్తామంటున్నారు. రేవు నిర్మాణం ద్వారా 10 లక్షల ఉద్యోగాలు వస్తాయని చెబుతున్నారు.

యిందుకోసం ప్రకాశం జిల్లాలో 9 వేలు, నిజాంపట్నం వద్ద 4వేలు సుమారు 13 వేల ఎకరాలు అని మొదట ప్రకటించి, తరువాత ప్రకాశం జిల్లాలోని 5 మండలాల్లో 18 వేల ఎకరాలు, గుంటూరుజిల్లాలో 6 మండలాలలో 10 వేల ఎకరాలతో మొత్తం 28 వేల ఎకరాలు స్వాధీనం చేసుకొనేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తుంది. ఇలా భూసేకరణ ఎంత పెరుగుతుందో తెలియని స్థితిలో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం గుంటూరు, ప్రకాశం జిల్లాల కలెక్టర్లు, మంత్రులచేత గ్రామాలలో సభలు నిర్వహించి రైతులను భూములు యివ్వాలని, మంచిధర యిస్తామని, ధరల నిర్ణయం, డబ్బు చెల్లింపు, రిజిస్ట్రేషన్ అన్ని ఒక రోజే పూర్తిచేస్తామని, మాట్రిక్స్ కంపెనీ అక్కడికక్కడే డబ్బు చెల్లిస్తుందనీ, మరొకవైపున కారిడార్‌లో ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు దొరుకుతాయని రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నప్పటికి ఆశలు రేకెత్తింప చూస్తున్నారు. భూములు యివ్వకుంటే బలవంతంగానైనా తీసుకుంటామని, మీరు సాగుచేస్తున్న అసైన్డ్, అటవీ, ఈనాం భూములన్నీ ప్రభుత్వ భూములేనని, ఆ భూములను స్వాధీనం చేసుకుంటామని ప్రభుత్వం రైతాంగాన్ని బెదిరిస్తున్నది.

వ్యవసాయమే వృత్తిగా ఆధారపడి వరి, వేరుశెనగ, ఉప్పు, పూలు, కూరగాయలు వంటి పంటలు పండిస్తున్న రైతులు, కౌలురైతులు, కూలీలను నిరాశ్రయులనుచేసి నామమాత్రపు నష్టపరిహారం యిస్తుంది. ప్రభుత్వం యిచ్చే లక్ష రూపాయల నష్టపరిహారంతో రైతు బయట ఎకరం కొనాలంటే 10 నుండి 20 లక్షల పైగా ధర పలుకుతోంది. గుంటూరుజిల్లాలో తీరప్రాంత గ్రామాలైన అడవిపాలెం, మోళ్ళగుంట, కొత్తపాలెం, దిండిఏడు గ్రామాలు, నిజాంపట్నం , ఎక్స్‌మిలటరీ కాలనీ, గోకర్ణమఠం, అల్లూరు, ఏటికట్ట, పెద్దపులుగువారి పాలెం, పేరలి, పామర్రు, గణపవరం, ముత్తాయి పాలెం గ్రామాల్లో బలవంతంగా ఇళ్లు ఖాళీ చేయించాలని చూస్తున్నారు. ప్రకాశం జిల్లాలో వేటపాలెం, చిన్నగంజాం మండలాలలో తీరప్రాంత గ్రామాలైన మోటుపల్లి, క్రిష్ణగిరి పట్టపుపాలెం, సీతారాంపురం, జీడిచెట్ల పాలెం, కుండెడుచెట్లపాలెం, అడవీధిపాలెం, క్రిష్ణనగర్, కొత్తరెడ్డిపాలెం, పాతరెడ్డిపాలెం, పొలిమలింగాయపాలెం, రామచంద్రాపురం, టెంకాయి చెట్లపాలెం గ్రామాలలో సుమారు 1056 ఇళ్ళు బలవంతంగా ఖాళీ చేయించాలని చూస్తున్నారు. ప్రకాశంజిల్లాలో వెలుగొండ, గుండ్లకమ్మ ప్రాజెక్టుల క్రింద బలవంతంగా ఖాళీచేయించిన నిర్వాసితులకు 5 సం॥లు అయినా యింటి స్థలం, నివాసాలు ఏర్పాటు చెయ్యలేని ప్రభుత్వాలు ఈ జిల్లాల్లో మత్స్యకార గ్రామాలకు వారి వృత్తికి అనుకూలమైన నివాసాలు చూపించగలుగుతారా? ఈ పారిశ్రామిక కారిడార్ వలన ఈ రెండు జిల్లాలలోని తీరప్రాంత గ్రామాలు, వ్యవసాయం మీద ఆధారపడ్డ కూలీలు, రైతులు, కౌలురైతులు, ఉప్పురైతులు, విభిన్న వృత్తుల వారి, సాంప్రదాయ వృత్తిని కోల్పోయిన లక్షలాది మంది మత్స్యకారుల జీవితాలు అల్లకల్లోల మవుతాయి.

జనజీవన వినాశనం:

సముద్రంపై రోజుల తరబడి సాగివేట ఎంత ప్రమాదకరమో తెలిసినా – తరాలుగా అదేవృత్తిని ఆధారం చేసుకొని బ్రతుకులు ఈడుస్తున్నారు మత్స్యకారులు. కానీ కోస్తా తీరాన్ని రక్షించేందుకు సమగ్రమైన చట్టంలేదు. 80 లక్షలమంది మత్స్యకారుల వృత్తికి ప్రభుత్వాలు ఎలాంటి రాయితీలు, మౌలిక వసతులు కల్పించటంలేదు. మత్స్యకారుల ఆందోళనల ఫలితంగా 1991 సం॥లో కోస్టల్ రెగ్యులైజేషన్ జోన్ (సి.ఆర్.జెడ్) పేరిట ప్రభుత్వం ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది. సముద్రతీరం వెంట ఇష్టం వచ్చినట్లుగా నిర్మాణాలు చేయకుండా, పరిశ్రమలు స్థాపించకుండా నిబంధనలు రూపొందించింది. దీనిని చిత్తశుద్ధితో అమలు జరపకపోగా, ఇప్పుడు దానికి తూట్లు పొడిచి కోస్టల్ మేనేజ్‌మెంట్ జోన్ (సి.యం.జెడ్) ముసాయిదాను తెచ్చారు. దీని ద్వారా తీరప్రాంతాల్లో పెట్రో రసాయిన పరిశ్రమలు నిర్మించుకొనే వీలు కల్పించారు. ఇంతేకాక తీరప్రాంతంల్లో విమానాశ్రయాలు నిర్మించేందుకు వీలుగా సిఎంజడ్ ముసాయిదాకు మరో సవరణను కూడా హడావుడిగా తెచ్చారు.

దేశంలో చమురు రిఫైనరీలు చాలినన్ని ఇప్పటికే వున్నాయి. చమురు దిగుమతి చేసుకుని, శుద్ధి చేసుకుంటున్నాయి. దీనితో పెట్రోలు, డీజిలుతోపాటు ఇతర పెట్రో ఉత్పత్తులు చాలినంతగా లభిస్తున్నాయి. వీటినుండి రసాయనాల తయారీ కూడా చాలినంతగా వుంది. ఇవేవి దిగుమతి చేసుకోకపోవటమే చాలినంతగా వున్నాయనటానికి రుజువు. మరి రాష్ట్ర తీరప్రాంతం పొడవునా పెట్రో పరిశ్రమలు పెట్టవలసిన అవసర మేమిటి? చమురు దిగుమతి చేసుకుని శుద్ధిచేసి, వచ్చిన ఉత్పత్తులన్నింటినీ ఎగుమతి చేయటంకోసం. దీనివల్ల లాభమేమిటి? ఈ పరిశ్రమలను పెట్టేది విదేశీ గుత్త సంస్థలే. లాభాలన్నీ వాటికే. మనకు మిగిలేదేమిటి? ఈ పరిశ్రమలు వదిలే కాలుష్యంతో విషంగా మారిన నేలా, నీరు, గాలి. భూమిని కోల్పోయిన రైతాంగం, సముద్రాన్ని కోల్పోయిన మత్స్యకారులు మరో జీవనోపాధి లేక జీవశ్చవాలవటం.

ఉద్యోగ, ఉపాధి కల్పన బూటకం:

కోస్తా కారిడార్ ఏర్పాటువలన గ్రామీణ ప్రాంతాలలోని నిరుద్యోగ యువతకు 10 లక్షల ఉద్యోగ అవకాశాలు వస్తాయనీ, భూములు కోల్పోయిన రైతు కుటుంబాలకు ఉపాధి దొరుకుతుందని రాష్ట్రప్రభుత్వం ప్రకటిస్తోంది. గ్రామాలలో మౌలిక వసతులు అభివృద్ధి చెందుతాయని ప్రజలను భ్రమలలో పెట్టాలని చూస్తోంది.

విశాఖపట్నం రేవు, దానినుండి దిగుమతులపై ఆధారపడిన హిందూస్తాన్ పెట్రోలియం, కోరమాండల్, నాగార్జున, గోదావరి ఫెర్టిలైజర్ కంపెనీలు, ఎగుమతి చేసే విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ, ఇంకా చిన్నా చితకా ఫ్యాక్టరీలను కలిపినా ఉద్యోగుల, కార్మికుల సంఖ్య లక్షమందిని దాటదు. పెట్రో ఆధారిత పరిశ్రమల్లో కోటి రూపాయల పెట్టుబడికి ఒక ఉద్యోగం ఏర్పడితే గొప్ప. ఆ లెక్కన 10 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు ఈ ఒక్క కారిడార్‌లోకే వస్తాయనటం పచ్చి అబద్ధం. నూతన ఆర్థిక విధానాల తర్వాత దేశంలోకి వచ్చిన ప్రత్యక్ష పెట్టుబడిలే యిన్నిలేవంటే మోసం అర్థమౌతుంది.

పారిశ్రామిక కారిడార్ పేరుతో సహజ వనరుల తరలింపు:

బడుగు ప్రజల సంక్షేమం, రైతు రాజ్యమే తమ ధ్యేయమని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విదేశీ, స్వదేశీ గుత్తపెట్టుబడి దారులకు సెజ్ చట్టాలు కారిడార్ చట్టాలు తీసుకవచ్చి, వారికి లాభాలు చేకూరుస్తూ, ప్రజలను పరాధీనులుగా చేసే తన దళారీ స్వభావాన్ని చాటు కున్నది. పారిశ్రామికవేత్తలకు ప్రజల ప్రయోజనాలు, ఉపాధి అవకాశాలు కల్పించడంకన్నా వారి పరిశ్రమలకు అవుసరం అయ్యే వనరులను కొల్లగొట్టుకుని పెద్దఎత్తున లాభాలు గడించటమే వారి ధ్యేయం. వారికి అనుకూలమైన విధానాలు రూపొందించడం దళారీ పాలకుల నైజం. ఇక్కడ నీరు, గ్యాసు, రైలు, రోడ్డు రవాణా మార్గాలు అందుబాటులో వున్నాయి. ఇక్కడ ఏర్పాటు చేసే ఓడరేవులు, విమానాశ్రయాలు అన్నీ ప్రజల ప్రయోజనాలకు ఏర్పాటు చేస్తున్నవి కావు. బహుళజాతి సంస్థలు, గుత్త పెట్టుబడిదారులు దేశసంపదను తరలించుకుపోవడానికి పాలకులు అన్ని వనరులు ఏర్పాటుచేస్తూ కమీషన్ ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారు. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ నేపథ్యంలోప్రత్యేక ఆర్థికమండళ్ళు (సెజ్), కోస్తా కారిడార్‌లు అంతర్జాతీయ మార్కెట్ శక్తులకు అనుకూలంగా వుంటాయి.

కోస్తా కారిడార్‌ను వ్యతిరేకించడమంటే పారిశ్రామికీకరణను, అభివృద్ధిని వ్యతిరేకించడమేనంటూ పాలకులు నిందా ప్రచారాలు చేస్తున్నారు. పాలకులకు చిత్తశుద్ధివుంటే వ్యవసాయానికి రాయితీలు కల్పించి, ఉత్పత్తిని పెంచి, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ఏర్పాటు చేస్తే ఉద్యోగాలు, ఉపాధి దొరుకుతుంది. ఆహార ధాన్యాలు దిగుమతి చేసుకొనే అవుసరం వుండదు. కనుక వీరి పారిశ్రామిక అభివృద్ధి అంటే ప్రజల, రైతుల, కార్మికుల, వ్యవసాయ కూలీల, బడుగువర్గాల అభివృద్ధికాదు. విదేశీ, స్వదేశీ గుత్తపెట్టుబడిదారులకు ఊడిగం చేసి వారికి లాభాలు చేకూర్చడమే దళారీ పాలకుల దృష్టిలో అభివృద్ధి.

- విదేశీ, స్వదేశీ గుత్త పెట్టుబడిదారుల కోసం తీసుకొచ్చిన "సెజ్" చట్టాలను, కోస్టల్ కారిడార్‌కోసం ప్రభుత్వం విడుదల చేసిన జీ.వో.నెం.34ను రద్దు చేయాలి.
- దళితుల, రైతుకూలీల, మత్స్యకారుల రైతుల, జీవనోపాధిని దెబ్బతీసే ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించండి.
- దళితులు, నిరుపేదల స్వాధీనంలోవున్న అసైన్డ్ భూములు సేకరించడాన్ని నిలుపుదల చేయాలి.
- కోస్టల్ కారిడార్ నిర్మాణాన్ని ఆపివేయాలి.

సి.పి.ఐ.(యం.యల్)

గుంటూరు, ప్రకాశంజిల్లాలు

గండేపల్లిలో ఇథనాల్ ఉత్పత్తిని నిషేధించాలని ధర్నా

చందర్లపాడు, 14.7.08: వాహనాల ఇంధనంకోసం ప్రజల పొట్టలు కొట్టే ఇథనాల్ ఉత్పత్తిని వెంటనే నిషేధించాలని రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) ఆధ్వర్యంలో చందర్లపాడు తహశీల్దారు కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అంతర్జాతీయంగా పెరుగుతున్న పెట్రోలు, చమురు ధరల దృష్ట్యా స్థానికంగా ఇంధనాలను తయారు చేసుకోవాలని అమెరికా చేసిన సూచనల మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీటి ఉత్పత్తిని ప్రోత్సహిస్తున్నాయని అన్నారు. అందులో భాగంగానే మొదటుగా కర్నూలుజిల్లా నంద్యాలలో, తర్వాత కృష్ణాజిల్లా కంచికచర్ల మండలంలో గండేపల్లి గ్రామంలో ఇథనాల్ ఉత్పత్తి ఫ్యాక్టరీలకు ప్రభుత్వం అనుమతినిచ్చి ప్రారంభించిందని అన్నారు. ఇథనాల్, బయో డీజిల్ ఉత్పత్తికి కావాల్సిన పంటలను పండించటానికి వ్యవసాయ సాగుభూములను కేటాయించటం సరికాదని అన్నారు.

దీని వలన కలిగే నష్టాలను వివరిస్తూ గండేపల్లిలో ఇథనాల్ ఉత్పత్తికోసం నిర్మించిన సెంటినీ బయో ప్రొడక్టు (ప్రై) లిమిటెడ్‌లో రోజుకు 1.40 లక్షల లీటర్లు ఉత్పత్తి అయ్యే ఇథనాల్‌కు 350 టన్నుల మొక్కజొన్నలు అవసర మవుతాయని అన్నారు. అంటే ఎత్తిపోతలు, బావులు, సాగుక్రింద మొక్కజొన్న దిగుబడి ఎకరానికి 20-25 క్వింటాళ్ళు (2-21/2 టన్నులు) చొప్పున దిగుబడి వస్తే రోజుకు 140-175 ఎకరాలలోని పంట అవసరమవుతుందని, ఆ విధంగా సంవత్సరానికి కనీసం 42 వేల నుంచి 52 వేల ఎకరాలలోని పంట కావాల్సి ఉందని వివరించారు. వంటల మార్కెట్ రేట్ల మాయాజాలంతో మాగాణి, ఇతర పంటల సాగుచేసే రైతులను కూడా మొక్కజొన్న ఉత్పత్తివైపుకు ఆకర్షించి పెద్ద మొత్తంలో కంపెనీకి కావాల్సిన మొక్కజొన్న ఉత్పత్తిని ప్రోత్సహిస్తుందని, ఫలితంగా మాగాణి రైతులు కూడా ఇటువైపు మొగ్గు చూపుతారని అన్నారు. మొక్కజొన్న ఉత్పత్తికి కావాల్సిన 42-52 వేల ఎకరాలలో కనీసం 50 శాతం భూమిలో మాగాణి రైతులు మొక్కజొన్న వైపుకు మళ్ళే ఆలోచనతో ఉన్నారు. ఇది అమలులోకి వస్తే సంవత్సరానికి దాదాపు 5 లక్షల బస్తాలకు పైగా ఉత్పత్తి తగ్గిపోతుందని, దీని వలన దాదాపు 1 లక్ష మంది ప్రజలు 1 సంవత్సర కాలంపాటు ఆహారాన్ని కోల్పోతారని వివరించారు. మిగిలిన 50 శాతం భూమిలో ఉత్పత్తి అయ్యే మెట్టపంటల విలువ 32-35 కోట్ల రూ.లు ఉంటుందని అన్నారు. అంతేకాక వ్యవసాయకూలీలు 18 లక్షల వరకు పని దినాలను కోల్పోతారని ఈ విధంగా లక్షలాది మంది పొట్టలు కొట్టే వాహనాల ఇంధనాల కోసం మనం వ్యవసాయం చేయాలా? ప్రజల ఆహార అవసరాలు, భద్రత కోసం వ్యవసాయం చేయాలా అని ప్రశ్నించారు. ఈ విషయంలో రైతులు కూడా ఆలోచించాలన్నారు.

ఇప్పటికే సెజ్‌లు, కారిడార్‌లు, ప్రాజెక్టులు పేరుతో లక్షల ఎకరాల సాగు భూమి తరిగిపోయి ఆహారోత్పత్తులు తగ్గిపోతున్నాయన్నారు. మరోవైపు పాలకులు అనుసరిస్తున్న రైతువ్యతిరేక విధానాల ఫలితంగా మాగాణి భూములలో కూడా సుబాబుల్, జామాయిల్ సాగువైపుకు రైతులు నెట్టబడ్డారు. దీని వలన కూడా ఆహారధాన్యాల ఉత్పత్తి తగ్గిపోతున్నదని, వ్యవసాయ కూలీలకు పనులు లేకుండా పోతున్నాయన్నారు.

అమెరికాలో ఉత్పత్తి అయ్యే మొక్కజొన్న, సోయా పంటలలో 30 శాతంపైగా జీవ ఇంధనాలకోసం కేటాయించిన ఫలితంగా అక్కడ తీవ్రమైన ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని వివరిస్తూ అమెరికా సంక్షోభపు ఊబిలో కూరుకుపోతూ మన దేశాన్ని కూడా ఊబిలోకి లాగుతున్నదని, మన పాలకులు చేపట్టి అనుసరిస్తున్న విధానాలు ఇలాగే వున్నాయని వివరించారు. రాష్ట్రంలో వరి సాగు 2005-06లో 38-45 లక్షల హెక్టార్లుండగా, 2006-07లో 38.36 లక్షల హెక్టార్లకు తగ్గిందని ఈ విధంగా ప్రతి సంవత్సరం సాగు భూమి విస్తీర్ణం తగ్గించబడుతోందని, దీని వలన ఆహారభద్రత సమస్య పొంచి వున్నదని అన్నారు.

ప్రత్యామ్నాయంగా దేశీయంగా ఉన్న సహజవనరులను వెలికితీసి, అభివృద్ధిపరచటం, మోటారు వాహనాల వినియోగాన్ని నియంత్రించటం, గాలి, నీరు, సూర్యరశ్మిలాంటి ఇంధన వనరులను వినియోగించే వైపుగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇవన్నీ ప్రభుత్వ రంగంలోనే జరపటం ద్వారా మనం నిలదొక్కుకోగల్గుతామని, అలాగే అంతర్జాతీయంగా తక్కువ రేట్లకే సప్లయి చేసే దేశాల నుంచి చమురును దిగుమతి చేసుకోవటం, దిగుమతి చేసుకున్న చమురు రేటుకు మించి పన్నులు వడ్డించకపోతే తక్కువ రేట్లకే చమురును ప్రజలకు అందించవచ్చని, ఈ పని పాలకులు చేపట్టడం లేదని అన్నారు. దీనికోసం ప్రజలు ఉద్యమించాలని ముగించారు. ధర్నా అనంతరం తహశీల్దారుకు మెమోరాండం సమర్పించారు.

ఈ కార్యక్రమానికి రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) జిల్లా అధ్యక్షులు కా॥ మందా జార్జి, జిల్లా నాయకులు రాచబంటి కోటేశ్వరరావు, కా॥ కాసరెల్లి మస్తాన్, కా॥ అరిగెల కాంతయ్య, స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కన్వీనర్ కా॥ కామేశ్వరి, జిల్లా నాయకులు కా॥ నాగమల్లేశ్వరి తదితరులు నాయకత్వం వహించారు.

సి.బి.యస్.ఇ. ఆంగ్ల మాధ్యమాన్ని వ్యతిరేకించండి! ఆదివాసీ ప్రాంతాలలో పటిష్టమైన విద్యా విధానాలకై పోరాడుదాం!!

విద్యార్థులారా! ఉపాధ్యాయులారా, మిత్రులారా!

ప్రభుత్వ పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం నుండి ఇంగ్లీషు మాధ్యమాన్ని ప్రవేశపెడుతూ పాఠశాలలు పునః ప్రారంభానికి మూడు రోజులు ముందుగా దీనికోసం ఎటువంటి ఆచరణాత్మక ప్రణాళిక లేకుండా మన రాష్ట్ర ప్రభుత్వం జీ.వో. 76ను విడుదల చేసింది. ఈ జీ.వో. ప్రకారం కేంద్ర ప్రభుత్వ సిలబస్ అయిన సి.బి.ఎస్.ఇ. ఇంగ్లీషు మాధ్యమాన్ని 6వ తరగతి నుండి ప్రవేశ పెడుతున్నారు. "ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరడం తగ్గుతున్నదని, ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం పెట్టమని ప్రజలు కోరుతున్నారు కనుక ఈ నిర్ణయం తీసుకున్నామని, దీని ద్వారా డ్రాపౌట్స్ నివారించ వచ్చునని, ఇంగ్లీషు మాధ్యమం ద్వారా పేద, మధ్యతరగతి, దళిత, బలహీన వర్గాల పిల్లల అభివృద్ధికి వారి ఉపాధికి అవసరం అయిన శిక్షణ పొందవచ్చునని" ఇందుకు కారణాలుగా మన రాష్ట్ర పాలకులు చెబుతున్నారు. అందుకోసం ఈ విద్యా సంవత్సరంలో 6,500 పాఠశాలలను ఎంపిక చేసారు. ఇప్పటి వరకు ప్రభుత్వ పాఠశాలలలో తెలుగు మాధ్యమంలో బోధించే ఉపాధ్యాయులకే కేవలం రెండు వారాలు ట్రైనింగ్ ఇచ్చి ఇంగ్లీషు మాధ్యమంలో పాఠాలు బోధించమని చెబుతున్నారు. తెలుగులో చదువుకుని, తెలుగు పాఠాలు బోధించే ఉపాధ్యాయులు కేవలం ఈ రెండు వారాలు ట్రైనింగ్ ద్వారా సి.బి.ఎస్.ఇ. ఇంగ్లీషు మాధ్యమాన్ని అర్థం చేసుకుని విద్యార్థులకు అర్థం అయ్యే విధంగా, **ధారాళంగా పాఠాలు** బోధించగలరా? ఒకటవ తరగతి నుండి ఐదవ తరగతి వరకు తెలుగు మాధ్యమంలో చదువుకున్న విద్యార్థులు 6వ తరగతిలో ఒకేసారి సి.బి.ఎస్.ఇ. ఇంగ్లీషు మాధ్యమ పాఠాలను అర్థం చేసుకుని, అవగాహన చేసుకోగలరా? ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న వసతులతో, ఈ ఉపాధ్యాయులతో ఇది అసాధ్యం. ఫలితంగా మరింత డ్రాపౌట్స్ పెరుగుతాయే తప్ప, ప్రభుత్వం చెప్తున్న అభివృద్ధి ఉండదు. ఈ డ్రాపౌట్స్‌కి కారణం ఉపాధ్యాయులు బోధించలేకపోవడమంటూ ఉపాధ్యాయులను నిందించి వారి మీద మరింత ఒత్తిడిని పెంచుతారు. డ్రాపౌట్స్ పెరగడంతో పిల్లలు లేరనే పేరుతో నెమ్మదిగా ఒక్కొక్క స్కూలును మూసివేసి (ప్రపంచబ్యాంకు ఆదేశాలను తూచ తప్పకుండా పాటిస్తున్న మన దళారీ పాలకులు ఇప్పటికే ప్రజల ఆస్తులను సామ్రాజ్యవాదులకు, బడా పెట్టుబడిదార్లకు తాకట్టు పెడుతున్నట్టుగా ఈ పాఠశాలలను కూడా కార్పోరేట్ విద్యా సంస్థలకి కట్టపెట్టి) రాజ్యాంగ సూత్రానికి విరుద్ధంగా ప్రాథమిక నిర్బంధ ఉచిత విద్యకు తిలోదకాలు ఇచ్చి తమ బాధ్యత లేదని చేతులు దులుపుకున్నా ఆశ్చర్యంలేదు. పాఠశాలలు ఎత్తివేసి ఉపాధ్యాయులను ఇంటికి పంపే కుట్ర కూడా ఇందులో ఉంది. పాఠశాలల విలీనం కూడా ఈ కుట్రలో భాగమే. ఇటువంటి చర్యల ద్వారా రాష్ట్రంలో పేద, దళిత బలహీనవర్గాల పిల్లలు చదువులకు మరింత దూరం అయి నష్టపోతారు.

ఏదైనా ఒక విషయాన్ని మాతృభాషలో అర్థం చేసుకున్నట్టుగా పరాయిభాషలో అర్థం చేసుకోలేరు. అందువలన ముందు మాతృభాష పూర్తిగా నేర్పి, మాతృభాష మీద పట్టు వచ్చినాక పరాయి భాష ఏదైనా వారి ఇంటరెస్ట్‌ను బట్టి బోధించాల్సి వుంటుంది. ప్రజాసంక్షేమాన్ని కోరే ఏ ప్రభుత్వం అయినా చేయవల్సిన పని ఇది. దీనికి విరుద్ధంగా మన రాష్ట్ర ప్రభుత్వం తెలుగు మాధ్యమం మీద సరైన దృష్టి పెట్టకుండా నిర్లక్ష్యంచేసి సి.బి.ఎస్.ఇ.ని ప్రవేశపెడతామనడం హాస్యాస్పదం. ఇప్పటికీ కొన్ని దేశాలలో మాతృభాషలోనే విద్యా బోధనలు జరుగుతున్నాయి. మన దేశంలో కూడా డిగ్రీ స్థాయి వరకు మాతృభాషలోనే విద్యాబోధనలు జరగాలనే కొఠారీ కమీషన్ నివేదికను పార్లమెంట్ రెండుసార్లు ఆమోదించింది. దీన్ని గాలికొదిలేసి, ఈ సి.బి.ఎస్.ఇ. ఆంగ్ల మాధ్యమ సిలబస్‌ను ఎందుకు ప్రవేశపెడుతున్నట్టు? ప్రభుత్వం చెబుతున్నట్టు పేద విద్యార్థులపట్ల ప్రేమతో కాదు. సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలలో కారుచౌక కూలీలను (కంప్యూటర్ కూలీలు) అందించేందుకే ఈ సి.బి.ఎస్.ఇ. ఇంగ్లీషు మాధ్యమాన్ని ప్రవేశపెడుతున్నారు. ఈ విధానాన్ని అర్థం చేసుకుని, మన రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ విద్యా వ్యతిరేక విధానాలకి వ్యతిరేకంగా ఉద్యమించాల్సిందిగా విద్యార్థి లోకానికి పిలుపునిస్తున్నాము.

గిరిజనులను ప్రాథమిక విద్య నుంచి కూడా మరింత దూరం చేస్తున్న సి.బి.ఎస్.ఇ.:

మన ఆదివాసీ ప్రాంతంలో ఎం.పి.పి. పాఠశాలలే కాకుండా గిరిజన గురుకుల పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలు కూడా ఉన్నాయి. ఇక్కడ బోధనా విధానం తెలుగు మాధ్యమంలోనే అయినప్పటికీ సరిపోయినంత మంది బోధనా సిబ్బంది లేకపోవడం, టెక్స్ట్ బుక్స్ సకాలంలో అందకపోవడం సరిపడా తరగతి గదులు లేకపోవడం, ల్యాబ్ సౌకర్యం, ఫర్నీచర్స్, మంచినీరు, మరుగుదొడ్డి తదితర సమస్యలతో ఆదివాసీ ప్రాంత ప్రభుత్వ పాఠశాలలు నిండిపోయి వున్నాయి. (మరొకవైపు పౌష్టికాహారం లోపం వల్ల వచ్చే రోగాలు మలేరియా వంటి రోగాలు నిత్యం వేధిస్తున్నాయి.) ఈ సమస్యలన్నింటితో తెలుగు మాధ్యమంలోనే గిరిజన విద్యార్థులు సరిగా చదవలేకపోతున్నారు. ఆదివాసీ ప్రాంతాలలో 10వ తరగతి చదివిన విద్యార్థి తెలుగులో తప్పులు లేకుండా ఉత్తరం వ్రాయలేని స్థితి ఉంది. దీనికి కారణం పై సమస్యలతోపాటు ఆదివాసీ ప్రాంతాలలో వారి పరిసర ప్రాంతాలకు, వారి సంస్కృతి, సాంప్రదాయాలకు అనుగుణంగా ప్రత్యేకమైన సిలబస్ లేకపోవడం, ఆదివాసీ ప్రాంతాలలో ఇప్పుడు ఉన్న విద్యావ్యవస్థ కూడా వారి పరిభాషలో వారికి అర్థమయ్యే రీతిలో బోధనా పద్ధతి లేకపోవడంతో మైదాన ప్రాంతాల కన్నా ఆదివాసీ ప్రాంతాలలో డ్రాపౌట్స్ సమస్య చాలా ఎక్కువగా ఉంది. అతికష్టం మీద 10వ తరగతి వరకు అతికొద్దిమంది చేరుకుంటున్నారు. ఈ కొద్దిమందిలో కూడా ఎక్కువశాతం మంది ఫెయిల్ అవుతున్నారు. మన ప్రాంతంలో కొన్ని గిరిజన జాతుల మాతృభాష తెలుగు కూడా కాదు. ఉదాహరణకి తూర్పు, పశ్చిమగోదావరి, ఖమ్మం జిల్లాలో కోయదొరలు ఉన్నారు. వీరిది ప్రత్యేకమైన కోయభాష, వారి సాంప్రదాయ, ఆచార వ్యవహారాలన్నీ వారు కోయభాషలోనే మాట్లాడుకుంటారు. తెలుగు భాషే సరిగా తెలియని, తెలుగుమాధ్యమంలోనే సరిగా చదువులేని ఇటువంటివారు మన ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సి.బి.ఎస్.ఇ. ఇంగ్లీషు మాధ్యమంలో ఎంత వరకు రాణించగలరు. అందువల్ల ఈ సి.బి.ఎస్.ఇ. వల్ల ఇప్పుడున్న ఈ వచ్చీరాని చదువులకు కూడా మరింత దూరం అయిపోతారు. కావున ప్రభుత్వం నడుపుతున్న అన్నిరకాల పాఠశాలలలో నెలకొని ఉన్న పైన పేర్కొన్న అన్ని రకాల సమస్యలను పరిష్కరించి అన్ని ప్రమాణాలతో తెలుగు మాధ్యమాన్ని ముందు అభివృద్ధి చేయాలి. ఆ తరువాత ఏ భాష గురించి అయినా ఆలోచించాలి. ఆదివాసీ ప్రాంతాలలో వారి సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా వారి పరిభాషలో వారికి అర్థం అయ్యేరీతిలో విద్యాబోధన ఉండాలి. ఇందుకోసం అన్ని రకాల మౌలిక సదుపాయాల కల్పనతోబాటు మరింత అంకితభావం, మరింత నిబద్ధత కల్గిన ఉపాధ్యాయులు కావాలి. ప్రభుత్వ అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో ఈ చర్యలను అమలు చేయకుండా, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించకుండా ఆదివాసీ ప్రాంతాలలో విద్యాభివృద్ధి కోసం ఎన్ని హంగులు చేసినా ఉపయోగపడవు. ఇంగ్లీషు భాషా వ్యామోహం అందరినీ ఆవరించినట్టుగా మన గిరిజన ప్రాంతాలలో కూడ ఆవరించి ఉంది. ప్రభుత్వ ప్రవేశపెడుతున్న ఈ సి.బి.ఎస్.ఇ. సిలబస్ వల్ల వచ్చీరానీ ఇంగ్లీషు మన పిల్లలు మాట్లాడవచ్చు. ఒకరో ఇద్దరో ఉద్యోగం కూడా చేయవచ్చు. (పరాయి భాష వల్ల ఆయా జాతులు, సంస్కృతి, సంప్రదాయాలు ఉనికి కోల్పోయి నిర్వీర్యం అయిపోయే ప్రమాదముంది.) కానీ దీనివల్ల ప్రత్యేకమైన మన మాతృభాష, సంస్కృతి, సంప్రదాయాలు పోయి మన ఐక్యత దెబ్బతిని మన గిరిజన జాతి ఉనికికే ప్రమాదం ఏర్పడి లాభం కన్నా నష్టమే ఎక్కువ జరుగుతుంది. కావున ఆదివాసీ ప్రాంతాలలో పటిష్టమైన విద్యావిధానంకై పోరాడవల్సిందిగా, సి.బి.ఎస్.ఇ ఇంగ్లీషు మాధ్యమాన్ని వ్యతిరేకించవల్సిందిగా విద్యార్థులు, తల్లిదండ్రులు, గిరిజన పెద్దలకు, ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేస్తున్నాము.

ఉపాధ్యాయ మిత్రులారా!

మీరు ఎంచుకున్న ఈ వృత్తిని, ఉపాధికి ఒక ఆదాయవనరుగా చూడకుండా గిరిజన విద్యార్థులలో ఉన్న సృజనాత్మక శక్తిని బయటకు తీసేందుకు మరింత నిబద్ధతతో, అంకిత భావంతో ఆదివాసీ ప్రాంతాలలో పనిచేయాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము. అలాగే మీరెదుర్కొంటున్న అనేక సమస్యలు పరిష్కారం కోసం ఆందోళనలతోబాటు ఆదివాసీ ప్రాంతాలలో పటిష్టమైన విద్యా, ఉపాధికై మేము చేస్తున్న ఆందోళనలో గొంతు కలిపి సి.బి ఎస్.ఇ. మాధ్యమాన్ని వ్యతిరేకించాల్సిందిగా కోరుతున్నాం.

ఉద్యమాభినందనలతో...
ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ (పిడిఎస్ఓ),
అల్లూరి సీతారామరాజు యువజన సంఘం,
నవయువ సమాఖ్య,
తూర్పు, పశ్చిమగోదావరిజిల్లాలు.

గల్ఫ్ దేశాలలో పనిచేస్తున్న భారతీయ కార్మికుల తీరని వెతలు

పొట్ట చేతబట్టుకొని కూలీ కోసం గల్ఫ్ దేశాలకు వెళ్ళిన భారతీయ కార్మికుల వెతల కథలకు అంతు లేకుండా పోయింది. ఆ కార్మికులు రక్తమాంసాలను, ప్రాణాల్ని బలిపెట్టి సంపాదించిన మొత్తాలను విదేశీమారక ద్రవ్య నిలువలను పెంచుకొంటూ లాభాలను అనుభవిస్తున్న భారత పాలకులుగానీ, ప్రభుత్వంకానీ, ఆయా దేశాలతోవున్న రాయబార కార్యాలయాలుగానీ వెతలపాలవుతున్న ఈ అభాగ్య కూలీల గోడును పట్టించుకోవటమేలేదు. కానీ దేశంలో తమకు ప్రజల ఓట్ల అవసరం ఏర్పడినప్పుడల్లా (నిన్న తెలంగాణా ప్రాంతంలో జరిగిన ఉప ఎన్నికల సందర్భం మాదిరి) వీరి వెతలపట్ల మొసలికన్నీరు కార్చి, వీరిని ఆదుకోబోతున్నట్లు అబద్ధపు ఆర్భాటపు ప్రకటనలతో వంచన చేస్తున్నారు.

సరయిన తిండిని కోరినందుకు ఖైదు పాలయిన కార్మికులు:

యు.ఎ.యి.లోని రాస్ ఆల్ ఖైమా అనే ఎమిరైట్‌లో ఆల్‌హమ్రా నిర్మాణ కంపెనీలో 5 వేల మందిదాకా భారతదేశాన్నుండి వెళ్ళిన కూలీలు పనిచేస్తున్నారు. ఈ నిర్మాణపు కంపెనీ ఒక సిరమిక్ కంపెనీకి చెందిన నిర్మాణాలను చేబట్టింది. ఈ కంపెనీ యాజమాన్యం కార్మికులచేత గొడ్డుచాకిరీ చేయించుకొంటోంది కానీ సరైన తిండి కూడా వీరికి పెట్టడం లేదు. తమకు నాసిరకం తిండిపెడ్తున్నారేమి, సరైన తిండి పెట్టండి! అంటూ నిలదీసిన భారత కార్మికులపై కంపెనీకి చెందిన భద్రతా సిబ్బంది వచ్చి చేయి చేసుకొన్నారు. ఇందుకు రెచ్చిపోయిన కార్మికులు తిరగబడ్డారు. ఈ ఘటనను ఆసరా చేసుకొని పోలీసులు, సైన్యం రంగప్రవేశంచేసి 3,417 మంది భారతీయ కార్మికులను అరెస్టుచేసి వారిని అబుదాభిలోని రెండు కారాగారాలకు, దుబాయిలో ఒక జైలుకు, ఫుజీరా ఎమిరేట్సులో ఒక జైలుకూ, రాస్ ఆల్ ఖైమాలో ఒక ఖైదుకూ తరలించి నిర్బంధించారు. 11.7.2008నాడు ఈ ఘటన జరిగింది. ఈ ఘటనను తీవ్రమయినదిగా పరిగణించిన రస్ ఆల్‌ఖైమా రాజ కుటుంబం, దీనికి సంబంధించిన సమాచారంపై పూర్తి స్థాయి సెన్సార్ షిప్ విధించింది. అరెస్టయిన వారిలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, పంజాబ్ ప్రాంతానికి చెందిన కార్మికులున్నారు. పోలీసులు వీరందరి వేలుముద్రలూ తీసుకొని ఘర్షణపడిన వారిని గుర్తించే ప్రయత్నాలు చేస్తున్నారు. అరెస్టయినవారిలో అనేక మంది అమాయక కార్మికులున్నారు. వీరు విడుదలకై అక్కడి భారత రాయబార కార్యాలయం లాంఛనపూర్వక ప్రయత్నాలు చేసినా, రస్ ఆల్ ఖైమా పాలకులు నామమాత్రంగా స్పందించినట్లు తెలియవస్తోంది. ఇటీవలి కాలంలో గల్ఫ్ దేశాల్లో కార్మికుల ఆందోళనలు పెచ్చరిల్లుతున్నట్లు విశ్లేషకులు తెలియచేస్తున్నారు. గల్ఫ్ దేశాల్లో కూలికి వెళ్ళిన భారతీయ కూలీల స్థితి బానిసలకన్నా హీనంగా వుంటోందన్నదే వాస్తవం.

కేవలం నిర్మాణ కంపెనీలలో కూలీలుగా వెళ్ళినవారు మాత్రమే యిటువంటి బానిస బ్రతుకులను అక్కడ వెళ్ళమార్చటల్లేదు. గృహ సేవకులుగాను, డ్రైవర్లుగానూ, నర్సులగాను తదితర సేవలు చేయటానికి వెళ్ళినవారు కూడా యిదే రకంగా అక్కడ జీవిస్తున్నారు.

సౌదీ అరేబియాలో పశువుల కాపర్ల దీనస్థితి:

సౌదీ అరేబియాలోని ఎడారి క్షేత్రాలలో పశువుల కాపరితనం చేయటానికి ఆంధ్రప్రదేశ్ నుండి అనేక వేల మంది వెళ్ళారు. వీరిలో కొందరు ఒంటెల కాపరులుగా పనిచేస్తూ వుంటే, మరికొందరు గొర్రెల కాపరులుగా పనిచేస్తున్నారు. రాష్ట్రానికి చెందిన వివిధ జిల్లాల వారు సౌదీ అరేబియాలోని బురేదా, ఆల్‌ఘసీం, అఖా తదితర ప్రాంతాల్లో పశువుల కాపరులుగా పనిచేస్తున్నారు. విచిత్రమేమిటంటే ఈ భారతీయ పశువుల కాపర్లను గురించిన సమాచారం కూడా భారత దౌత్యవేత్తల వద్ద లేకపోవటం అన్నది. దేశంకాని దేశంలో, అక్కడి భాష తెలియక, కనీసం చూద్దామంటే మానవుడన్నవాడే కనిపించని ఎడారిలో పశువుల మధ్య (ఒంటెలు, గొర్రెల) జీవిస్తూ, ఎందుకు బ్రతుకుతున్నామయా? అని వేదన పడుతున్న ఈ అభాగ్యుల సమస్యలను భారత రాయబార కార్యాలయాధికారులు పట్టించుకోవటానికి శ్రద్ధ చూపరు. ఈ పశువుల కాపర్లకు తాము ఏప్రాంతంలో, ఎక్కడ వున్నామో కూడా తెలియని స్థితి. వీరికి కనీసం టైం కూడా తెల్సుకొనే అవకాశం లేదు. వీరికి యజమానులు వేతనాలు యివ్వరు. అఖమా అనబడే రెసిడెన్సీ వీసాలను యివ్వరు. కడుపునిండా తిండి పెట్టరు. వారాల తరబడి తిండి లేకుండా వెట్టిచాకిరీ చేస్తూ, ఆ ఎడారుల్లో వీరు మ్రగ్గిపోతున్నారు. అఖమా లేకపోవటంతో వీరు స్వేచ్ఛగా సంచరించటానికి వీల్లేదు. వీరు అటువంటి దుర్భరమైన, దీనస్థితిలో మరణించి అక్కడి ఎడారి యిసుకలోనైనా కల్సిపోవాలి లేదా పారిపోవటానికి ప్రయత్నించి, పట్టుబడి కారాగారాల్లోనైనా మ్రగ్గిపోవాలి. ఈ రకంగా ఈ పశువుల కాపరులు అత్యంత దయనీయమైన స్థితిలో చావలేక, బ్రతకలేక జీవితాలను ఈడ్చుతున్నారు.

చట్టాలను సహితం పాటించక కార్మికుల శ్రమను దారుణంగా దోచుకొంటున్న కంపెనీలు:

గల్ఫ్ దేశాల్లో ఎండలు తీవ్రంగా వుండటం వలన, వేసవి కాలంలో జూన్ నుండి ఆగస్టు వరకూ ఎండల్లో కార్మికులను పనిచేయించరాదని కొన్ని దేశాలు చట్టాలు జారీ చేశాయి. కానీ ఈ చట్టాలను ఖాతరు చేయక అమానుషంగా మండుటెండల్లో అనేకమయిన కంపెనీలు పని చేయించుకొంటున్నట్లు తమ తనిఖీలలో వెల్లడయిందని ఆయా దేశాల అధికారులే ప్రకటిస్తున్నారు. 75% మంది యజమానులు ప్రభుత్వ ఉత్తర్వులను ధిక్కరించి కార్మికులను మండుటెండల్లో పని చేయించుకొన్నట్లు ఈ తనిఖీలలో వెల్లడయింది. ఈ రకంగా గల్ఫ్ దేశాల్లో పనిచేసే విదేశీ కార్మికులు (ప్రధానంగా భారత్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక) అమానుషంగా శ్రమదోపిడీకి గురవుతున్నారు.

ఎన్నికల వాగ్దానాలు నీటిమూటలేనని రుజువు చేసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం:

నిన్న తెలంగాణా జిల్లాల్లో జరిగిన ఉప ఎన్నికల సందర్భంగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, దాని అధినేతలయిన మంత్రులూ-పాలకులూ గల్ఫ్ దేశాలలో అవస్థలపాలవుతున్న రాష్ట్రానికి చెందిన కార్మికులపట్ల మొసలి కన్నీరు కార్చి, వారిని ఆదుకొంటామని చెప్పి సవతి తల్లి ప్రేమను చూపించి, తిరిగి రావటానికి దారి ఖర్చులేని కొందరిని ప్రభుత్వ ఉచిత ఖర్చుతో వారి స్వస్థలాలకు తీసుకు వచ్చినట్లు ప్రకటించి ప్రచారం చేశారు. అలా రాష్ట్ర ప్రభుత్వం భరించిన విమాన రవాణా ఖర్చులతో "ఉచితంగా" స్వస్థలాలకు వచ్చినవారందరికీ విమాన టిక్కెట్టు ఖర్చును చెల్లించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం నోటీసులు జారీ చేసి, ఆ ఖర్చులు వసూలు చేయటం కోసం వారి వెంటపడి వేధిస్తోంది. ఇదేం అన్యాయం? అంటూ బాధితులు వాపోతూ, మంత్రి పుంగవుల చుట్టూ ప్రదక్షణలు చేస్తోంటే మంత్రులూ, అధికారులూ నీళ్ళు నములుతూ, విమానపు ఖర్చులు చెల్లించక తప్పదన్నదే ఖాయంగా వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల వాగ్దానాలు నీటిమూటలుగా ఎలా మిగిలి పోతాయో ఈ అనుభవం మరోసారి రుజువు చేస్తోంది.

ఈ రకంగా గల్ఫ్ దేశాల్లో పనిచేసే భారతీయ కార్మికులు మనకు తెల్సిన ఈ రూపాల్లోనేకాక, తెలియని అనేక రూపాల్లో వెతలపాలవుతున్నారు. దీనాతిదీనమయిన పరిస్థితుల్లో బ్రతుకులు వెళ్ళ మారుస్తున్నారు.

(మొహమ్మద్ ఇర్ఫాన్, అతుల్ అనేజా తదితరుల కథనాల ఆధారంగా)

ఏపిఎఫ్‌టియు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నిరంతర ప్రజా ఆందోళనకారుడు కామ్రేడ్ వేమన ఆదినారాయణకు ఘననివాళి

ఏపిఎఫ్‌టియు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మచిలీపట్నం ఏరియా కార్మిక, ప్రజా నాయకుడు కా॥ వేమన ఆదినారాయణ 17.6.08 తేదీన ఉదయం 3 గంటలకు గుండెపోటుతో కన్నుమూశారు. కామ్రేడ్ ఆదినారాయణ కార్మిక, కర్షక, పేద, దళిత వర్గాల మౌలిక సమస్యల పరిష్కారంకోసం కృషి చేశారు.

కామ్రేడ్ ఆదినారాయణ భౌతికకాయంపై తొలుత ఏపిఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ వై.సోని ఎర్రజెండా కప్పి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కడసారి నివాళులర్పించిన వారిలో సి.పి.ఐ. (ఎం.ఎల్) జిల్లా కార్యదర్శి కా॥ ముప్పాళ్ళ భార్గవశ్రీ ప్రసంగిస్తూ కా॥ ఆదినారాయణ పీడిత ప్రజల హృదయాల్లో ఎంతగా స్థానం సంపాదించాడో ఇక్కడకు విచ్చేసిన పీడిత ప్రజలు వందలాదిగా హాజరయిన దాన్నిబట్టి చేస్తూ అర్థం అవుతోంది. ఆ కామ్రేడ్ నెలకొల్పిన పీడిత ప్రజలలో, పేదలలో ఆయనకున్న అనుబంధం, వారితో ఆయన మమేకం అయినతీరు మనకు ఆదర్శమన్నారు. రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కా॥ ఎం.ఎస్.నాగరాజు, తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు కోశాధికారి కా॥ బి.గురవారెడ్డి, స్త్రీవిముక్తి సంఘటన నాయకులు కా॥ డా॥ చల్లపల్లి విజయ, జనసాహితి రాష్ట్ర కార్యదర్శి కా॥ దివికుమార్, ఏపిఎఫ్‌టియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కా॥ టి.పూర్ణచంద్రరావు, ఎన్‌వైఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కె.బాషా, ఏపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కా॥ పాండురంగప్రసాద్, జిల్లా కార్యదర్శి కా॥ కొమ్మారెడ్డి సీతారామయ్య, ఓపిడిఆర్ జిల్లా అధ్యక్షుడు కా॥ ఎం.రామకృష్ణ, మచిలీపట్నం ఎం.ఎల్.ఏ. పేర్ని వెంకట్రామయ్య, మాజీ మంత్రి నడకుదిటి నరసింహారావు, తెలుగుదేశం నాయకులు బచ్చుల అర్జునుడు, కౌన్సిలర్స్ కాగిత జవహర్‌లాల్ నెహ్రూ, మోకా భాస్కరరావు, కొల్లు రమేష్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ బలగం విజయశేఖర్, అడ్వకేట్స్ కాగిత బాలగంగాధరతిలక్, కూనపరెడ్డి శ్రీనివాసరావు వున్నారు. సి.పి.ఎం. జిల్లా కార్యదర్శి కా॥ ఉమామహేశ్వరరావు, పట్టణ కార్యదర్శి కా॥ కొడాలి శర్మ, సి.పి.ఐ. బందరు ఏరియా కార్యదర్శి కా॥ దేవభక్తుని నిర్మల, బి.సి. రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కొనకళ్ల బుల్లయ్య, ముస్లిం మైనారిటీ నాయకులు అబ్దుల్‌మతిన్, బిజెపి వడ్డీ జితేంద్ర, రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ అమీర్, జనజాగృతి కాళిదాసు, సిఐటియు జి.వెంకటేశ్వరరావు, మున్సిపల్ వర్కర్స్ అసోసియేషన్ పినపాలబాబు, ఎన్‌వైఎస్ అధ్యక్ష, కార్యదర్శులు ముచ్చు సుధాకర్, కమ్మెల శ్రీనివాసరావు, రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) జిల్లా ఉపాధ్యక్షులు కా॥ బొట్టా సాంబశివారెడ్డి, జిల్లా కోశాధికారి కా॥ తలశిల లీలామనోహర్, స్త్రీ విముక్తి సంఘటన పామర్తి అంజమ్మ, ఏపిఎఫ్‌టియు మచిలీపట్నం ఏరియా కార్యదర్శి కా॥ శీరంశెట్టి లక్ష్మణరావు తదితరులు పూలమాలలతో, పూలతో ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పూలు, ఎర్రజెండాలతో అలంకరించిన శకటంపై కా॥ ఆదినారాయణ భౌతిక కాయాన్ని ఉంచి అంతిమయాత్ర రైతుబజారు నుండి ప్రారంభమై బస్టాండ్ సెంటర్, కోనేరు సెంటర్ మీదుగా విజయవాడ రోడ్డు మీదుగా పుట్టలమ్మ చెరువు వరకు అనంతరం బైపాస్ రోడ్డు వరకు జరిగింది. హమాలీ వర్కర్స్, రైతుకూలీలు, మహిళలు పార్టీ, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సానుభూతిపరులు వందల సంఖ్యలో కామ్రేడ్ వేమన ఆదినారాయణ అంతిమయాత్రలో పాల్గొని జోహార్లు చెప్పారు.

మచిలీపట్నం ఆటో వర్కర్స్ యూనియన్ నాయకుడైన కామ్రేడ్ ఆదినారాయణకు కడసారి నివాళులు అర్పించారు. అంతిమయాత్రకు ముందుగా సిపిఐ (ఎం.ఎల్) నాయకులు కామ్రేడ్ జగన్ అధ్యక్షతన జరిగిన సంతాప సభలో వక్తలు కా॥ ఆదినారాయణ జీవితాన్ని, వ్యక్తిత్వాన్ని ఆ కామ్రేడ్‌తో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకొంటూ జోహార్లు చెప్పారు. ఆయన కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేశారు.

"కామ్రేడ్ ఆదినారాయణ శ్రామిక జనపక్ష పాతి" కా॥ గుర్రం విజయ్‌కుమార్ నివాళి

సమాజంలో ఆర్థిక అంతరాలు పెరిగిపోయి ప్రజల జీవన స్థితిగతులు నానాటికీ క్షీణిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో కష్టజీవుల కోసం, శ్రామికులకోసం కడదాకా అండగా నిలిచిన కామ్రేడ్ ఆదినారాయణ సంస్మరణ సభ 29.6.08 తేదీన మచిలీపట్నం రిటైర్డ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ హాలులో సిపిఐ (ఎం.ఎల్) జిల్లా నాయకులు, ఏపిఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి కా॥ యద్దనపూడి సోని అధ్యక్షతన జరిగింది. ముందుగా కా॥ ఆదినారాయణ చిత్రపటానికి కా॥ గుర్రం విజయ్‌కుమార్ పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. పలువురు పూలతో నివాళులర్పించారు. ఒక నిముషంపాటు సభ మౌనం పాటించింది. ఈ సభలో సిపిఐ (ఎం.ఎల్) రాష్ట్ర నాయకులు కామ్రేడ్ గుర్రం విజయ్‌కుమార్ ప్రసంగిస్తూ మొదటగా ఆ కామ్రేడ్ మృతికి సిపిఐ (ఎం.ఎల్) రాష్ట్ర కమిటి, ఏపిఎఫ్‌టియు రాష్ట్ర కార్యవర్గం తరుపున సంతాపం తెలియజేస్తూ విప్లవ జోహార్లు చెప్పారు. కామ్రేడ్ విజయకుమార్ మాట్లాడుతూ 'శ్రామిక జనుల కష్టంలో భాగస్వామి అవుతున్న కామ్రేడ్ వేమనఆదినారాయణ శ్రామికజన పక్షపాతి.ఏ కష్టం వచ్చినా, ఏ సమస్య వచ్చినా స్పందించే స్వభావం ఉంది. కామ్రేడ్ ఆదినారాయణ క్రమంగా సిపిఐ (ఎం.ఎల్) రాజకీయాలవైపు వచ్చారు. కడదాకా మార్క్సిస్టు-లెనినిస్టుగా ఆ కామ్రేడ్ ఉన్నాడు. సిద్ధాంత రాజకీయ విభేదాల్తో కమ్యూనిస్టులు మనుగడ సాగిస్తున్నారు. సమాజాన్ని మార్చాలని ఆ కామ్రేడ్ భావించాడు. పాలకులు దేశంలో ఆర్థిక, సామాజిక అంతరాలు విపరీతంగా పెరిగేందుకు వీలుగా విధానాలు అమలుచేస్తున్నారు. సంపన్నులకు, శ్రమజీవులకు అగాధాలు పెంచుతున్నారు. ఈ విధానాలు పాలకులు అవలంబించుతున్న కాలంలో నిరంతరం పాలకవర్గాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన సందర్భాలలో కామ్రేడ్ ఆదినారాయణ సాహచర్యం కోల్పోవడం బాధాకర అంశం. ఆ విచారాన్ని, ఆ దుఃఖాన్ని దిగమింగుకుంటూ కామ్రేడ్ ఆదినారాయణ ఏ శ్రామిక జనపక్షపాతిగా నిలబడ్డారో, ఆ విధంగా నిలిచేందుకు ప్రతిన బూనుదామని విప్లవోద్యమ నిర్మాణానికి బద్ధులమవుతా మని కామ్రేడ్ విజయ్‌కుమార్ తన ఉపన్యాసంలో ఉద్ఘాటించారు.

రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కా॥ కొప్పుల కోటయ్య మాట్లాడుతూ కామ్రేడ్ ఆదినారాయణ 68 సంవత్సరాలలో కూడా యువకునిలా అన్ని రంగాల ప్రజల సమస్యపై కదిలి పనిచేసారు. రైతుబజారు రైతుల సంక్షేమం వరకే పరిమితం కాక ఆటో వర్కర్స్, హమాలీ వర్కర్స్ యూనియన్లకు బాధ్యత వహిస్తూ అనేక ఉద్యమాల్లో పాల్గొని అండగా నిలబడ్డారని ఆ విధంగా రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) జిల్లా కార్యవర్గ సభ్యునిగా, ఏపిఎఫ్‌టియు రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా ఎదిగి అత్యంత క్రమశిక్షణతో, నిజాయితీగా తన బాధ్యతలను నిర్వర్తించారని, కేవలం పార్టీకి పరిచయం అయిన 10 సంవత్సరాల కాలంలోనే ఇంత ఎత్తు ఎదగడమంటే విప్లవ రాజకీయాలపట్ల, సిద్ధాంతాలపట్లా ఆ కామ్రేడ్‌కున్న విశ్వాసం, అంకితభావం వ్యక్తం అవుతోందని" అన్నారు. సిపిఐ (ఎం.ఎల్) జిల్లా కార్యదర్శి కా॥ ముప్పాళ్ళ భార్గవశ్రీ ప్రసంగిస్తూ "ఆదినారాయణ పీడిత ప్రజల్లో తలలో నాలుకలా జీవించాడనేందుకు ఆయన మృతి చెందినరోజున అన్ని రంగాల ప్రజలు వందలాదిగా హాజరయిన తీరు, వారి ఆవేదనను గమనిస్తే అర్థమవుతుంది. కమ్యూనిస్టు విలువలు, అనుబంధాన్ని అలవర్చుకోడాన్ని కామ్రేడ్ వేమన ఆదినారాయణ నుండి మనం నేర్చుకోవాలని" అన్నారు.

సభకు అధ్యక్షత వహించిన కా॥ యద్దనపూడి సోని ప్రసంగిస్తూ "1998లో పార్టీకి పరిచయం అయిన ఆదినారాయణ ఆనాటి నుండి నేటి వరకు జరిగిన ఆయిల్ ధరల పెరుగుదలపై జరిగిన బంద్ వరకు పాల్గొనని ఆందోళనలు గాని, ఉద్యమాలు గాని లేవంటే అతిశయోక్తి కాదని అన్నారు. ప్రజలకోసం నిలబడినందుకు పోలీసులు ఆయనపై మూడు అక్రమకేసులు బనాయించారు. అయినా తుదిశ్వాస వరకు ప్రజల కొరకే పరితపించాడు, వారి కోసమే నిలబడ్డాడనేందుకు నిదర్శనమేమిటంటే, ఆయన జీవిత చరమాంకంలో గుండెపోటు వచ్చి ప్రభుత్వ ఆసుపత్రిలో చావుబ్రతుకుల మధ్య ఉండి కూడా రోగులు ఎదుర్కొంటున్న వైద్య సమస్య, డాక్టర్ల నిర్లక్ష్యం, అశుభ్రత పట్ల ఎంతో ఆవేదన చెంది మీడియా ద్వారా ఎండగట్టాడు. కడదాకా కమ్యూనిస్టుగా నిలబడ్డ ఆ కామ్రేడ్స్‌కు విప్లవ జోహార్లు చెప్పారు. సి.పి.ఐ. బందరు ఏరియా కార్యదర్శి కా॥ దేవభక్తుని నిర్మల, సి.పి.ఎం. మచిలీపట్నం పట్టణ కార్యదర్శి కా॥ కొడాలి శర్మ, ముస్లిం మైనారిటీ నాయకులు అబ్దుల్‌మతిన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాచాకుల లక్ష్మయ్య, దళితసేన నాయకులు అంబేద్కర్, బందరు పట్టణ పరిరక్షణ సంస్థ కన్వీనర్ బి.సత్యనారాయణసింగ్, ఏపిఎఫ్‌టియు పట్టణ కార్యదర్శి కా॥ శీరంశెట్టి లక్ష్మణరావు, ఎన్‌వైఎస్ జిల్లా కార్యదర్శి కా॥ ముచ్చు సుధాకర్, రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) జిల్లా కార్యవర్గ సభ్యులు కా॥ పామర్తి అంజమ్మ, జె.జగన్, ఓపిడిఆర్ జిల్లా కార్యదర్శి కా॥ కె.ఏసు, పౌరసమితి ఉపాధ్యక్షులు చలమలశెట్టి రామాంజనేయులు, నడకుదిటి అజయ్, సిటి బస్ యజమానుల సంక్షేమ సంఘం నాయకులు దాసు కామేశ్వరరావు, కా॥ ఆదినారాయణ మేనల్లుడు వేంపాటి కోటేశ్వరరావులు, కా॥ ఆదినారాయణ ఆదర్శవంతమైన కృషిని, ఆయనతో ఉన్న అనుబంధాన్ని, సాన్నిహిత్యాన్ని తెలియజేశారు. ప్రజా కళాకారులు సంస్మరణ సభలో పాడిన అమరవీరుల, ఎర్రజెండా పాటలు సభికులను ఉత్తేజపర్చాయి. సభలో కార్మికులు, కూలీలు, పేదలు, మహిళలు 300 మంది దాకా పాల్గొన్నారు. ◈

ఫ్యాబ్రిక్ డైయింగ్ యూనిట్‌ను వ్యతిరేకిస్తూ ధర్నా

రేపల్లె, 8.7.08:

గుంటూరుజిల్లా చెరుకుపల్లి మండలం, కుంచాల వారిపాలెం పంచాయతీ పరిధిలో జయవెంకటరమణ ఇండస్ట్రీస్‌వారు నెలకొల్పే ఫ్యాబ్రిక్ డైయింగ్ యూనిట్‌ని వ్యతిరేకిస్తూ 'రైతుబాంధవ అభ్యుదయ కమిటి' ఆధ్వర్యంలో పిట్టలవానిపాలెం మండల ప్రజలు, నిజాంపట్నం మండల ప్రజలు పిట్టలవానిపాలెం సెంటర్‌లో 1000 మందితో ధర్నా కార్యక్రమం నిర్వహించారు.

ఈ ధర్నాలో రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) జిల్లా నాయకులు ఎం.శోభ మాట్లాడుతూ ఫ్యాబ్రిక్ డైయింగ్ యూనిట్ ఉపయోగించే రసాయన పదార్థాలు వలన చుట్టుప్రక్కల వాతావరణం కాలుష్యమై ప్రజలు అనేక రోగాలబారిన పడతారన్నారు. ఈ యూనిట్ రోజుకి 3 కోట్ల లీటర్లు నీటిని ఉపయోగిస్తారని చెపుతూ వ్యర్థ పదార్థం రూపంలో ఈ నీరంతా పైపులైను ద్వారా నిజాంపట్నం తుంగభద్ర డ్రెయిన్‌లో కలుపుటకు ప్రభుత్వం ఆమోదం తెల్పటాన్ని వ్యతిరేకంగా నిరసించారు. దీని ఫలితంగా జలకాలుష్యం ఏర్పడి వ్యవసాయ భూములకు సాగునీరు కొరత, పిట్టలవానిపాలెం, నగరం, నిజాంపట్నం మండల ప్రజలకు త్రాగునీరు కొరత ఏర్పడటమే కాకుండా ఈ కాలుష్యమంతా సముద్రంలో కలవడం వలన మత్స్య సంపదకు నష్టం వాటిల్లుతుందనీ, వ్యవసాయభూములు బీడు భూములుగా మారి ఆహార ధాన్యాల కొరత కూడా ఏర్పడుతుందనీ వివరించారు. పాలకులు ఒక ప్రక్క వ్యవసాయాభివృద్ధే ధ్యేయంగా ప్రకటనలు గుప్పిస్తూ రెండోవైపు భూములను బీడు భూములుగా మార్చే ఇలాంటి పరిశ్రమలకి అనుమతి ఇవ్వటం అంటే ప్రజల్ని బికార్లుగా మార్చటమేనని, ఫ్యాబ్రిక్ డైయింగ్ యూనిట్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ సాగుతున్న ఉద్యమానికి రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) సంఘీభావాన్ని ప్రకటిస్తూ కామ్రేడ్ శోభ ముగించారు. కొల్లాటి నాగరాజు ఓపిడిఆర్ జిల్లా కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ఇతర దేశాలలోని ప్రమాదకర పరిశ్రమలను తీసుకువచ్చి ఇక్కడ నెలకొల్పాలనే ప్రతిపాదనను విరమించాలని పాలకులను హెచ్చరించారు.

బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజి లెక్చరర్ సాయిబాబు, ఓపిడిఆర్ నాయకులు ఎం.ఈశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ, ఏపిసిఎల్‌సి నరసింహారావు, బోటు ఓనర్స్ ప్రెసిడెంట్ మోపిదేవి శ్రీనివాసరావు, నిజాంపట్నం మాజీ సర్పంచ్ కన్నా నరసింహారావు, కొక్కిలగడ్డ సాంబశివరావు ఫ్యాబ్రిక్ యూనిట్‌ను వ్యతిరేకిస్తూ మాట్లాడారు.

చివరిగా డి.ఆర్.డి.ఏ. రిటైర్డ్ ఆఫీసర్ సత్యన్నారాయణరాజు మాట్లాడుతూ హైదరాబాద్ ఏరియాలోని సిరీస్, రెడ్డి ల్యాబ్ రసాయన పరిశ్రమలు లాంటివి మేడ్చెల్, మియాపూర్, జీడిమెట్ల ఏరియాలలో వున్నాయనీ, వాటి వ్యర్థ పదార్థాలను భూమిలోనికి వదులుతున్నారనీ, ఆ ప్రాంతంలో 700 మీటర్ల లోతు వరకు ఎర్రటినీళ్ళు వస్తున్నాయనీ అన్నారు. కంపెనీల వారు మలినాలను శుద్ధి చేస్తామని చెబుతారు కాని ఎక్కడా శుద్ధి చేసిన దాఖలాలు లేవని, అందువలన ఈ ఫ్యాబ్రిక్ డైయింగ్ యూనిట్‌కు వ్యతిరేకంగా చివరికంటా నిలవాలన్నారు. ఆ తర్వాత ఊరేగింపుగా వెళ్ళి పిట్టలవాని పాలెం ఎం.ఆర్.ఓ.కి మెమోరాండం సమర్పించారు.

కామ్రేడ్ ద్వారం వెంకారెడ్డి వర్ధంతి సభ

కొత్తపట్నం, 6.7.08:

సిపిఐ (ఎం.ఎల్) కొత్తపట్నం మండలశాఖ ఆధ్వర్యంలో కా॥ ద్వారం వెంకారెడ్డి ప్రథమ వర్ధంతి సభ వలసపాలెంలో రైతుకూలీ సంఘం స్థానిక నాయకులు కా॥ దోనె వెంకటేశ్వర్లు అధ్యక్షతన 6.7.2008 సాయంత్రం 6 గంటలకు జరిగింది. సభకు ముందుగా సిపిఐ (ఎం.ఎల్) జిల్లా కార్యదర్శి కా॥ డివిఎన్.స్వామి, కా॥ వెంకారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. తరువాత కుటుంబసభ్యులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు జోహార్లు చెప్పారు.

సభలో సిపిఐ (ఎం.ఎల్) జిల్లా కార్యదర్శి కా॥ డివిఎన్.స్వామి మాట్లాడుతూ కా॥ వెంకారెడ్డి నిరుపేద కుటుంబంలో జన్మించి, చిన్నతనంలోనే రైతుల ఇండ్లలో జీతగానిగా పనిచేశాడని, స్వతంత్ర భావాలు కలిగిన వెంకారెడ్డి కౌలుకి పొలము తీసుకొని, టైరుబండి బాడుగకు తోలుకుంటూ జీవనం సాగిస్తూ, స్వతంత్ర సాగుదారుడుగా ఎదిగాడని అన్నారు. వెంకారెడ్డి చిన్నప్పటి నుండి మిలిటెన్సీగా వుండేవాడని, కమ్యూనిస్టు ఉద్యమం లోకి వచ్చిన తరువాత చదవటం నేర్చుకున్నాడని, పార్టీ ఆదేశాలను అమలుపరుస్తూ రైతుకూలీ సంఘం జిల్లా కోశాధికారిగా ఎదిగాడని అన్నారు. ప్రస్తుత పరిస్థితిని వివరిస్తూ, తీర ప్రాంతంపై విదేశీ, స్వదేశీ గుత్తసంస్థల కళ్ళుపడ్డాయని, మన పాలకులు సెజ్‌లు, పారిశ్రామిక కారిడార్‌ల పేరుతో వేలాది ఎకరాల తీరప్రాంత భూములన్ను పెట్టుబడిదారులకు కట్టబెడుతున్నారని అన్నారు. దీంతో మనం మన జీవనాధారాలను కోల్పోతామని, మన పంటభూములు బీళ్ళుగా మారతాయని, సముద్ర సంపద అంతరించిపోతుందని, ఈ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా బలమైన ఐక్య ఆందోళనలు, ఉద్యమాలు నిర్మించటమే కా॥ వెంకారెడ్డికి మనమిచ్చే ఘనమైన నివాళి అన్నారు.

రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కా॥ ఉల్లిగడ్డల వాసేశ్వరరావు మాట్లాడుతూ దున్నేవానికే భూమి దక్కాలని కా॥ వెంకారెడ్డి పోరాడాడని, ఆ కర్తవ్యం నెరవేర్చడమే మనం ఆయనకిచ్చే నివాళి అని అన్నారు. రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి కా॥ ఎస్.లలితకుమారి మాట్లాడుతూ పేదలకు ఇళ్ళు వేయించడంలోను, దేవుడుమాన్యం, పోరంబోకు భూపోరాటాలలో ముందున్నాడని, కా॥ వెంకారెడ్డి మరణం ఈ ప్రాంత ఉద్యమాలకు తీరని లోటు అని, పీడిత, ప్రజా ఉద్యమాలను మరింత ముందుకు తీసుకుపోవటమే మనం ఆయనకిచ్చే నివాళి అంటూ ముగించారు.

ఏపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఐ.విజయసారధి 'ఉపాధ్యాయ' ఉద్యమాలకు ఆయన అందించిన తోడ్పాటును, ప్రజా ఉద్యమాల ఎడల ఆయన నిబద్ధతను వివరించారు. అరుణోదయ నాయకులు పి.గోవిందరావు కా॥ వెంకారెడ్డితో గత 25 సంవత్సరాలుగా విద్యార్థి దశ నుండి గల అనుబంధాన్ని, విద్యార్థి ఉద్యమానికి ఆయన అందించిన సహకారాన్ని వివరించారు. యింకా ఈ సభలో జనసాహితి నాయకులు డా॥ జి.వి.క్రిష్ణయ్య, రైతుకూలీ సంఘం నాయకులు వి.శ్రీరాములు మాట్లాడారు.

సభకు ముందు బాలకళాకారుల కోలాటం, పాటలను ప్రజలను ఆకట్టుకున్నాయి. ◈

జీవించే ... (12వ పేజీ తరువాయి)

ఎవరికోసం? ఈ ప్రాంత ప్రజల అవసరాలు తీర్చడానికి ఉపయోగపడతాయా? లేదా యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తాయా? లేదు. ఎందుకంటే గతంలో నిర్మించిన పరిశ్రమలలో ఉద్యోగ అవకాశాలు కల్పించిన పరిస్థితి లేదు.

ప్రజలకు ఉపయోగపడని మన జీవితాలను కాలుష్య కోరలకు బలిచేసే ఇటువంటి పరిశ్రమల వలన పెద్ద పెద్ద బడా పెట్టుబడిదారులకు, వారి వెనుకనున్న సామ్రాజ్యవాద కంపెనీలకు మాత్రమే లాభాలు, ప్రయోజనం కలుగుతాయి. కనుక ప్రజలారా సహజ ఆర్థిక, మానవ వనరులను పారిశ్రామికవేత్తల పరంచేసి రైతు జీవితాలను కారుచీకట్లలోకి నెట్టివేసే ఇలాంటి పరిశ్రమలకు అనుమతి నిచ్చిన పాలకుల విధానాలను త్రిప్పి కొట్టవలసినదిగా ప్రజలకు, ప్రజాతంత్రవాదులకు, మేధావులకు విజ్ఞప్తి చేస్తున్నాం. మన జీవితాలను ఛిద్రం చేసే ఈ ఫ్యాబ్రిక్ ప్రాసెసింగ్ యూనిట్‌ను అందరం వ్యతిరేకించి మన వ్యవసాయ భూములను, సముద్ర సంపదను కాపాడుకుందాం. ◈

'పత్రికా స్వేచ్ఛ-సమాజం-రాజ్యం'పై గోష్టి

'పత్రికా స్వేచ్ఛ-సమాజం-రాజ్యం'పై **గోష్టి** కార్యక్రమం 2.7.08 సాయంత్రం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో ఓపిడిఆర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సి.భాస్కరరావు **అధ్యక్షతన జరిగింది.** కా॥ భాస్కరరావు తన అధ్యక్షోపన్యాసంలో మొదటగా ఆంధ్రజ్యోతి దినపత్రికలో మే 26న 'బాడుగ నేతలు' శీర్షికన కథనం రావడం అభ్యంతరకరంగా భావిస్తున్నామన్నారు. దళితులపై, స్త్రీలపై అనునిత్యం దాడులు జరుగుతున్నా, నామమాత్రంగా మాత్రమే ప్రభుత్వ, పోలీసు యంత్రాంగం ఎస్.సి., ఎస్.టి. అత్యాచార నిరోధక చట్టాన్ని ఉపయోగించి కేసులు పెడ్తున్నదంటూ, ఆంధ్రజ్యోతి సంపాదకుడు, జర్నలిస్టులపై ఆ కేసును అత్యవసరంగా ప్రయోగించి అరెస్టులు సాగించటానికి అత్యుత్సాహం చూపటంలోని ఆంతర్యమేమిటని సిబిఆర్ ప్రశ్నించారు.

కృష్ణమాదిగ నాయకత్వంలోని దళిత ఉద్యమాన్ని గురించి ప్రస్తావిస్తూ అధికారంలో వుండేవారికి దగ్గరగా వుండే వైఖరులను సమీక్షించుకోవలసిందిగా విజ్ఞప్తి చేశారు. సెజ్‌ల రూపంలోనూ, నూతన ఆర్థిక విధానాల రూపంలోనూ ప్రజానీకాన్ని దోచుకుంటున్న నేతలను అంతర్జాతీయ బాడుగ **నేతలు అని ఈ దినపత్రికలు** రాయగలవా అని **ప్రశ్నించారు. మేమూగా ఒక 'ఉన్నత'** స్థాయి నాయకుడిపై నిర్దిష్ట **ఆరోపణలు** చేస్తే, ఆ నాయకుడిని వివరణ అడిగి తెలుసుకొని **మరీ ప్రచురిస్తా**మంటున్నారు. ఇదే ప్రమాణాలు **అన్ని సందర్భాల్లోనూ** పాటింపబడుతున్నాయా? ఒక వ్యక్తినో, **నాయకుణ్ణో**, సమూహాన్నో, వ్యాఖ్యానంచేస్తూ మొదటి **పేజీలో కథనం** వెలువడిన తర్వాత సంబంధిత సెక్షన్ల **నుండి** తప్పనిసరిగా ప్రతి చర్య వుంటుందని కామ్రేడ్ సిబిఆర్ చెబుతూ, పత్రికల్లో పనిచేస్తున్న ప్రజాస్వామిక జర్నలిస్టులు, ప్రజాసంఘాలు, ప్రజా ఉద్యమాలు ఐక్యంగా సాగుతూ, ముసుగుదాడులను ఖండించాలని, పత్రికా యాజమాన్య ముఠా ప్రయోజనాలపట్ల మెలకువతో ఉండాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

ఆచార్య నాగార్జున యూనివర్శిటీ ప్రొఫెసర్ అంజయ్య మాట్లాడుతూ-ఆంధ్రజ్యోతిపై దాడి అప్రజాస్వామికమని మేమొక ప్రకటనచేస్తూ పత్రికా యాజమాన్యాలు ఇలాంటి (బాడుగ నేతలు) కథనాలు ప్రచురించేటప్పుడు సంయమనం పాటించాలని కోరామన్నారు. పత్రికా స్వేచ్ఛ అఖండమైనది కాదు. 2000 సంవత్సరంలో ఆంధ్రజ్యోతి వార పత్రికపై **'రావణజోస్యం' సీరియల్ కథను నిరసిస్తూ ఆర్.ఎస్.ఎస్. వాళ్ళు దాడిచేస్తే, దీని గురించి ఆంధ్రజ్యోతి యాజమాన్యం నోరు మెదపలేదెందుకని'** అని అంజయ్య ప్రశ్నించారు.

రాజ్యం-ప్రత్యక్షంగాకానీ, పరోక్షంగాగానీ ప్రజల హక్కులను కాలరాస్తున్నపుడు పత్రికా యాజమాన్యాల వైఖరి ఏమిటి? 1991లో నూతన ఆర్థిక విధానాలు ప్రారంభమైననాడు రాజ్యాన్ని నడిపే అధికార పార్టీల వైఖరికి, పత్రికా విధానాలకు తేడా ఏమీలేకపోగా రాజ్యం తీసుకునే ప్రధాన వైఖరులను సమర్థించేవిగా పత్రికా యాజమాన్యాలున్నాయని అంజయ్య వ్యాఖ్యానించారు.

'వార్త' విజయవాడ బ్యూరో చీఫ్ కంచర్ల జయరాజ్ మాట్లాడుతూ, జర్నలిస్టులకు పరిమితులున్నాయన్నారు. మీడియా దుర్వినియోగం అవుతున్న పరిస్థితి వాస్తవమేనన్నారు. గ్రామీణ సమస్యలు, అట్టడుగువర్గాల సమస్యలు మీడియా కవర్ చేయలేకపోతున్నదని, సమతూకంతో రిపోర్టు చేయటమనేది కొందరు చేయలేకపోతున్నారని, ప్రజలపక్షాన నిలిచి,, పోరాడే సంఘాలకు, ఉద్యమాలకు మీడియాతో దగ్గర సంబంధాలు ఉండాలని, ఈ ప్రజా కార్యక్రమాల గురించి జర్నలిస్టులను విజ్ఞానవంతం చేయాలని జయరాజ్ కోరారు.

జనవిజ్ఞాన వేదిక నాయకులు రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ రాజ్యం యొక్క లక్షణాలే చట్టంలో ప్రతిఫలించినట్లుగా, పత్రికా యాజమాన్యాల్లోనూ ప్రతిఫలిస్తాయని పేర్కొన్నారు. పత్రికా యాజమాన్యం గీసిన గీత దాటి వార్త బయటకు రాదన్నారు. ఆంధ్రజ్యోతిని, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితిని ఎగేసిన పాత్ర వై.ఎస్.రాజశేఖరరెడ్డి పాత్ర అనీ, ఎంఆర్‌పిఎస్ ఉద్యమం ప్రక్కదోవ పట్టాలనేది వైఎస్ఆర్ భావన అనీ, ఆంధ్రజ్యోతిని బెదిరింపు చర్యలు చేయాలని, బహుముఖ పథకాలతో వై.యస్.రాజశేఖరరెడ్డి అనుసరిస్తున్నాడనీ రామ్‌ప్రసాద్ చెప్పారు.

జనసాహితి ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ దివికుమార్ మాట్లాడుతూ, దళిత ఉద్యమాలా? ప్రజాస్వామ్య హక్కులు కావాలా అంటే రెండూ అవసరమేనని అన్నారు. 'దళితులు ఇప్పటి వరకు ఒక వర్గానికి బాడుగకు వున్నారు. ఇప్పుడు ఈ వర్గాన్ని కాదని వేరొక వర్గానికి బాడుగకు వెళ్తున్నారనే' అర్థం 'బాడుగు నేతలు' కథనంలో **స్ఫురిస్తుందని కోటాను కోట్లు గడించుకోవటానికి పోటీలు** పడ్తున్న పాలక గ్రూపులు యొక్క వ్యాపార, వాణిజ్య, ముఠా ప్రయోజనాలు దీనిలో ముడిపడి వున్నాయని చెప్పారు. 50 వ దశకంలోనే ఆనాటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ పత్రికా స్వేచ్ఛ అంటే యజమానులస్వేచ్ఛా? లేక పాత్రికేయుల స్వేచ్ఛా అని ప్రశ్నించారని గుర్తుచేశారు. మహిళలను కించపరిచే, అసభ్య ముఖచిత్రాలను వేయను అని ఏ సంపాదకుడైనా ఎదురు తిరగగల్గుతాడా అంటూ ప్రశ్నించారు. గతంలో ఆంధ్రజ్యోతి వార పత్రికలో 'కామోత్సవ్' అనే అశ్లీల నవల ప్రచురింపబడితే, దానిని విమర్శిస్తూ కొత్తపల్లి రవిబాబు, ఈదర గోపీచంద్‌లు ఉత్తరాలు రాసినందుకుగానూ ఆ వార పత్రిక వీరిపై లక్ష రూపాయల పరువు నష్టం దావావేసి 5, 6 సంవత్సరాలు కోర్టుల చుట్టూ తిప్పారని గుర్తుచేస్తూ ఈ విధమైన పత్రికల స్వేచ్ఛను మనం వ్యతిరేకించాలి. సామాజిక సత్య శోధనా స్వేచ్ఛనివ్వాలన్నారు.

2000 జనవరి 25న ఇనగంటి వెంకట్రావు జ్యోతి దినపత్రిక సంపాదకుడిగా వున్న కాలంలో సంఘపరివార శక్తులు పత్రిక కార్యాలయంపై దాడిచేస్తే కనీసం నోరు మెదపలేదు. పోలీస్ కంప్లైంట్ ఇవ్వలేదు. ఆశ్చర్యకరంగా హైద్రాబాద్ నుండి వచ్చే ఏ పత్రికా ఈ విషయాన్ని ప్రచురించలేదు. జనసాహితి ఈ దాడిని ఖండించింది. **విజయవాడ** నుండి వెలువడే తమ మాసపత్రిక **'ప్రజాసాహితి'** పత్రికలో దీని గురించి రాసిందనే **విషయాన్ని గుర్తుచేస్తూ** ప్రస్తుత సందర్భంలో ఇనగంటి **వెంకట్రావు** రాస్తున్న కథనాలలో-ఆంధ్రజ్యోతిపై **మందకృష్ణ వర్గీయులదే** ప్రథమ దాడి అని రాయటం **చరిత్ర వక్రీకరణగా దివికుమార్** పేర్కొన్నారు. దళిత **ఉద్యమకారులు, పాత్రికేయులు** భావోద్వేగాలకు **గురవకుండా చర్చల** ద్వారా ప్రస్తుత సమస్యను **పరిష్కరించుకోవలసిందిగా** విజ్ఞప్తి **చేస్తూ** ముగించారు.

20 ఏళ్ళుగా **పత్రికా రంగంలో** పనిచేస్తున్న మరో పాత్రికేయుడు **గోపి మాట్లాడుతూ** పత్రికా స్వేచ్ఛకు రాజ్యం నుండి పెద్దగా **ప్రమాదం** ఏర్పడుతుందని తాను భావించటంలేదన్నారు. ఎందుకంటే **మధ్యలో** కాపు గాయటానికి సమాజం ఉందనే భరోసా వ్యక్తం చేశారు. అయితే, సమాజాన్ని మర్చిపోయి పత్రికలు రాజ్యం దగ్గరకు జరుగుతున్న సందర్భంలోనే సమస్యలు ఏర్పడుతున్నాయని, యాజమాన్యం వెనుక ఉండి సంపాదకుల ద్వారా చేయించిన చర్యల ద్వారానే రాజ్యవ్యతిరేకతకు గురౌతున్నారన్నారు. ప్రజాసంఘాలు అన్నీ కలసి రెండువైపుల వారిని దగ్గరకు చేర్చి చర్చించటం ద్వారా ఘర్షణను తగ్గించేందుకు అవకాశం ఉండేదని **గోపి** అభిప్రాయపడ్డారు.

రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) రాష్ట్ర అధ్యక్షురాలు కా॥ ఝాన్సీ సమర్పించిన పత్రంలో:

'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో 'బాడుగ నేతలు' అనే కథనం వ్రాయటం సరైందా? కాదా?. మందకృష్ణ అనుచరులు 'ఆంధ్రజ్యోతి' కార్యాలయంపై దాడి చేయటాన్ని సమర్థిస్తారా? వ్యతిరేకిస్తారా?; 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్‌పై ఎస్.సి., ఎస్.టి. అత్యాచార నిరోధక చట్టం క్రింద కేసు బనాయించటం సరైనదా? కాదా?; 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్‌ను, మరికొందరు సిబ్బందిని పోలీసులు అర్ధరాత్రి అరెస్టులు చేయటం న్యాయసమ్మతం అవునా? కాదా? అనే విధంగా ఒక్కో అంశాన్ని విడదీసి, ముక్కకు ముక్కగా, సమర్థనో, ఖండనో సాగిస్తున్న పరిస్థితి రాష్ట్రంలో కొనసాగుతున్నది. ప్రజలకోణంలో, ప్రజల ప్రజాస్వామిక హక్కుల కోణంలో సమగ్రమైన, ఉద్వేగ రహితమైన ఆలోచన, విశ్లేషణ కొరవగా వుండి, ఎటో ఒకవైపు తేల్చి చెప్పమనే తీరు, ఆందోళన కలిగించేదిగా వుందని అభిప్రాయపడ్డారు.

సమాజంలో అణగారిన సమూహాలుగా వున్న దళితుల హక్కుల కోసం పోరాడే సంఘాలు ఒక వైపున; ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షల్ని ప్రతిబింబించాల్సిన పత్రికలు మరోవైపున- మోహరించి, పరస్పర దూషణలు, కేసులు, దాడులు సాగించడం వలన నష్టపోతున్నదెవరు?, తగాయిదా వలన లబ్ధి పొందుతున్నదెవరనే విషయం సమాజహితం కోరుకునేవారికి తేలిగ్గానే అర్థమౌతుంది. ప్రస్తుత సందర్భంలో -ప్రజాస్వామిక ప్రవాహాలుగా సాగాల్సినవి రెండూ, శత్రుపూరితంగా సంఘర్షణ పడటమనేది దోపిడీ రాజ్యాంగ యంత్రానికీ, ప్రభుత్వాల ప్రయోజనాలకీ తోడ్పడుతుందనే ప్రధానమైన అంశాన్ని ప్రజలు, ప్రజాస్వామికవాదులు, ప్రజా ఉద్యమ నాయకులు, పత్రికా సిబ్బంది, సంపాదకులు- పరిగణన లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో మే 26న 'బాడుగ **నేతలు' పేరిట అన్యాపదేశంగా** రాసిన కథనం పత్రికా విలువలను కాపాడేదిగా లేదనీ,

దీనికి ప్రతిగా - 'ఆంధ్రజ్యోతి' తన కథనాన్ని వెనక్కు తీసుకొనే వైపుగా, ప్రజాస్వామిక, దళిత, హక్కుల సంఘాలను, కూడగట్టుకొని చేయవలసిన కార్యక్రమాల స్థానంలో - 'ఆంధ్రజ్యోతి' కార్యాలయంపై మందకృష్ణ వర్గీయులు దాడి చేయటాన్ని విజ్ఞత కలిగిన చర్యకాదనీ అన్నారు.

పత్రికలకు పెట్టుబడిపెట్టే యాజమాన్యాన్ని, పత్రికా సిబ్బందిని మేము వేరుచేసి చూడాలని భావిస్తున్నాం. పత్రికల యాజమాన్యాలు పత్రికా స్వేచ్ఛ గురించి మాట్లాడుతూనే, తమ పత్రికా సిబ్బందికి కనీసపాటి స్వేచ్ఛ లేకుండా, సంఘటితపడనీయకుండా చేయటం, హక్కుల గురించి ప్రశ్నించిన వారిని అణచివేయటం వాస్తవం కాదా? దేశంలో, రాష్ట్రంలో ప్రజల ప్రజాస్వామిక హక్కులు కాలరాయబడుతుంటే, నల్లచట్టాలు రాజ్య మేలుతుంటే పత్రికల గొంతెందుకు పెగలటం లేదు? ప్రజల ప్రజాస్వామిక, సామూహిక ఉద్యమాలకంటే సంచలనాత్మక, వ్యాపారాత్మక అంశాలకే పత్రికా యాజమాన్యాలు ప్రాధాన్యతనిస్తున్నారనే విషయం, ప్రజల ప్రయోజనాన్ని పత్రికా యాజమాన్యాలు **ఉద్దేశపూర్వకంగా** గాలికొదిలివేస్తున్నాయనే విషయం **వాస్తవం కాదా? గత ఆరు దశాబ్దాల** 'స్వతంత్ర' పాలనలో **అధికారంలోకి** వచ్చిన **పాలకులెవరైనా** సరే, దేశాన్ని క్రమంగా **తాకట్టు పెట్టడమే** కాదు, సకల సంపదలను దోచుకుపోవటానికి **ఆమోదిస్తూ, సామ్రాజ్యవాదులకు** అమ్మివేస్తున్నారనే కఠోర వాస్తవం-పత్రికాధిపతులందరికీ తెలిసినా- ఈ నిజాన్ని తమ పత్రికల్లో వెలుగుజూడ నియ్యకపోవటం, దీనిని పాలకుల అవినీతికి సంబంధించిన పై పై విషయంగా పరిమితంచేసి, 'మసిబూసి మారేడుకాయ' చేయటం- ఏ విధంగా ప్రజాపక్షం వహించటమౌతుందని ప్రశ్నించారు.

ఆయా పత్రికాఫీసులపై దాడులు జరిగిన **సందర్భంలోనో**, పోలీసులు పత్రికా సిబ్బందిని అరెస్టులు సాగించిన సందర్భంలోనో -ఆయా పత్రికా యాజమాన్యాల ఆసక్తుల మేరకు సిబ్బంది యావత్తు ఈ చర్యలను ఎలుగెత్తి ముక్తకంఠంతో ఖండించినప్పటికీ, ఇంతకు మరెన్నోరెట్లు దారుణాలు, నిర్బంధాలూ సాగుతున్నా ఈ విధమైన స్పందన కొరవడటానికి కారణాలేమిటో పత్రికా సిబ్బంది పరిశీలించుకోవాలి. తమ పత్రికా ప్రపంచంలో హక్కుల సాధనకోసం, బయట ప్రపంచంలో ప్రజాస్వామికహక్కుల సాధనకోసం విలేకరులు, సిబ్బంది, మీడియా ప్రతినిధులందరూ సంఘటితపడాలని ఆకాంక్షించారు.

సమాజంలో పీడిత కులాల హక్కుల సాధనకోసం కృషిచేసే సంఘాలు, ఉద్యమాలు ఏవైనా- **పీడితుల్ని**, విభజించి పాలించే దోపిడీవర్గాలపట్ల స్పష్టమైన అంచనా కలిగి వుండాలి. మొత్తంగా, అగ్రకుల భూస్వామ్య, దోపిడీవర్గ వ్యతిరేక ప్రవాహాల్లో భాగంగా ఈ ఉద్యమాలు సాగాలి. దోపిడీవర్గ వ్యతిరేక పోరాట సంఘాలతో, పార్టీలతో, సంస్థలతో సన్నిహిత సంబంధాలను కలిగి వుండాలి. ఈ విధమైన స్పష్టతతో ఒక వైఖరిని కలిగి వుండకపోతే, నిజాయితీగా ఉద్యమాలు నిర్మించినా, సమస్యలు పరిష్కరించబడకపోగా, పాలకులు తమ చేతిలో మనల్నే ఒక ఆయుధంగా మార్చి, 'మనకంటిని మన వేలితోనే పొడుస్తా'రనే విషయాన్ని కూడా స్పష్టంగా గుర్తించాలన్నారు.

నేటి సమాజంలో 'ప్రజాస్వామ్యం'-'నేతిబీరలో నేయి' చందమేనని మా నిశ్చితాభిప్రాయం. మన అనుభవాలూ, దానినే రుజువు చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రజాస్వామికహక్కుల కోసం నిలిచే సమూహాలు శత్రుపూరితంగా కలహించుకోవటం- ప్రభుత్వాల దోపిడీవర్గ ప్రయోజనాలకే తోడ్పడుతుందని గమనించుకొని, 'ఆంధ్రజ్యోతి' సంపాదకులు, పత్రికా సిబ్బంది; కృష్ణమాదిగ, దళిత సంఘాల ప్రతినిధులు- సిబిసిఐడి దర్యాప్తులు, పోలీసు దర్యాప్తుల ద్వారానోకాక పౌర, ప్రజాస్వామికహక్కుల సంఘాల ప్రతినిధుల, ప్రజాస్వామికవాదుల సమక్షంలో, సంయమనంతో ప్రతిష్టకు పోకుండా చర్చించుకోవటం ద్వారా ఈ సమస్య మరింత ముందుకు సాగకుండా పరిష్కరించు కోగలుగుతారని, ఒక మంచి సాంప్రదాయాన్ని నెలకొల్పిన వారౌతారని భావిస్తున్నాం. దళితుల హక్కులను, పత్రికా స్వేచ్ఛను కాలరాస్తున్న; పీడిత ప్రజా సమూహాలను విభజించి పాలిస్తున్న నిరంకుశ దోపిడీ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా సమైక్యంగా పోరాడాలని విజ్ఞప్తి చేశారు. ◈

శ్రీకాకుళ... (12వ పేజీ తరువాయి)

అమెరికా యుద్ధానికి వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడుతున్న ఆ దేశ ప్రజలకు సంఘీభావంగా శ్రీకాకుళ గిరిజనులు వేలాది మంది ప్రదర్శన నిర్వహించారు. గిరిజన ప్రజల సంఘటిత శక్తిని చూసి ఓర్వలేని **దోపిడీశక్తులు ఆ ఉద్యమంపై ఉక్కుపాదం మోపి అణచడానికి** ప్రయత్నించిందన్నారు. **అంతటితో ఉద్యమాలు ఆగలేదన్నారు.** మరింత పదునెక్కుతున్నాయన్నారు.

పాలకవర్గ పార్టీలు ప్రజలను భ్రమల్లో వుంచడానికి భూసంస్కరణల చట్టం, 1/70 చట్టాల్ని చేశాయన్నారు. ఆచరణలో భూమిలేని పేదలకి, గిరిజనులకి భూమి ఇవ్వడానికి ఏ మాత్రం సిద్ధంగా లేవన్నది ఇన్నేళ్ళ అనుభవం ఋజువు చేస్తుందన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలో వున్నా ప్రజలు చైతన్యవంతం అయితే తప్ప భూమి సమస్య పరిష్కారం కాదన్నారు. తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటంలో ప్రజలు చైతన్యవంతమై లక్షలాది ఎకరాల భూముల్ని స్వాధీనం చేసుకోవడాన్ని గుర్తు చేశారు. ఆ దిశలో భూమికోసం పోరాటాల్ని ఎక్కుపెట్టాలన్నారు. ప్రత్యేక ఆర్థిక మండళ్ళ పేరుతో సామాన్య ప్రజానీకానికి జరిగే అన్యాయాల్ని ఎదిరించి పోరాడాలని, భారత-అమెరికా అణుఒప్పందం చాలా ప్రమాదకరమని అన్నారు. చేయడానికి పనిలేక బ్రతుకు దెరువుకై జిల్లాలోని అనేక ప్రాంతాల నుండి సుదూర ప్రాంతాలకి ప్రజలు వలసలు వెళ్ళి దుర్భరమైన జీవితాల్ని గడుపుతున్నారన్నారు. ప్రజలందరి సమస్యలు పరిష్కారం కావాలంటే శ్రీకాకుళ గిరిజనోద్యమ అమరవీరుల స్ఫూర్తితో భూస్వామ్య, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాల్ని తీవ్రతరం చేయాలని పిలుపునిస్తూ ముగించారు.

జనసాహితి రాష్ట్ర అధ్యక్షులు కా॥ ఛాయరాజ్ మాట్లాడుతూ ప్రపంచ చరిత్రలో శ్రీకాకుళ ఉద్యమం ప్రసిద్ధి చెందినదని-తెలంగాణా పోరాటం తర్వాత భూమి సమస్యను ముందుకు తెచ్చిన పోరాటం ఇదేనన్నారు. తిండికోసంగా ఈ 60 ఏళ్ళ తరువాత కూడా పోరాటం చేయాల్సిన అవసరం మిగిలే వుంది. ఈ ఉద్యమాలు ముందుకే సాగుతాయని, ఆ ఉద్యమాల్ని సాహితీ, **సాంస్కృతిక సంస్థలు** ఉత్తేజపరిచే బాధ్యతను చేపట్టాలని, ఆ కృషిలో జనసాహితి వుందని అన్నారు.

రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) విజయనగరంజిల్లా కార్యదర్శి కా॥ వర్మ మాట్లాడుతూ-బాక్సైట్ మైనింగ్ కోసం విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం ఏజెన్సీ ప్రాంతాల్లో పాలకుల కుట్రలు సాగుతున్నాయని, బహుళజాతి సంస్థలు ప్రవేశిస్తున్నాయన్నారు. అడవి నుండి గిరిజనులను దూరం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని, అందులో భాగంగానే సీతంపేట మండలంలో ఏనుగుల్ని పెంచడం పేరుతో గిరిజన గ్రామాల్ని ఖాళీ చేయడానికి చేస్తున్న ప్రయత్నాల్ని ప్రజలు త్రిప్పికొట్టారన్నారు.

ఏపిఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి కా॥ గణేష్‌పండా మాట్లాడుతూ- అందరికీ కూడు-గుడ్డ, నీడ, విద్యా, వైద్యం తదితర కనీస అవసరాల్ని కూడా ఈ పాలకవర్గ పార్టీలేవీ పరిష్కరించవని, ప్రజలు పోరాడి నూతన ప్రజాస్వామిక వ్యవస్థను నిర్మించుకున్నప్పుడే ప్రజలందరి సమస్యలు పరిష్కారమౌతాయన్నారు. ఈ పాలకులకి స్వతంత్రతలేదని, సామ్రాజ్యవాదులకి, స్వదేశీ పెట్టుబడిదారులకి దళారులుగా మారి దేశ సంపదను, ప్రజల శ్రమశక్తిని కారుచౌకగా కొల్లగొట్టడానికి అవకాశం కల్పిస్తున్నారని అన్నారు.

ఏపిటిఎఫ్ సీనియర్ నాయకులు కా॥ బి.అప్పయ్య మాట్లాడుతూ-పోరాటం చెయ్యందే మన బతుకులు బాగుపడవని, రైతులు, కూలీలు, కార్మికులు, మహిళలందరూ సంఘటితపడి పోరాటాలు చేయాలని చెప్పారు.

ఈ సభలో రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) జిల్లా అధ్యక్షులు అచ్చియ్య, జిల్లా నాయకులు వెంకటరమణలు మాట్లాడారు.

జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి, పట్టణంలోని వివిధ పేటల నుంచి 500 మంది రైతుకూలీలు, మహిళలు ఈ సభకు హాజరయ్యారు.

ప్రజా కళాకారులు తమ నృత్యాలతో, పోరాట పాటలతో ప్రజల్ని ఉత్తేజితుల్ని చేశారు. ◈

Janasakti (Communist Revolutionaries'Fortnightly) Printed Matter Book-Post RNI No.8315/63 H/VJ-077/2007-09

శ్రీకాకుళ గిరిజనోద్యమ అమరవీరుల స్ఫూర్తితో భూస్వామ్య-సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాల్ని తీవ్రతరం చేద్దాం!

ఉదయం పదకొండు గంటలు. నర్థావ ప్రాంతమంతా డప్పుల గుండె చప్పుళ్ళు-దోపిడీ, పీడనలు లేని సమసమాజంకోసం పోరాటాన్ని నినదిస్తున్నాయి. ఎర్రజెండా రెపరెపలు అమరుల ఆశయాల్ని సమున్నతంగా ఆవిష్కరిస్తున్నాయి.

గిరిజన-రైతాంగ-కార్మికవర్గ ఉద్యమాలు వర్ధిల్లాలని బిగిసిన పిడికిళ్ళు నింగికంటా ఎగబొడిచి వస్తున్నాయి. "ఓ అరుణ పతాకమా- చేగొనుమా రెడ్ శాల్యూట్, శ్రమజీవుల కేతనమా- చేగొనుమా రెడ్ శాల్యూట్" అంటూ పోరాట పాటల ఎగిసే కెరటాలు పొంగి వస్తున్నాయి.

"జోహార్! అమరవీరులకు!" అన్న నినాదాలు రేపటి ఉదయాల్ని మరింత వెలుతురుతో స్ఫురింపచేస్తున్నాయి.

"మీ రక్తం, మీ త్యాగం వృధా మేం కానీయం" అనే ఆశయాల కొనసాగింపు ఎరుపెక్కిన ఉదయంలా రెపరెపలాడుతోంది.

రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) శ్రీకాకుళం-విజయనగరంజిల్లా కమిటీల నాయకత్వంలో శ్రీకాకుళ గిరిజనోద్యమ అమరవీరులకు విప్లవ జోహార్లు చెబుతూ శ్రీకాకుళంలోని అమరవీరుల స్థూపం వద్ద సభ జరిగింది. ముందుగా అరుణ పతాకను రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ ఝాన్సీ ఆవిష్కరించారు. మిన్నంటిన నినాదాల మధ్య అమరవీరుల స్మారక స్థూపానికి జిల్లా కార్యదర్శి టి.అరుణ, ఏపిటిఎఫ్ సీనియర్ నాయకులు అప్పయ్య, ఏపిఎఫ్టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి గణేష్‌పండా, జనసాహితి రాష్ట్ర అధ్యక్షులు ఛాయరాజ్, రైతుకూలీ సంఘం నాయకులు వర్మ, అచ్చియ్య, రమణ, చెన్నాపురం, సత్యవరం, కోమర్తి, బావాజీపేట, పెద్దవీడు, ముద్దాడ, చౌదరి సత్యనారాయణ కాలనీ, కామాక్షమ్మ కాలనీల నాయకులు పుష్పగుచ్ఛాలు వుంచి శ్రద్ధాంజలి ఘటించారు.

> ***భూస్వామ్య, సామ్రాజ్యవాద దోపిడీ పీడనల రద్దు కొరకు, నూతన ప్రజాస్వామ్య వ్యవస్థ స్థాపన కొరకూ శ్రీకాకుళంజిల్లాలో అశువులర్పించిన కమ్యూనిస్టు అమరయోధుల స్మృతి చిహ్నంగా 1998లో స్థూపనిర్మాణం జరిగింది. వందలాది గిరిజన కార్యకర్తలు, యువకులు, మహిళలు, కార్మికులు ఈ స్థూపనిర్మాణంలో శ్రమించారు. 246 మంది నాయకులు, కార్యకర్తల పేర్లను శిలాఫలకాల్లో ప్రతిష్టించారు. మే 27వ తేదీన నక్సల్బరీ ఉద్యమ నిర్మాత కా॥ కానూ సన్యాల్‌తో స్థూపావిష్కరణ జరగాల్సి వుండగా ఆనాటి ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. శ్రీకాకుళం పట్టణంలో 144 సెక్షన్ విధించి, పోలీసు బలగాలతో పట్టణాన్ని నింపి యుద్ధవాతావరణాన్ని సృష్టించింది. ఈ స్థూపంపై నిషిద్ధ పీపుల్స్ వార్ గ్రూపుకు చెందిన వారిపేర్లు వున్నాయని, జిల్లాల్లో జరిగిన హత్యలతో వారికి సంబంధం వుందని, బలవంతంగా విరాళాలు వసూలు చేస్తున్నందున ఈ చర్య తీసుకోవాల్సి వచ్చిందని ఎస్.పి. పూర్ణచంద్రరావు ప్రకటించాడు. స్థూపనిర్మాణానికి అనేక విధాలుగా సహకరించిన వారిని బెదిరించాడు. స్థూపాన్ని కూలదోస్తామని హుంకరించాడు. ఏ రాజకీయ సిద్ధాంత దృష్టితో 1969 మే 27న పంచాది కృష్ణమూర్తితోసహా ఆరుగురు ప్రియమైన కామ్రేడ్స్‌ని రాజ్యం బలిగొందో, 1998 మే 27 కూడా అదే కాలం చెల్లిన రాజకీయ సిద్ధాంత దృష్టితో దాడికి పూనుకుంది. తిరిగి మరలా 1999 మే 27న స్థూపావిష్కరణకు పోలీసు యంత్రాంగం అనుమతి నిరాకరించింది. ప్రభుత్వ కుట్రను అర్థం చేసుకున్న ప్రజలు 1999 ఆగస్టు 19న ఎన్నికల సభకి శ్రీకాకుళం వచ్చిన రెండు వేల మంది ప్రజలు, కార్యకర్తలు, నాయకులు ఆ రోజు సాయంత్రం 6 గంటలకు స్థూపాన్ని ఆవిష్కరించారు.***
>
> ***శ్రీకాకుళ గిరిజన రైతాంగ విప్లవోద్యమంలో భాగస్వామి, ఆ ఉద్యమంలోని అనేక మంది అమరవీరులతో సాన్నిహిత్యం గల కామ్రేడ్ గణనాధ్‌పాత్రో పుష్పమాల నుంచి ఈ అమరుల స్మృతిని ఆవిష్కరించారు. కా॥ మండ్ల సుబ్బారెడ్డి స్థూపం వద్ద ఎర్రజెండాను ఆవిష్కరించారు. కార్మిక, మహిళా, విద్యార్థి, యువజన నాయకులు పుష్పాలుంచి శ్రద్ధాంజలి ఘటించారు.***
>
> ***ఒక మనిషిని మరో మనిషి దోపిడీ చేయడాన్ని రూపుమాపి నూతన ప్రజాతంత్ర విప్లవం గుండా సోషలిజం, కమ్యూనిజాలను సాధించాలనే కమ్యూనిస్టు ఆశయాన్ని నిరంతరం చాటుతూ వుంటుంది ఈ 'అమర స్మృతి'. మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచనా విధానానికి కాలం చెల్లలేదని, అది సజీవమైన సిద్ధాంతమని, దానికి చావులేదని నిత్యం సవాల్ చేస్తూ ఉంటుంది 'అమర స్మృతి'.***

అనంతరం జరిగిన సభకు కామ్రేడ్ తాండ్ర అరుణ అధ్యక్షత వహిస్తూ, పాత శ్రీకాకుళం జిల్లాకి ఉద్యమ చరిత్ర వుందని, దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధిగాంచినది శ్రీకాకుళ గిరిజనోద్యం అన్నారు. పేద ప్రజల జీవితాల్లో మార్పు రావాలని, కష్టాల కడలి నుంచి బయటపడాలని, సమసమాజ వ్యవస్థను స్థాపించాలని ఎందరో అమరులయ్యారు. వారిలో వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం ముఖ్యులన్నారు. వారు తమ జీవితాల్ని పేద ప్రజలకోసం అంకితం చేశారన్నారు.

ముఖ్యవక్తగా వచ్చిన రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ ఝాన్సీ మాట్లాడుతూ- ఈ రోజు భారతదేశ చరిత్రలో ముఖ్యమైన రోజన్నారు. పీడిత ప్రజల ప్రియతమ నాయకులు కామ్రేడ్స్ వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసంలు దోపిడీ ప్రభుత్వం యొక్క రాజ్యహింసకు బలై చనిపోయిన రోజన్నారు. ఏమీ తెలియని అమాయక గిరిజనులకి మాట, బాట, ఆట, సంస్కృతిని నేర్పించి వారిని పోరాటయోధులుగా తీర్చిదిద్దినదే శ్రీకాకుళ గిరిజన పోరాటమన్నారు. కమ్యూనిస్టు సిద్ధాంతాల్ని స్వీకరించి, ఆచరించి చూపిన వారు సత్యం, కైలాసంలు. భూస్వాముల, షావుకార్ల, సుండీల, ఫారెస్టు అధికారుల దోపిడీ అణచి వేతలకు వ్యతిరేకంగా సాగినదే శ్రీకాకుళ గిరిజనోద్యమన్నారు. తమ సమస్యలపై ఉద్యమిస్తూనే 1960లో అమెరికా సామ్రాజ్యవాద యుద్ధకాంక్షలో భాగంగా వియత్నాంపై

(తరువాయి 11వ పేజీలో)




చెరుకుపల్లి మండలం కుంచాల వారిపాలెంలో నిర్మించే ఫ్యాబ్రిక్ యూనిట్ నిర్మాణాన్ని వ్యతిరేకించండి! జీవించే హక్కును కాలరాసే పాలకుల విధానాలకు వ్యతిరేకంగా పోరాడండి!!

ప్రజలారా!

చెరుకువల్లి, పిట్టలవానిపాలెం, నగరం, నిజాంపట్నం మండలాల్లోని గ్రామాలు అన్నీ మాగాణి పంట అయిన వరి, ఆరుదల పంటలు అయిన మిర్చి, కూరగాయలు- రెండవ పంటగా వేరుశనగ లాంటి పంటలతో నూటికి 80 మందికి పైగా వ్యవసాయంపై ఆధారపడి వ్యవసాయకూలీలు సన్న, చిన్నకారు, మధ్యతరగతి రైతులు, చేతివృత్తులవారు జీవనం కొనసాగిస్తున్నారు. ఈ గ్రామాలన్నీ పంటలతో, సముద్ర సంపదతో ఎంతో ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణంలో ఉన్నాయి. మరొకప్రక్క 10 వేల ఎకరాలలో రొయ్యలసాగు ద్వారా, నిజాంపట్నం సముద్రంపై కొన్ని వేల కుటుంబాలు సముద్ర సంపదల ఉత్పత్తి ద్వారా కోట్ల రూపాయల విదేశీ మారకద్రవ్యాన్ని సృష్టిస్తూ జీవనం సాగిస్తున్నారు. అనేక చిన్న, సన్నకారు కుటుంబాలు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. ఈ ప్రాంత గ్రామాలన్నీ తెనాలి నుండి నిజాంపట్నం కాలువ నీటిపై ఆధారపడి త్రాగు, సాగునీటి అవసరాలు తీర్చుకుంటున్నారు.

ఈ పరిస్థితుల్లో చెరుకుపల్లి మండలం, కుంచాల వారిపాలెం పంచాయతీ పరిధిలో జయ వెంకటరమణ ఇండస్ట్రీస్ వారు ఫ్యాబ్రిక్ ప్రాసెసింగ్ యూనిట్‌ను నెలకొల్పుటకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ యూనిట్‌లో బట్టల అద్దకానికి సంబంధించిన రంగులను తయారు చేస్తారు. ఆ రంగుల తయారీలో ఫ్యాక్టరీ నుండి సింథటిక్ లాంటి అనేక ఇతర విషపదార్థాలు ఉత్పత్తి అవుతాయి. ముడిపదార్థాల సేకరణలో స్థానిక ప్రజలకు ఏ మార్కెట్ అవకాశాలను ఈ ఫ్యాక్టరీ కలిగించదు. కానీ రోజుకు 3 కోట్ల లీటర్ల నీరు ఈ ఫ్యాక్టరీ పనిచేయడానికి అవసరం. మనం వ్యవసాయం, త్రాగునీటికి ఉపయోగించే తెనాలి-నిజాంపట్నం కాలువ నీటిని ఆ ఫ్యాబ్రిక్ ఫ్యాక్టరీ వాడుకోవటానికి అనుమతి యిచ్చారు. మూడు వంతులకు పైగా కాలువ నీటిని ఆ ఫ్యాక్టరీ వాడుకుంటుంది. దీనితో మన సాగు, త్రాగునీటికి తీవ్ర కొరత ఏర్పడి మన పంట భూములు బీళ్ళుగా మారే ప్రమాదం వుంది. మరోవైపున రోజుకి ఎన్ని కోట్ల లీటర్ల నీటిని వాడుతున్నారో అన్ని కోట్ల లీటర్ల సింథటిక్ రసాయన వ్యర్థ పదార్థాలతో కూడిన విషపు నీరు విడుదలవుతుంది. ఈ విషపు నీరు కాలువ వెంబడి పైపుల ద్వారా 15 కిలో మీటర్ల పొడవునా నిజాంపట్నం-తుంగభద్ర డ్రైన్‌లో కలపటానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ వ్యర్థ పదార్థాల వలన కాలువ నీరు, సముద్రపు నీరు కలుషితమవుతాయి. (ఉదాహరణకు విశాఖపట్నం సముద్ర తీరప్రాంతంలో కెమికల్ కంపెనీలు విడుదల చేసిన వ్యర్థ పదార్థాల వలన సముద్రపు నీరు కలుషితమై సముద్ర సంపద అయిన ఆలివ్ రిడ్లే తాబేళ్ళు అధిక సంఖ్యలో మృతి చెందాయి. టన్నులకొద్దీ చేపలు చనిపోయి తీరానికి కొట్టుకు వచ్చాయి) సముద్రపు నీరు కలుషితం అగుట వలన సముద్రంలోని మత్స్య సంపద (షార్క్ చేపలు లాంటివి) అంతరించిపోయి, సముద్రం మీద ఆధారపడి జీవించే కొన్ని వేల కుటుంబాలు జీవనం కోల్పోయి వీధిన పడతాయి. పంటభూములు, రొయ్యల, చేపల చెరువుల భూములు కలుషితమవటంతో వ్యవసాయంపై ఆధారపడి జీవించే చిన్న, సన్నకారు, మధ్యతరగతి కుటుంబాల ప్రజలు జీవనాధారం కోల్పోతారు.

జల, వాయు కాలుష్యం వలన ప్రజలు, పశువులు అనేక చర్మవ్యాధులు, ఊపిరితిత్తుల వ్యాధులు, మూత్రపిండాలు మరియు కాలేయం (లివర్) సంబంధ వ్యాధులలాంటి దీర్ఘకాల నయంకాని రోగాల బారిన పడతారు.

మనకి ప్రధాన వనరు అయిన వ్యవసాయాన్ని అభివృద్ధి చేయాల్సిన పాలకులు, ప్రభుత్వాలు ప్రత్యేక ఆర్థిక మండళ్ళు (ఎస్.ఈ.జడ్)పేరుతో విదేశీ, స్వదేశీ గుత్త సంస్థలకు మన భూముల్ని లక్షల ఎకరాలు ధారాదత్తంచేస్తూ రైతుల్ని, రైతుకూలీలను భూమికి దూరం చేస్తున్నారు. సారవంతమైన వ్యవసాయ భూములను యిలాంటి యూనిట్ల నిర్మాణానికి అప్పజెప్పడం. అంటే వ్యవసాయంపట్ల, ప్రజలపట్ల పాలకుల నిర్లక్ష్య వైఖరికి అద్దం పడుతుంది. ఈ ఫ్యాక్టరీ ప్రయోజనాలు

(తరువాయి 10వ పేజీలో)

Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet, Vijayawada-2.
Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010

మనము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA102M239
పుస్తకం పేరు	జనశక్తి
తారీఖు	07 February 2025
ముందు అట్ట	NO
వెనుక అట్ట	NO
మొత్తం పేజీలు	13
పెద్ద సైజు పేజీలు	yes
ఖాళీ పేజీలు	NO
లేని పేజీలు	NO
తయారు చేసినది	sk sharmila
పేజీలు విడదీసినది	sk sharmila
స్కాన్ చేసినది	[illegible]
పరీక్ష చేసినది	AMRUTHA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	Good